(Jagruthi) - Life History of Tagore

Raveendruni Balyamu

BB
193

R.B.A.N.M's High School (Main) LIBRARY

ITEM No. 18

R.B.A.N.M.S H S M LIBRARY
B'lore 42
Accession No; 3193
U.D.C No: 8-3p N
Date; 16-4-82

R.B.A.N.M's HIGH SCHOOL (MAIN)
No. 3609
Date 2-1-76
BANGALORE-42

R.B.A.N.M.'s HIGH SCHOOL
No............
Date............
BANGALORE-42

3609
2.1.76

BB
193

R.B.A.N.M.S.H.S. M. LIBRARY
B'lore 42
Accession No ; 3193
U.D.C No : 8-3P N
Date; 16-4-82

# విషయసూచిక


| అధ్యాయము | | | | పేజీ. |
|---|---|---|---|---|
| I | రవీంద్రుని బాల్యము | ... | ... | 1 |
| II | విద్యార్థి దశ | ... | ... | 10 |
| III | కవితా వ్యాసంగము | ... | ... | 21 |
| IV | జాగృతి | ... | ... | 30 |
| V | బంగారు వంగభూమి | ... | ... | 40 |
| VI | శాంతినికేతనము | ... | ... | 50 |
| VII | రాజకీయములు | ... | ... | 61 |
| VIII | ప్రపంచఖ్యాతి | ... | ... | 66 |
| IX | యుద్ధప్రభావము | ... | ... | 75 |
| X | విశ్వభారతి | ... | ... | 85 |
| XI | శ్రీనికేతన్ | ... | ... | 93 |
| XII | కథారచయిత | ... | ... | 101 |
| XIII | నాటకము—నటించుట | ... | ... | 111 |
| XIV | ప్రపంచ పౌరుడు రవీంద్రుడు | ... | ... | 119 |
| XV | అంతిమ దినములు | ... | ... | 127 |


## చిత్ర పటములు


| | | | పేజికి ఎదురుగ. |
|---|---|---|---|
| జీవితమున కడపటి యేట, రవీంద్రుడు | ... | ... | 1 |
| తొమ్మిదవ యేట, రవీంద్రుడు (ఎడమ ప్రక్కన) | | ... | 16 |
| ఇంగ్లండ్‌లో రవీంద్రుడు | ... | ... | 31 |
| రవీంద్రుడు, కుమార్తె బేల | ... | ... | 48 |
| రవీంద్ర రచన—వ్రాతప్రతి | ... | ... | 64 |
| శాంతినికేతనమున ఉత్సవము | ... | ... | 96 |
| వాల్మీకి పాత్రగా రవీంద్రుడు | ... | ... | 112 |
| వృద్ధాప్యమున రవీంద్రుడు | ... | ... | 128 |



జీవితమున కడపటి యేట, రవీంద్రుడు

మొదటి అధ్యాయము

# రవీంద్రుని బాల్యము

నిరంతరము జనసమ్మర్దముతో కిటకిటలాడు కలకత్తా మహానగర మధ్య ప్రాంతమున నున్నది జరశంకో. ఇచట, ఉత్తర దిశనుండి దక్షిణముగా సాగిపోవు రహదారి చిత్ పూర్ రోడ్‌నందు ఎల్లప్పుడు కలవరమే! ట్రామ్‌బండ్ల గంటలు, బస్ హారన్ మ్రోతలు, లారీల ధ్వనులు ఎడతెగక మ్రోగుచునే యుండును. ఇక, వీధియంతయు దుకాణముల మయమే! బట్టల కొట్లు, టోపీల అంగళ్లు, మిఠాయి దుకాణములు వీధికి రెండువైపుల కానవగును. అక్కడనే సంగీత వాద్యముల దుకాణముకూడ. దాని ప్రక్కనే, చిన్న సందొకటి మళుపు తిరుగును. ఆ సందు చివరనున్న విశాల భవనమే ఠాకూర్ వంశీయుల నివాసస్థానము. అది మూడంతస్థుల పురాతన భవనము. ఇంటిచుట్టు విశాలమైన వసారాలు; ఇంటిముందు రెండు ఎత్తైన ఇనుప వాకిళ్లు. ఈ ఇంటియందే 1861, మే 7-వ తేదీన రవీంద్రుడు జన్మించెను.

రవీంద్రుని తండ్రిపేరు దేవేంద్రనాథ్ ఠాకూర్. ఆయన మహాజ్ఞాని. అమిత సాధువు. ఆయన మంచితనమును, భక్తిని చూచి ప్రజలాయనను 'మహర్షి' యని సంబోధించుచుండిరి. దేవేంద్రుని తండ్రి ద్వారకనాథ్ ఠాకూర్. ఆయన చాల ధనవంతుడు. గొప్ప హోదాతో జీవించుచుండెను. అందు వలననే ఆయనకు 'మహారాజు' అను బిరుదు వచ్చెను.





రవీంద్రుని జనన కాలమునకు ఆ కుటుంబమువారు తమ ఆస్తిని చాలభాగము కోల్పోయియుండిరి. అయినను, ఇంకను అధిక ధనవంతులనియే చెప్పదగియుండిరి. బిడ్డల నందరను పెద్ద చదువులు చదివింపకలిగిరి. ఠాకూర్ కుటుంబము చాల పెద్దది. రవీంద్రుడు మహర్షికి పదునాల్గవ సంతానము. ఆఖరు బిడ్డ. అప్పటికే రవీంద్రుని అన్నలు, అక్కలు చాలమంది పెరిగి పెద్దవారై గృహస్థాశ్రమము స్వీకరించి యుండిరి. రవీంద్రునికి బాల్యమున నాడుకొనుటకు గూడ సమవయస్కు-లెవ్వరును లేకుండిరి. ఆతని కడపటి అన్నగారు సోమేంద్ర, అక్కకొడుకు సత్య కూడ, రవీంద్రుని కన్న రెండు సంవత్సరములు పెద్దవారు. ఈ ముగ్గురును మాత్రము ఎప్పుడును కలసి ఆడుకొనుచు కలసియే బడికి పోవుచుండిరి.

రవీంద్రుడే స్వయముగ తన రచనలలో తన చిన్ననాటి విషయములను వర్ణించి చెప్పియున్నాడు. ఆతని My Reminiscences (నా జ్ఞాపకములు) అను గ్రంథములో రవీంద్రుడు తనకు పాతిక సంవత్సరములు వచ్చువరకు జరిగిన విషయములు వర్ణించెను. My Childhood Days (నా చిన్ననాటి రోజులు) అను గ్రంథములో తన పదునేడవయేట తను ఇంగ్లండుకు వెళ్లినంతవరకు జరిగిన గాథను చెప్పెను. ఇందు, మొదటి గ్రంథములో లేని క్రొత్త సంగతులెన్నో చేర్చెను. The Crescent Moon (బాలచంద్రుడు) పసిపిల్లల భావముల ననుసరించి చిన్నచిన్న పద్యములతో కూర్చిన గ్రంథము. ఇందు చాలవరకు రవీంద్రుని బాల్య స్మృతులే! ఈ గ్రంథముల సహాయమున రవీంద్రుని బాల్యదశను మనము చక్కగా ఊహించు కొనగలము.

రవీంద్రుని ఇంటిలో పిల్లలకు అనువైన ఆటవస్తువులు కాని, సౌకర్యములు కాని, ఎక్కువగా ఉండెడివికావు. పిల్లలను ఎక్కువ భోగ విలాసములతో పెంచుట మహర్షికి ఇష్టములేదు. తరువాత కాలమున రవీంద్రుడు తండ్రియొక్క సదుద్దేశములను గ్రహించి ఆ పద్ధతులనే ఉత్తమముగా భావించెను. పిల్లలకు మితిమీరిన ఆటవస్తువు లున్నప్పుడు వారి సహజ ఉత్పత్తి, భావనా శక్తి మందమగును; పెద్దవారిచ్చిన బొమ్మలతో ఉత్సాహము త్వరగా నశించును. స్వయముగా క్రొత్త బొమ్మల నెన్నుకొను నేర్పు తగ్గిపోవును. ఠాకూర్ ఇంటిలో పిల్లలు తమకు దొరికిన బొమ్మలను ఎన్నుకొని ఆ బొమ్మలతోనే ఆనందించుచుండిరి. The Crescent Moon నందు 'ఆటవస్తువులు' అను పేరుతో ఒక పద్యమున్నది. చిన్న పిల్లల, పెద్దవారి మనస్తత్వములో గల భేదము ఇందు విశద మగును. పసిబాలుని సంబోధించి తండ్రి ఇట్లనును:

పాపా! ధూళిలో నాడుచు నానందింతువు నీవు;
ప్రొద్దంతా, నలిగిన గడ్డిపరకలతోనేనా, నీ ఆటంతా!
నాకు నవ్వువచ్చుచున్నది.

పుల్లలతో, మట్టితో నాడుట నేనెన్నడో మరచిపోతిని.
వెండి, బంగారు నాణెములే నా కాట వస్తువులిపుడు!
దొరికిన దానితో నాడుచు నానందముతో కాలమాపన
చేతువు నీవు; దొరకని వస్తువుకొరకే వెదకుదును నేను!

రవీంద్రుని ఇంటిలో పిల్లలకు స్వేచ్ఛ తక్కువ. వాకిలి దాటి వెళ్లుటకు ఎవరికిని స్వాతంత్ర్యములేదు. కనుక, పిల్లలకు బాహ్యప్రపంచ స్వరూపము అంతగా తెలియదు. లోపల, బయట, స్వేచ్ఛగా తిరుగు నౌకర్లను చూచి వారు అసూయ

జెండెడివారు. ఆ దినములలో ట్రాములుగాని, బస్సులుగాని లేవు. ధనవంతులకు సొంత గుఱ్ఱపుబండ్లు ఉండెడివి. ఈ బండ్లు వీధిలో పోవుచుండగా, పిల్లలకు బండిచక్రముల ధ్వనులు, కొరడా చప్పుడు, వినిపించుచుండెడివి. ధనవంతులు కానివారు మేనాసవారీలలోగాని, అద్దెబండ్లలోగాని, వెళ్లెడివారు. వీధిలో పువ్వులు, పండ్లు అమ్మువారి కేకలుకూడ లోపలివారికి వినిపించుచుండెడివి. రవీంద్రునికి ఇవి అన్నియు వినుటకెంతో ఆనందముగా నుండెడిది. వసారా చివరనుండి ఒకవైపు తోటగోడ మీదుగా బయట 'బస్తీ' కనిపించెడిది. రవీంద్రుడు గంటల తరబడి, అక్కడి ప్రజల దినచర్యలు గమనించుచు, వారి చుట్టు కథలల్లుకొనుచు గడిపెడివాడు. ఎప్పుడును ఇల్లు దాటి ఎరుగకపోవుటచే, బయటి ప్రపంచమంతయు రవీంద్రునికి అద్భుతమైన ఊహలతో కూడి యుండెడిది.

గృహావరణములో కూడ రవీంద్రునికి, తక్కిన పిల్లలకు స్వేచ్ఛ తక్కువ. పెద్దవారి వ్యాపకములు, సంస్కారములు వేరు; పిన్నవారి ప్రపంచము వేరు. ఆ దినములలో సినిమాలు, ఆటలు మున్నగు వినోదములు లేవు. అందరు తమ తమ గృహములలోనే అతిథుల నాహ్వానించి వినోద కాలక్షేపములు చేయుచుండెడివారు. రవీంద్రుని ఇంటిలో ఇటువంటి వినోదములకు కొరత లేదు; కాని, వానితో పిల్లలకు మాత్రము సంపర్కము లేదు. రవీంద్రుని అన్నలు, బంధువులు వారి నెప్పుడు దూరముగాబోయి యాడుకొనుమని మందలించెడివారు. ఐనను, వారు ఆడుకొనునప్పుడు, తిరిగి, ఆ గొడవ భరించలేక నిశ్శబ్దముగా నుండుడని విసుగుకొనెడివారు.

బాల్యములో రవీంద్రునికి తనను పెంచిన సేవకులతో ఎక్కువ సన్నిహిత సంబంధ ముండెడిది. ఆ జీవితమును గురించి అతడు అనేక గాథలను మనకు తెల్పియున్నాడు. తాను తల్లితో గడిపిన గడియలు, అన్న సోమేంద్రునితోను, మేనల్లుడు సత్యతోను ఆడిన ఆటలు అన్నియు నేకవరుసగా కాకపోయినను అక్కడక్కడ గ్రంథస్థము చేసినాడు. రవీంద్రుడు ఎక్కువగా బాల్యములో ఒంటరి జీవితమునే గడిపెను. సోమేంద్రుడు, సత్య ఇద్దరుకూడ, రవీంద్రుని కన్న రెండు సంవత్సరములు పెద్దవారు. ఆ కారణముచేత వారు రవీంద్రుని పసివానిగా తరచు తోసివేసెడివారు! రవీంద్రుడు తన పసితనమును గురించి చెప్పిన గాథలు కొన్ని అతి మనోహరములు. బాలుర మనస్తత్వము నవి చక్కగా విశదపరచును.

* * * *

ఒకసారి, పిల్లలందరు క్రొత్త బట్టలు కుట్టించుకొనిరి. దర్జీ కొలతలు తీసుకొనుచుండెను. పిల్లలందరు ఏక కంఠముతో 'మాకు జేబులు కావాలి! చాలా జేబులు కావాలి' అని అరచిరి. వారి ఉత్సాహము వర్ణింప నలవికానిది. క్రమేణా, ఆ జేబులనిండా రకరకాల వస్తువులు జేరును. పిల్లలు తమ చెప్పులు ఎగురవేసుకొంటూ, 'క్రొత్త చొక్కాలు వస్తాయి, క్రొత్త చొక్కాలు వస్తాయి' అని గంతులు వేసిరి. వారికి చెప్పులుకూడ ఆట వస్తువులే!

* * * *

ఇంకొకసారి, పిల్లలందరు తాము చదువుకొను గదిలో జేరి మట్టితోను, రాళ్లతోను పెద్ద పర్వతమును నిర్మించుచుండిరి. గది అంతయు చిందర వందరగా, చిరాకుగా నుండెను. కాని,

పిల్లల ఆనందమునకు మేరలేదు. వారెప్పుడును పర్వతములను చూచి యెరుగరు. అది వారికొక వింత వస్తువు. కాని, వారి ప్రయత్నము సఫలము కాలేదు. ఉన్నట్లుండి, వారి అన్న వచ్చి వారిపై కోపపడి రాళ్లన్నీ తిరిగి తోటలో పార వేయించెను. పిల్లల కలలు పెద్దవారికి అర్థము కావు.

* * * *

పిల్లలకు ఆహారము పెట్టి సంరక్షించు భారము వజ్రేశ్వరుడను ముసలి బ్రాహ్మణునిది. అతడు పరమ ఛాందసుడు. కొలనులో స్నానముచేసిన పిదప నేలతగిలిన మైలపడిపోదునేమో అని భయపడువాడు. అంతేకాక, భోజనప్రియుడు. పాపము! రవీంద్రునికి, తక్కిన పిల్లలకు, ఎప్పుడును సరిగా ఆహారము పెట్టి యెరుగడు. అంతా తనకొరకు దాచుకొనెడివాడు. పిల్లలుకూడ, అతనికి లేకపోవునని మొహమాటపడి తక్కువ తిని, తృప్తిపడెడివారు. అసలు, రవికి భోజనముపై ధ్యాస తక్కువ.

* * * *

ఒకప్పుడు, పిల్లలు సాయంత్రపువేళ, నౌకర్ల గదిలో చేరెడివారు. ఆ రోజులలో విద్యుద్దీపములుగాని, కిరోసిన్ దీపములుగాని లేవు. వత్తి దీప మొకటి మాత్రము గది మధ్య వ్రేలాడుచుండెడిది. దాని క్రింద, అందరు గుంపుగా కూర్చొని కథలు చెప్పుకొనెడువారు. ఒక్కొకసారి, ఎవరో ఒకరు రామాయణమును చదివి వినిపించెడువారు. ఇది చక్కని వరుసలతో, వినుట కింపుగా నుండెడిది. ఒక్కొకసారి బందిపోటుదొంగల కథలు చెప్పెడివారు. ఆ దొంగల ధైర్య సాహసములు, నేర్పు, రవిని ఎంతో ఆకర్షించెడివి. అతనికి

ఆ దొంగలను ఎప్పుడైనా చూడవలెనని కుతూహలముగా నుండెడిది.

నౌకర్ల గదికి వెళ్లినప్పుడు, రవి తల్లిదగ్గరకుపోయి, ఆమె మంచముమీద పడుకొని కథలు వినుచుండెడివాడు. అతని తల్లిగాని, అత్తగాని యేవో వింత కథలు చెప్పుచుండెడివారు. సప్త సముద్రములు దాటి స్వప్నలోకమును జేరిన రాకుమారుని ధైర్య సాహసములవంటివి ఎన్నో, రవి ఆనందముతో, ఆశ్చర్యముతో వినుచుండెడివాడు.

*　　*　　*　　*

ఒకసారి, నౌకరు వసారాలో సుద్దముక్కతో గిరిగీసి, రవిని అందు కూర్చుండబెట్టెను. అది లక్ష్మణుడు సీత చుట్టును గీసిన గిరివంటిదని, అది దాటి బయటికి వచ్చినచో ననర్థమని చెప్పెను. రవి ఆ మాటలను నమ్మెను. ఆ నౌకరు గిరిదాటి రావచ్చునని చెప్పువరకు, సాయంత్రమువరకు, రవి యట్లే కూర్చొని యుండెను. బయటి ఆవరణలో తిరుగు మనుష్యులను, కొలనులో తిరుగు బాతులను, దూరదూరముగా చెదరియున్న చెట్ల నీడలను, చూచుచు తన్మయుడై దినమంతయు గడిపెను. ఆ చెట్ల నీడలలో ఏవో గొప్ప రహస్యము లిమిడియున్నవని రవి పసి ఊహ.

ఒకప్పుడు, రవి ఒంటరిగ ఆ విశాల భవనములో గదిగది వెదకుచు తిరిగెడివాడు. రవి బాల్యములో నీటి కొళాయిలు లేవు. మాఘమాసములో నీరు తేటగా నున్నప్పుడు ఏడాదికి సరిపడిన నీరు గంగానదినుంచి తెచ్చి పెద్దపెద్ద మట్టి కుండలలో చీకటి గదులలో నిలువచేసెడివారు. రవి ఈ గదులన్నియు పరిశోధించి అక్కడ దయ్యములు, భూతములు ఉన్న వేమోనని

భయపడెడివాడు. ఆ భూతములకు పెద్దపెద్ద కళ్ళు, దొప్పల వంటి విశాలమైన చెవులు, ఉండునని అనుకొనెడివాడు. పెద్ద పెద్ద చెట్లలో కూడ, భూతములుండునని రవి అనుమానము. ఎప్పుడో ఒక దాసి 'ఆ చెట్లలో భూతమును చూచితి'నని చెప్పెను. పసితనమున రవి ఆ మాటలను విశ్వసించెను.

* * * *

కైలాస్ 'మహర్షి' కార్యాలయములో గుమాస్తా. రవి అతని దగ్గర కథలు వినుచుండెడివాడు. ఆ కథలలో తానే నాయకుడైనట్లు దొంగలను జయించి రాకుమార్తెలను రక్షించునట్లు ఊహించుకొనువాడు. కొంచెము పెద్దవాడై తాను కథలు వ్రాయుట ప్రారంభించినప్పుడు కూడ రవికి ఈ కైలాసే తోడ్పడెను. అతడిచ్చిన తెల్ల కాగితముల పుస్తకమే రవికి మొట్టమొదట వ్రాసికొనుట కుపకరించెను.

* * * *

తరచు రవి ఒంటరిగనే ఆడుకొనుచుండెడివాడు. ఒకసారి, వసారాలో ఒక మూల దుమ్ము చేరినపుడు, రవి అక్కడొక వెలగగింజ నాటెను. ఆ తరువాత రోజురోజు, మొక్కకొరకు ఎదురుచూచెడివాడు. కాని, పాపము! రవి కోరిక ఫలించకుండగనే దాసీ ఆ దుమ్ము తుడిచివేసినది.

ఒక్కొక్కసారి రవి ఒంటరిగ బడిఆట ఆడెడివాడు. వసారాలోని కిటికీ కమ్ములన్నీ అతని శిష్యులు. ఒక బెత్తముతో వానిని బాదుచు పాఠము రాలేదని తిట్టుచు ఆడుకొనుచుండెడివాడు. ఇంకొకసారి, పూజలుచేయుచు ఏవేవో మంత్రములు చదువుచుండెడివాడు. పూర్వకాలమున అశ్వములను బలి ఇచ్చుటకన్న సింహములను బలి ఇచ్చుట శ్రేష్ఠమని

యాతడనుకొనెను. అతనివద్ద నొక చిన్న కొయ్యసింహము ఉండెడిది. ప్రతిదినము దానిని కర్రతో బాదుచు బలియిచ్చుచుండెడివాడు.

కొంచెము ఎదిగి పెద్దవాడైనకొలది, రవీంద్రుడు తనకు తానే కథలు చెప్పుకొనసాగెను. అతని కల్పనాశక్తి వింతగా రూపొందెను. దొంగల కథలు, పులివేట కథలు, ఎన్నో తనకుతానే కల్పించుకొని ఆనందించెడివాడు. నిత్యజీవితము ఏ ఒడిదుడుకులు, వింతలు లేక ప్రశాంతముగా గడచిపోవుచున్నను, రవీంద్రుని ఊహాప్రపంచము అద్భుత సాహసములతోను వింతలతోను నిండియుండెడిది. వసారాలో, విరిగిపోయిన పాత మేనాలో తలుపులు మూసికొని కూర్చుని కల్పనా జగత్తులో మునిగిపోయెడివాడు. తాను అడవులలో తిరుగుచున్నట్లు, వింత నదులలో హంసల పడవలలో తేలిపోవుచున్నట్లు ఊహించుకొనువాడు.

The Crescent Moon లో The Hero (వీరుడు) అను పద్యము ఇటువంటి అనుభవమునే వర్ణించును.

బాల్యదశలో కూడ, రవీంద్రుడు ప్రకృతి సౌందర్యమునకు ముగ్ధుడగుచుండెను. కాని, తన భావములను మాత్రము స్పష్టముగా వ్యక్తము చేయలేకుండెను. ప్రతి ఉదయము, లేవగనే, తోటలోనికి వెళ్లి అక్కడ పచ్చని ఆకులను, మంచుతో నిండిన పచ్చికబయళ్లను చూచి ఆనందించుచు, అప్పుడే పూసిన పూవుల తావికి తన్మయుడగుచుండెను. ఆతనికి వర్షఋతువన్నను, వానయన్నను, మిక్కిలి ప్రీతి. వర్షమును వర్ణించు పద్యములను కూడ వర్ణించుచు మరల మరల చదివి ఆనందించెడివాడు. ఆతడు మొట్టమొదట బెంగాలీ వాచక

ములో నేర్చుకొనిన వానపాటలు జీవితాంతమువరకు జ్ఞాపకముంచుకొనెను. ప్రకృతి సౌందర్యమే కాక, ప్రకృతి రహస్యము కూడ అతనిని చిన్నతనమందే ఆకర్షించెను. సారములేని భూమి, అంతులేని ఆకాశము అతనిని ఆశ్చర్యములో ముంచెత్తుచుండెను. ఏదైన శుభకార్యక్రమమునకు పందిళ్లు వేయునప్పుడు స్తంభములు నాటుటకు గోతులు త్రవ్వెడివారు. అది యెప్పుడును రవీంద్రునికి కుతూహలమును కలిగించెడిది. ఇంక కొంచెము లోతుగా త్రవ్వినచో భూగర్భమున ఏవేవో వింత వస్తువులు దొరకునని అతని ఉద్దేశ్యము. పసితనమునుండియు నతనికి మధ్యాహ్నకాల మెక్కువ ఇష్టము. ఎండవేళ ఇంటిలో అందరు నిద్రించుచుండగా, పట్టణమంతయు మాటు మణిగినప్పుడు, రవీంద్రునికి స్వేచ్ఛగా కల్పనాజగత్తులో విహరించుటకు అవకాశము దొరికెడిది. తరచుగా మేడమీద ఏ మూల గదికో పోయి, నీలాకాశమును చూచుచు, పక్షుల పరస్పరాహ్వానములను వినుచుండెడివాడు.

## రెండవ అధ్యాయము

# విద్యార్థి దశ

సోమేంద్రుడు, సత్య బడికిపోవుట ప్రారంభించగనే, రవి తానుకూడ పోవలెనని ఉత్సాహపడెను. రవి వారికన్న రెండు సంవత్సరములు చిన్నవాడు. మహర్షి రవి ఇంకను కొన్ని సంవత్సరములు ఇంటియందే ఉండి చదువుకొనవచ్చు నను కొనెను. కాని, రవికి ఇల్లు పెద్ద బందిఖానావలె తోచు

చుండెను. బడికిపోవుట అనగా విశాల ప్రపంచములోనికి అడుగుపెట్టి స్వేచ్ఛగా తిరుగుటయని భావించెను. ఆ కారణము చేత పెద్దవారు వలదన్నను వినక పట్టుబట్టి బడికేగెను. ఆతని బంధువులు 'నీవింతగా ఉత్సాహపడుచున్నావు; కాని, త్వరలోనే బడికిపోనని మారము చేయుదు' వని పరిహసించిరి. రవి తన పట్టు విడువలేదు. కాని, కొన్ని దినములకే రవికి పాఠశాల ఇంటిని మించిన చెఱసాల యని తెలిసెను. ఆతడు దానిని 'అండమాన్ ద్వీప' మని పిలుచుచుండెను.

ఆ కాలమున బడి పిల్లలెవరికిని ఉత్సాహజనకముగా నుండెడిది కాదు. కరకు బల్లలు, ఎత్తుగోడలు చూడగనే నిరుత్సాహము గొల్పుచుండెడివి. ఇక్కడ ఉదయమునుండి సాయంత్రమువరకు పిల్లలకు ఆ చెర తప్పకుండెను. ఏ పిల్లవానికైన పాఠము రాకపోయినచో బల్లమీద నిలబెట్టి చేతులు జాపమని వానిమీద పలకలు బొత్తులుగా పేర్చి పెట్టెడివారు. పంతులుగారు అనుమతిచ్చువరకు ఆ బాలుడట్లే నిలుబడవలెను. పంతులుగారనగా పేము బెత్తమేనని రవి భావన. బడియందలి ఇతర బాలురు కూడ స్నేహపాత్రులు కారు. ఠాకూర్ ఇంటి పిల్లలకు, వారికి, నడవడిలో, మాటలలో, అలవాట్లలో ఎంతో భేదముండెడిది. అందుచేత, వారితో వీరికి సంపర్కముండెడిది కాదు. కాని, కొలది కాలములోనే ఠాకూర్ ఇంటి పిల్లలు ఈ బడిని విడిచిపెట్టి మరియొక బడిలో చేరిరి.

రవికి అప్పుడు తొమ్మిది, పది సంవత్సరముల వయస్సు మాత్రముండెను. విద్యార్థి దశలో రవికి లేశమాత్రమైనను తీరిక ఉండెడిది కాదు. రవి తండ్రిగారు తరచుగ ఇల్లు విడచి వెళ్లవలసి ఉండెడిది. అందున, రవి మూడవ అన్నగారగు

హేమేంద్రనాథ్ పిల్లల చదువు సంగతి చూచుచుండెను. పిల్లలకు మంచి చదువు చెప్పింపవలెనని ఆతని ఉద్దేశ్యము. ఒక్క ఆదివారము తప్ప పిల్లలకు క్షణమైన తీరిక యుండెడిది కాదు. ఉదయాస్తమానము, ఏదో ఒకటి చదువవలసి ఉండెడిది. చీకటితో లేచి రవి మొట్టమొదట గృహావరణలో కసరత్తు నేర్చుకొనెడివాడు. తరువాత, ఏడు గంటలకు రవి, సోమేంద్ర, సత్య, రవి అక్కగారు అందరుకలిసి ఒక పంతులుగారి వద్ద చదువుకొనెడివారు.

ఆ రోజులలో బెంగాల్‌లో అన్ని విషయములు ఆంగ్ల భాషలోనే చెప్పుట ఆచారము. కాని, హేమేంద్రనాథ్ ఈ పద్ధతిని అనుసరించలేదు. పిల్లలు అన్ని విషయములు బెంగాలీ లోనే నేర్చుకొనెడివారు. రవి ఈ విషయమును పెద్దవాడైన తరువాత చాల మెచ్చుకొనెను. భోజనములో మొదటి ముద్ద వలెనే చదువులోకూడ మొదటి పాఠమే తప్పక రుచిగా నుండవలెను. మొట్టమొదటి పాఠమే అర్థము కాని భాషలో చెప్పినచో, బాలునికి చదువునందే విరక్తి కలుగును.

ఉదయము ఏడు గంటలనుండి తొమ్మిదివరకు వారు సాహిత్యము, గణిత శాస్త్రము, శారీరక శాస్త్రము మున్నగునవి నేర్చుకొనెడివారు. విజ్ఞాన శాస్త్రము ప్రత్యేకముగ మరియొక అధ్యాపకుని వద్ద నేర్చుకొనెడివారు. ఆతడు మామూలు వస్తువులతోనే అనేక ప్రయోగములను వారికి చేసి చూపించెడివాడు. రవికి ఈ పాఠమనిన మిక్కిలి ఇష్టముగా నుండెడిది. ఏ కారణముచేతనైన ఒక రోజు అధ్యాపకుడు రాకపోయినచో రవి చాల నిరుత్సాహ పడెడివాడు. తొమ్మిది గంటలకు వారు స్నానము చేసి, భోజనము చేసి బడికి

పోయెడివారు. సాయంత్రము నాలుగు గంటలకు తిరిగివచ్చి, వెంటనే ఒక గంటసేపు కసరత్తు, చిత్రలేఖనము నేర్చుకొనెడివారు. రాత్రి భోజనము చేసిన తరువాత, గుడ్డి దీపము మినుకు మినుకుమనుచుండగా ఆంగ్ల పాఠము ప్రారంభించెడివారు. అలసిపోయి నిద్రకళ్లతో నున్న రవికి ఈ ఇంగ్లీషు పాఠము ఎంతో విసుగుగా నుండెడిది. పుస్తకములో ప్రతి పాఠము మొదట క్రొత్త మాటలు అర్థములతో సహా పెద్దపెద్ద అక్షరములతో ఉండెడివి. రవికి అవి అన్నియు నాయుధపాణులైన సైనికులవలె తోచి భయము గొల్పుచుండెడివి. రాత్రి తొమ్మిది గంటలకు పాఠములనుండి విడుదలపొంది రవి తన తల్లిదగ్గర చేరి కథలు చెప్పుమని నిర్బంధించెడివాడు. కాని, ఆమె కథ ప్రారంభించగనే పాపము 'ఊ' కొట్టుచునే నిద్ర పోయెడివాడు.

ఇటువంటి కఠినమైన కార్యక్రమము రవీంద్రునికి చాల బాధగా నుండుటలో వింతలేదు. ఏ విధముగనైన దానినుండి తప్పించుకొనవలెనని రవి విశ్వప్రయత్నము జేసెడివాడు. కాని, అధ్యాపకుడు కుంభవర్షము కురిసినను రాక మానెడివాడు కాడు. దురదృష్టవశాత్తు, ఆయన ఆరోగ్యముగూడ నెప్పుడును చక్కగనే యుండెడిది. ఇక రవికి తనకే జబ్బుచేసిన బాగుండు ననిపించెడిది. మంచులో పడుకొని, వర్షములో తడిసి జ్వరము తెప్పించుకొనవలెనని యెంత ప్రయత్నించినను, రవి కోరిక ఫలించలేదు. ఇక, లాభములేక ఒక్కొక్కసారి రవి ఊరకనే తల్లివద్దకు వెళ్లి కడుపునొప్పిగా నున్నదని చెప్పెడివాడు. పాపము! ఈ కడుపునొప్పి సంగతి ఆమెకు బాగుగ తెలియును. నవ్వుకొని, అధ్యాపకుని రావలదని కబురుచేసెడిది. రవికి



ఈ మందు అమోఘముగా పనిచేసెడిది. వ్రజేశ్వరుడు రవికి యెప్పుడును సరిగా భోజనము పెట్టి యెరుగడు. బహుశా ఆ కారణము చేతనేనేమో, రవి ఆరోగ్యము ఎప్పుడు చక్కగా నుండెడిది. పెద్దవాడైన తరువాత, రవీంద్రుడు నవ్వుచు, వ్రజేశ్వరుని వంటి నౌకరున్నచో భోజనము ఖర్చు, వైద్యుని ఖర్చు ఉండవని చెప్పుచుండెడివాడు.

ఆ రోజులలో తను పడిన ఆవేదనను వ్యక్తము చేయుచు Once There was a King ('అనగా అనగా ఒకరాజు') అనే కథలో ఇట్లు చెప్పెను: 'ఆ కథ తొలిసారి నేను విన్న రోజు నాకు బాగా జ్ఞాపకమున్నది. ఆవేళ పెద్ద గాలివాన. ఎడతెగక వర్షము కురియుచుండెను. పట్టణమంతయు జలప్రవాహమే. మా వీధిలో నీరు మోకాలి లోతున నుండెను. ఈ గాలివాన చూచి నాకు ఆ రోజు పంతులుగారు తప్పక రారని నమ్మకము కల్గెను. ఆ ఆశతోనే వసారా చివర చిన్న బల్లపైన కూర్చుని వీధివైపు ఆతురతతో చూచుచుంటిని. క్షణక్షణము హృదయా వేగము హెచ్చుచుండెను. వాన కొంచెము తగ్గినచో, భయముతో, మా పంతులుగారు వచ్చు సమయము దాటు వరకు వాన అధికము కావలెనని భగవంతుని ప్రార్థించుచుంటిని. ఒక పసివానిని పంతులు బారినుండి తప్పించుటకన్న వర్షము కురియుటవలన అధిక ప్రయోజనము లేదని అప్పటి నా విశ్వాసము.

'నా ప్రార్థనవలన కాకపోయినను, సహజముగనే, వాన మాత్రము తగ్గలేదు. కాని, లాభమేమి? మా పంతులు గూడ రాక మానలేదు. సరిగా, ఏడున్నర గంటలకు మా సందు చివర ఆయన గొడుగు ముందుకు సాగి వచ్చుచుండెను. ఒక్క

సారిగా నా గుండె జారిపోయెను. నిరాశ, నిరుత్సాహము ముందుకు వచ్చెను. ముందుజన్మలో నేను పంతులుగాను, మా పంతులు నా శిష్యునిగాను జన్మించవలెనని శపించితిని!'

'ఆయన గొడుగు కనిపించగానే నేను శక్తికొలది, అతి వేగముగా మా తల్లిగారి వద్దకు పరుగెత్తితిని. అప్పుడు మా అమ్మ, అవ్వ, ఇద్దరు గదిలో దీపము వెలిగించి చీట్ల పేక నాడుచుండిరి.' నేను మా తల్లి ప్రక్కన మంచముమీాద పరుండి, "అమ్మా! తలనొప్పివలన నా తల పగిలిపోవుచున్నది. పంతులు వచ్చినాడు. ఈ పూటకు పాఠము వద్దని చెప్ప కూడదా?" అంటిని. మా అమ్మ నా వంక చూడనైన చూడ లేదు. నౌకరుతో "పంతులుగారిని ఇంటికి వెళ్లవచ్చునని చెప్పు" మనెను. తిరిగి, తన పేకాటలో మునిగిపోయెను. నా తలనొప్పిని గురించి ఆమె యేమియు బాధపడలేదు. నేను దిండులో తలదూర్చి నవ్వుకొంటిని. మా అమ్మకు నా విషయము చక్కగా తెలియును.

'అయితే, ఊహ తెలియని పసిపిల్ల లెవ్వరును ఈ కథ చదువకుందురుగాక యని నే నాశించుచున్నాను. నేను చేసిన పని తప్పని ఇప్పుడు నాకు తెలియును.'

రవీంద్రుడు తన విద్యార్థిదశను గురించి, పాఠశాలలో తాను గడిపిన దినముల గురించి, చిత్రమైన గాథలు తెల్పి యున్నాడు. అతని కుటుంబములో నందరు తెల్లని దేహచ్ఛాయ గలవారే. అతని సహాధ్యాయులందరును ఠాకూర్ కుటుంబ ములో యూరోపియనులవలె నుండుటకై పసిపిల్లలను పుట్టగనే మద్యమునందు ముంచెదరని పరిహసించుచుండిరి. బెంగాల్‌లో ఆ రోజులలో ఆడపిల్ల లెవరును బడికిపోవు వాడుక లేదు.

మొట్టమొదట బడికివెళ్లినది రవీంద్రుని అక్కగారే. ఒకరోజు కలకత్తాలో ఆమె మేనా సవారీ నెక్కి బడికిపోవుచుండగా, రక్షకభటులు మేనాను అడ్డగించిరి. ఆమె యెవరో అపహరింప బడిన యూరోపియన్ కన్యయని వారనుకొనిరి!

రవీంద్రుని బడిలో నొక బాలుడు తనకు మంత్రములు మాయలు తెలియునని గొప్పలు చెప్పుకొనుచుండెను. ఎన్నో ప్రయోగములు తానిదివరకు చేసినట్లుగా రవికి చెప్పుచుండెను. రవి ఆ మాటలు నమ్మి ఆ ప్రయోగములు తానుకూడ చేయ వలెనని ఉత్సాహపడుచుండెను. కాని, ఆతనికి తగిన సామగ్రి ఎప్పుడును లభించెడిది కాదు. ఒకసారి, ఆ బాలుడు రవికి ఏదైన ఒక విత్తనమును నాగజెముడు రసముతో ఇరువది సారులు ముంచి ఎండబెట్టి నాటినచో గంటలోపలనే చెట్టు మొలచి, కాయలు కాచి, పండ్లు పండునని చెప్పెను. రవి తోటవానిని బ్రతిమాలి నాగజెముడు రసమును తెచ్చి అందులో మామిడి టెంకను ముంచి నాటెను. కాని, పాపము! మామిడిపండ్లు మాత్రము లభింపలేదు. అంతా వృథా ప్రయాస!

రవి ఆ మామిడి టెంకను రసములో ముంచి నాటు చుండగా సత్య, మాంత్రికుడు గుసగుస లాడుకొనుచుండిరి. రవి అది వినిపించుకొనలేదు. వారు మాత్రము ఏదో చెప్పు కొనుచు, రవిని తదేకదీక్షతో పరిశీలించుచుండిరి. మరునాడు ఆ మాంత్రికుడు బడిలో పిల్లలను జేరదీసి వారిని ఒక్కొక్కరిని బెంచిపై నుండి క్రిందికి దుముకమనెను. ఆ తరువాత నొకనాడు రవి, సత్య ఆ మాంత్రికుని ఇంటికి వెళ్లిరి. అప్పుడక్కడ చాల మంది అతిథులుండిరి. వారి కోరికపై రవి అక్కడ కొన్ని పాటలు పాడెను. రవి కంఠము సన్నగా పసిపిల్లవాని గాత్రము

తొమ్మిదవ యేట, రవీంద్రుడు (ఎడమ ప్రక్కన)

వలె నుండును. మాంత్రికుడు వారికి ఫలహారములు తెచ్చి పెట్టెను. సిగ్గుచేత రవి ఏమియు తినలేదు. ఆతనికి అందరి యెదుట తినుటగాని, ఎక్కువగా తినుటగాని అలవాటులేదు. మరి కొన్నాళ్లకు, మాంత్రికుడు రవి కొక ప్రేమలేఖ వ్రాసెను. రవి ఆశ్చర్యమునకు మేరలేదు; కాని, సత్య మాత్రము కడుపుబ్బ నవ్వుచుండెను. తాను పన్నిన తంత్రమును తరువాత రవికి విప్పి చెప్పెను. రవి మామిడిటెంక మొలిపించుటలో నిమగ్నుడై యుండగా సత్య మాంత్రికునితో రవి నిజముగ ఆడపిల్లయని, బాగుగ చదివించుటకు మగదుస్తులు వేసి బడికి పంపుచుండిరని చెప్పెను. దానికి తగినట్టు, రవీంద్రుడు దుమికినప్పుడు ఆడ పిల్లవలె ఎడమకాలు ముందుకుసాచి దుమికెను. అతని కంఠ స్వరమును, సన్నగా స్త్రీకంఠమువలె నుండెను. అంతేగాక, అతడు మాంత్రికుని ఇంటిలో ఆడపిల్లవలె సిగ్గుపడి యేమియు తినకపోయెను. ఈ కారణములచేత, పాపము! మాంత్రికుడు రవి నిజముగ ఆడపిల్లయే అని భ్రాంతిపడెను.

విద్యార్థిదశలోనే రవి పద్యములు వ్రాయుట ప్రారంభించెను. గుమాస్తా దయతో ఇచ్చిన చిత్తుపుస్తకము నిండా పెద్ద పెద్ద అక్షరములతో తనకు తోచినది వ్రాయుచుండెను. కఠినమైన పదములు, పెద్ద పెద్ద పదములు వాడుటయే కవిత్వ మని అప్పుడతని యభిప్రాయము. అందుచేత, ప్రాచీన గ్రంథములలో తనకు దొరికిన పెద్ద మాటలను అన్నింటిని గుర్తు పెట్టుకొని, తన పద్యములలో వాడుచుండెను. ఒకసారి 'ద్విరేఫ' అను పదము కనిపించినప్పుడతడు ఎంతో మురిసి పోయెను. 'ద్విరేఫ' అనగా తుమ్మెద. ఈ పదము అంతగా వాడుకలో లేదు. రవి ఈ పదమును వాడవలెనను ఉత్సాహ

ముతో ఒక పద్యమును వ్రాసెను. అది ఒక స్నేహితునికి చదివి వినిపించెను. అతడు పద్యమంతయు విని నవ్వుచు 'అంతయు బాగుగనే యున్నది, కాని, "ద్విరేఫ" ఎక్కడ దొరికిన' దనెను. తాను అంత గొప్పగా భావించిన పదమును గురించి పరిహసించుట రవికి నచ్చలేదు. అప్పుడు అతని వయస్సు పదునొకండేండ్లు మాత్రమే. అయినను అప్పటికే అతడు ప్రపంచములో సుఖముకన్న దుఃఖమే యెక్కువని, దుఃఖమే తగిన కావ్యవస్తువని భావించుచుండెను. నిజముగ, అంతవరకు, దుఃఖమనగా నేమో ఆ బాలునికి తెలియదు; కాని, అతడు వ్రాసినవి అన్నియును విషాదగీతములే. దీనిని చూచి దేవేంద్రనాథుడు నవ్వుచుండెడివాడు. ఐనను, తన కుమారుడు భావికాలమున గొప్ప కవి కాగలడని ఆయన గ్రహింపకపోలేదు.

అదే విధముగ, రవీంద్రుని కుటుంబమువారందరు ఆతని పద్యములను చూచి నవ్వుచుండిరి. ఐనను, ఆతని ప్రతిభ మెచ్చుకొనుచుండిరి. పాఠశాలలో కూడ, రవీంద్రుని కవితాశక్తిని అందరును గుర్తించిరి. ప్రధానోపాధ్యాయు డొకసారి ఆతనిని నీతి పద్యములు వ్రాయుమని ప్రోత్సహించెను. రవీంద్రుడు వ్రాసి అందరికి చదివి వినిపించెను. కాని, ఆ పద్యములు రవి వ్రాసినవేనని చాలమంది నమ్మలేదు. అవి ఏ పుస్తకము నుండియో గ్రహించి యుండునని వారు భావించిరి. రవీంద్రుడు తన My Reminiscences (నా జ్ఞాపకములు) లో ఈ విషయమును గురించి ఇట్లు వ్రాసెను: 'త్వరలోనే ఆ నీతి పద్యములు వ్రాసిన కాగితములు పోయినవి. అదొక్కటే వానిలో ఉత్తమ గుణము. ఆ పద్యములవలన ఎవరికిని నీతి

ప్రబోధము కలుగలేదు. కొందరు ఆ పద్యములు నేను వ్రాసినవి కావనిరి. ఒకరు ఆ పద్యము లే పుస్తకమునుండి గ్రహింపబడినవో తమకు తెలియుననిరి. కాని, దాని పేరు చెప్పుమని అతనిని ఎవరును నిర్బంధించలేదు.'

రవికి ఈ విద్యార్థి దశ చాల నిస్సారముగ నుండెడిది. కాని, అప్పుడప్పుడు మాత్రము ఏదో ఒక విశేషము జరుగు చునే యుండెడిది. రవి అన్నగార్లందరు చక్కగ నటింప గలరు. వారు, వారి స్నేహితులు కలసి తరచు నాటకము లాడుచుండెడివారు. కాని, రవికి అది చూచు అవకాశ ముండెడిది కాదు. పిల్లలంతా వసారాలో నిలబడి నాటక మునకు వచ్చిపోవు అతిథులను మాత్రము చూచుచుండెడివారు. ఒకసారి, బయటివారెవరో వచ్చి ఠాకూర్ గృహాంగణములో నాటకప్రదర్శనము నిచ్చిరి. దానిని మాత్రము రవి చూచెను. నాటకము చూడవలెనని రాత్రి అంతయు మేల్కొనియుండెను. నాటకము చాలరాత్రి గడచిన తరువాతకాని ప్రారంభము కాలేదు. రవి అన్నగార్లు ఆతని చేతిలో నాణెములనుంచి నాటకము రక్తి కట్టినప్పుడు నటకులవేపు విసరమని చెప్పిరి. అది అప్పటి ఆచారము. కాని, నాటకము చాల పెద్దది. అది ముగియకుండగనే, పాపము! రవి నిద్రపోయెను!

మరొకప్పుడు, బందిపోటు దొంగల జిత్తులన్నియును ఠాకూర్ గృహాంగణముననే ప్రదర్శింపబడెను. రవి దొంగ లను గురించిన గాథల నెన్నింటినో వినియుండెను. అందువల్ల, అతని కా ప్రదర్శనము చాల రక్తికట్టెను. దొంగలు గడ కర్రల సహాయముతో రెండవ అంతస్తువరకు నెగురుట, బరువు

వస్తువులను దొర్లించుట మున్నగు వింతల నెన్నియో చూచి ఆనందించెను.

ఈ సమయమున ఆతని కొక కొత్త వదినగారు లభించెను. ఈమె చాల చలాకీగా నుండెడిది. రవికి, ఆమెకు, మొదటి నుండియు చక్కని స్నేహము కుదిరెను. ఆమె బొమ్మల పెండ్లిండ్లు చేయుచు రవిని ఆహ్వానించుచుండెడిది. కొత్తకొత్త పిండి వంటలు తయారుచేసి రవికి విందులు చేసెడిది. వజ్రేశ్వరుని వంటకు, ఆమె ఫలహారములకు, పోలికయే లేదు. రవి, ఆమె, తరుచు ఒకరినొకరు పరిహాసించుకొనుచు వినోదించు చుండువారు, ఆమె రవి వ్రాసినదంతయును శ్రద్ధతో వినెడిది. కాని, ప్రతి అంశమును నిర్దాక్షిణ్యముగా విమర్శించెడిది. అతని రచనలో గాని, అతని స్వరూపములోగాని ప్రశంసింప దగినదేమియు లేదని ఊరక ఆక్షేపించెడిది. రవి ఆమెను గురించి తరువాత 'నాకు గర్వము కలుగకుండ ఆమె కాపాడి నది' అనెను.

ఒకసారి, పిల్లలందరిని గంగానది ఒడ్డున ఉన్న 'ఉద్యాన గృహము'నకు తీసికొని వెళ్లిరి. రవీంద్రుని జీవితములో మరువరాని ఘట్టమిది. తొలిసారిగా నతడు నదీ సౌందర్యమును, నీటిలో తేలిపోవు పడవలను, చెట్లతో నిండిన తీరమును చూచి ఆనందింపగలిగెను. ఆ రోజులలో యంత్రాగారములు చాల తక్కువ. ప్రకృతి సహజశోభ కింకను భంగము కాలేదు. ఆ ప్రకృతి సౌందర్యము రవీంద్రుని ముగ్ధుని చేసినది. పంజరమునుండి విడుదల పొందిన చిలుకవలె నతని మానసము స్వేచ్ఛగ ఆ సౌందర్యములో లీనమయ్యెను.

కాని, అక్కడనుండి పిల్లలందరు చేరువ పల్లెలను చూడ వలెనని బయలుదేరగా పెద్దవారు కోపించి తోటవాకిలి దాట రాదని శాసించిరి. అందుకే, రవీంద్రుడు 'మేము పంజరము విడిచి వచ్చినను, మా కాలి గొలుసులు మాత్రము విడలేదు' అనెను. వారి స్వేచ్ఛ తాత్కాలికమే. సంపూర్ణ స్వాతంత్ర్య మింకను రాలేదు.

## మూడవ అధ్యాయము

# కవితా వ్యాసంగము

రవికి పన్నెండేండ్లు నిండిన తరువాత, సోమేంద్ర, సత్య, రవి ముగ్గురికి ఉపనయనములు జరిగెను. దేవేంద్రనాథుడే స్వయముగ మంత్రసంబంధమైన కార్యములన్నియును చేసెను. వడుగైన తరువాత, వారు ముగ్గురు దీక్ష వహించి మూడు దినములు గడుపవలసి యుండును. కాని, ఈ మూడు దిన ములు గాయత్రీ జపముతో కన్న ఆటలతోను, నౌకర్లను వంచించుటతోను స్వేచ్ఛగా గడిపిరి. ఆ మూడు రోజులు వారికి విందు భోజనములు, వాని రుచి రవి ఎప్పటికిని మరచి పోలేదు. కాని, రవి గాయత్రీ జపమునందలి ఉత్కృష్టత కూడా గుర్తింపకపోలేదు. ఆ మంత్రమునందలి కొన్ని పదము లన్నే శాశ్వతముగ రవి హృదయమున నిలచిపోయెను.

ఉపనయనపు వేడుకలు ముగిసిన పిదప మహర్షి రవిని బోల్‌పూర్, హిమాలయములు చూచుటకు తీసికొని వెళ్లెను. రవి ఉత్సాహమునకు మేరలేదు. తండ్రితో గుర్రపు బండి

నెకి- స్టేషనుకు వెళ్లుట అతడెప్పుడును మరచిపోలేదు. అతడదివరకెప్పుడును రైలును చూచి ఎరుగడు.

దేవేంద్రనాథుడు బోల్‌పూర్‌కు రెండు మైళ్ల దూరములో ఒక చిన్న ఆశ్రమము నిర్మించెను. దానికే 'శాంతినికేతన'మని పేరు పెట్టెను. ఆయన విశ్రాంతి కావలసినప్పుడంత అక్కడకు వెళ్లి కొన్ని దినములు ప్రశాంతముగ దైవస్మరణ చేయుచు గడపువాడు. రవికన్న ముందు సత్య అక్కడికి వెళ్లియుండెను. అతడు రవికి రైలు ప్రయాణములో నుండు కష్టములను గురించి, శాంతినికేతనము నందలి వింతల గురించి అనేక అద్భుత గాథలు చెప్పియుండెను. అందుచేత, రవికి అక్కడకు వెళ్లవలయును అని చాల ఉత్సాహముగ నుండెను. రైలు ఏ ప్రమాదము లేకుండ తిన్నగా సాగిపోయినప్పుడతనికి నిజముగ నిరుత్సాహముకూడ కల్గెను. కాని, శాంతినికేతనమున అతనికి కావలసినంత స్వేచ్ఛ లభించెను. చిట్టచివరకతడు బంధనమునుండి విముక్తి పొందెను. ఇష్టము వచ్చినట్లు ఆ చుట్టుప్రక్క ప్రాంతమంతయు తిరుగజొచ్చెను. మహర్షి అతడు చేయు ప్రతి కార్యమునందును శ్రద్ధ చూపుచు అతని మాటలు విని వినోదించుచు, అతనికి చిన్నచిన్న పనులు పురమాయించుచు నుండెను. రవి తండ్రి చెప్పినదెల్ల శ్రద్ధతో చేయుచుండెను.

రవికి చిన్నప్పటినుండి తండ్రియందు అమితమైన భక్తి. 'మహర్షి' తరుచు ఇంటివద్ద నుండెడివాడు కాడు. ఐనను, ఉన్నప్పుడు, పిల్లలయెడ చాల శ్రద్ధ చూపువాడు. ప్రాతఃకాల సమయమున ఆయన తెల్లని దుస్తులు ధరించి ప్రశాంతముగా మౌన జపము చేయుచుండువాడు.

శాంతినికేతనములో ఒక పెద్ద మైదానము ప్రక్కన రెండు మహా వృక్షములు దగ్గరగా కలిసియుండెడివి. మహర్షి యెప్పుడును ఆ చెట్ల నీడలో కూర్చొని ధ్యానము చేయువాడు. చాల రోజుల తరువాత, రవి అక్కడ ఆయన జ్ఞాపకార్థము ఒక చలువరాతి స్తంభమును నాటించెను. మహర్షికి ప్రియమైన వాక్యములు ఆ చలువరాతిపై చెక్కించెను:

'నా జీవిత ప్రశాంతి,
నా హృదయానందము,
ఆత్మశాంతి,
సర్వము ఆ పరమాత్ముడే!'

మహర్షి జీవితము, అతని ఉన్నత భావములు రవిని ఎక్కువగ నాకర్షించెను. 1873 లో ఆయనతో గడిపిన దినములు రవి జీవితములో చాల ముఖ్యమైనవి.

శాంతినికేతనమునుండి తండ్రికొడుకులు అమృతసర్ వెళ్లిరి. లోక ప్రఖ్యాతమైన సువర్ణ దేవాలయమును చూచిరి. ఒక బెంగాలీ వ్యక్తి తమ మందిరమున పూజకు వచ్చెనని, అతనికి తమ ప్రార్థనగీతములు తెలియునని, సిక్కులు చాల సంతోషించిరి. దేవేంద్రనాథునికి అక్కడ చాలమంది స్నేహమైరి. అన్ని మతములను గౌరవించుట రవి తండ్రివద్ద నేర్చుకొనెను. అన్ని మతములవారు ఒకరి ఉత్తమ భావములను మరియొకరు గ్రహించుచు కలసియే ప్రార్థనలు, పూజలు చేయవచ్చునని అతడు గ్రహించెను.

అమృతసర్‌నుంచి వారు డెల్‌హౌసీ వెళ్లి, అక్కడ నాలుగు మాసములుండిరి. అక్కడ చక్కని వాతావరణ

ములో అందమైన చెట్ల సమూహములలో రవీంద్రుడు స్వేచ్ఛగా తిరుగసాగెను. ప్రతి ఉదయము తండ్రి కొడుకు లిద్దరు షికారు పోవువారు. కాని, బాలుడగుటచేత రవి ఎక్కువదూరము నడువలేక మధ్యలోనే, ఒంటరిగా తన ఇష్టము వచ్చిన మార్గమున మెల్లిగా తిరిగి వచ్చువాడు. పిల్లలకు తగిన నియమములు, కఠిన జీవితము అలవాటు చేయవలెనని 'మహర్షి' ఉద్దేశ్యము. అందుచేతనే ఆ డెల్‌హౌసీ శీతల వాతావరణములో కూడ, రవి చన్నీళ్లలోనే స్నానము చేయవలెనని నియమించెను. ఇందుకు బాగుగా అలవాటుపడిన వాడగుటచేత రవీంద్రుడు తరువాత ఇంగ్లండు వెళ్లినప్పుడు, అక్కడ శీతకాలమునగూడ, నరములు కొరికివేయు చలిలోకూడ, చన్నీళ్లతోనే స్నానము చేయువాడు.

డెల్‌హౌసీలో నున్నప్పుడు దేవేంద్రుడు నిత్యము రవికి సంస్కృతము, ఇంగ్లీషు నేర్పెడువాడు. అప్పుడే, రవి కాళిదాసుని మేఘసందేశమును తొలిసారిగా చదివెను. మేఘసందేశమునందలి ఔన్నత్యమును పూర్తిగా గ్రహించుటకు రవి అప్పటికింకను పసివాడు. కాని, అందలి ప్రకృతి వర్ణనలు, శబ్దమాధుర్యము రవిని ఎక్కువగా నాకర్షించెను. తరువాత నతడు కాళిదాసుని కావ్యముల మరలమరల చదివెను. డెల్‌హౌసీలో అతనికి సాహిత్యాభిమానము చక్కగా కుదిరెను.

రాత్రిపూట బయట విహరించునప్పుడు దేవేంద్రుడు రవికి చుక్కల నన్నిటిని చూపి గ్రహములను గురించి చెప్పువాడు. రవికి అప్పటినుండియు నక్షత్రశాస్త్రమునందు ఆసక్తి కలిగెను. చాలకాలము తరువాత, అతడు నక్షత్రశాస్త్రమును గురించి ఒక గ్రంథమునుకూడ వ్రాసెను. అట్లే, దేవేంద్రుడు రవీం

ద్రునికి వృక్ష శాస్త్రముకూడ బోధించుచుండెను. రవి జీవి తాంతమువరకు చెట్లను, పూవులను, వాటి జీవితమును అధి కోత్సాహముతో పరిశీలించుచుండెను.

పిల్లల కెప్పుడును స్వతంత్రభావము లుండవలెనని, ఇత రులు చెప్పినది గ్రుడ్డిగా నమ్మరాదని దేవేంద్రుని అభిప్రా యము. ఆ కారణముచేత, రవి ఎప్పుడు ఏ విషయమును గురించి తనకు వ్యతిరేకముగ మాట్లాడినను, మహర్షి వారించు వాడు కాడు. ఓపికతో విని, తరువాతనే రవీంద్రుని వాదము లోని దోషములను తెలుపువాడు. ఎప్పుడును ఆయన తాను చెప్పినదే రవి వినవలెనని నిర్బంధించువాడు కాడు. రవి అన్న గార్లుకూడ ఆ విధముననే అతని అభిప్రాయములను గౌర వించెడివారు. ఇట్లు రవికి నిర్భయముగ మాటలాడుట, స్వతంత్రముగ, స్పష్టముగ సరియైన మార్గమున జీవితమును గురించి ఆలోచించుట అలవాటు అయ్యెను.

కలకత్తాకు తిరిగివచ్చిన తరువాత రవి మరల బడికి పోసాగెను. ఈసారి అతడు సెయింట్ గ్జేవియర్ కళా శాలలో చేరెను. ఇదివరకు చదివిన పాఠశాలలకన్న ఇక్కడ విద్యార్థులు, అధ్యాపకుడు రవికి ఎక్కువగా నచ్చిరి. ముఖ్య ముగా ఫాదర్ డి పెనిరాండా అనునతడు రవిని ఎక్కువగా నాక ర్షించెను. అతని ముఖములో నిర్మలమైన తేజస్సు, పరమశాంతి ప్రకాశించుచుండెడివి. మరియొక అధ్యాపకుడు రవికి మామూలు పాఠములు చెప్పుటవలన ప్రయోజనము లేదని త్వరలోనే గ్రహించి, అతనికి ప్రత్యేకమైన పాఠములు చెప్పు చుండెడివాడు. ఆతని ప్రోద్బలముననే రవి షేక్స్పియర్ రచించిన మేక్బెత్ నాటకమును వంగభాషలోనికి అనువదిం

చెను. ఆంగ్ల భాషయందలి ప్రాచీన సాహిత్యమును ఎక్కువగ పఠించెను. ఐనను, ఆతనికింకను బడియన్న నిర్బంధము వలెనే యుండెను. ముఖ్యముగ, డెల్‌హౌసీలో స్వేచ్ఛా జీవితమునకు అలవాటుపడిన తరువాత ఇది చాల బాధాకరముగ నుండెను. క్రమముగ నతడు బడికి పోవుట తప్పించుకొనుచుండెను. చివరకు, రవిని బడి మాన్పించి స్వేచ్ఛగ విడుచుటయే మంచిదేమోనని అతని అన్నగార్లు గ్రహించిరి. రవి స్వయముగ చదువుకొని జ్ఞానమును సంపాదించుకోగలడని వారు తెలిసికొనిరి. అంతటితో రవి విద్యార్థి దశ అంతమయ్యెను.

అప్పటికి అతనికి పదమూడేండ్లు. మరి నాలుగేండ్లు అతడు ఇంటిలో పెద్దవారి ఆటపాటలలో వినోదములలో పాల్గొనుచు దినములు గడపుచుండెను. ఠాకూర్ భవనములో కవులు, కళాకారులు అనేకులు చేరెడివారు. వారందరితోను కలసి మెలగుటయే ఒక గొప్ప విద్య. పెద్ద అన్నగారగు ద్విజేంద్రనాథుడు ఉత్తమ రచయిత. అనేక విషయములందు అభిరుచి కలవాడు. అతనివద్దకు పలురకముల వ్యక్తులు వచ్చెడివారు. తత్వశాస్త్రమును గురించి, గణిత శాస్త్రమును గురించి, మరి ఇంక ఇతర విషయములను గురించి చర్చలు జరపెడివారు. ద్విజేంద్రుడు అప్పుడప్పుడు పద్యములు వ్రాయును. ఒక్కొక్కప్పుడు, ఒక పద్యము పూర్తికాగానే తన బంధువులను, స్నేహితులను పిలచి చదివి వినిపించువాడు. అతని ఉత్సాహము, నవ్వు ఇల్లంతయు వ్యాపించెడిది. అతడు మంచి ఈతగాడు. అతని సహాయముతో ఇంటిలోని పిల్లలందరును ఈత నేర్చుకొనిరి. రవికూడ, చిన్నప్పుడే చక్కగా ఈదుట నేర్చుకొనెను.

ఐదవ అన్నగారగు జ్యోతీంద్రనాథునికీ, రవికీ అమిత స్నేహము. ఇరువురును ఎప్పుడును కలసియే యుండువారు. జ్యోతి రవికన్న పన్నెండు సంవత్సరములు పెద్ద. అతడు గొప్ప సంఘసంస్కర్త. వంగదేశమున, అప్పుడు, స్త్రీలకు ఘోషా ఎక్కువ; కాని ఆతని భార్యమాత్రము పరదా పాటించెడిది కాదు. ఇది ఆ రోజులలో ఎక్కువ సాహసముగ పాటింపబడెడిది. ఈమెయే వారి చిన్నప్పుడు రవిని బొమ్మల పెండ్లిండ్లకు పిలచెడిది.

అన్నగారి సంఘసంస్కరణ ఉద్దేశములు రవికి ముదావహముగా నుండెడివి. వారిద్దరికి నాటక సంగీతములందుకూడ ఎక్కువ అభిమానము. ఆ కారణముచేతకూడ, వారి కెక్కువ స్నేహమయ్యెను. జ్యోతి గదిలో నొక పియానో యుండెడిది. అతడు దానిముందు కూర్చొని గంటల తరబడి క్రొత్త రాగ వరుసలు కల్పించువాడు. అతని ప్రక్కనే కూర్చొని రవి ఆ రాగ వరుసలకు సరిపోవు పదములు కూర్చువాడు. ఈ విధముగ, రవికి బాల్యముననే పాటలు వ్రాయుట అభ్యాసమయ్యెను. అన్నగారు, వదినె, తాను కలసి ప్రతి సాయంత్రము సంగీతకాలక్షేపము చేయువారు. జ్యోతి ఫిడేలు వాయించగా, రవి పాడును. అప్పుడప్పుడు కొందరు స్నేహితులుకూడ వచ్చి వారి పాట విని ఆనందించెడివారు.

అక్కడికి వచ్చువారిలో శ్రీకాంత బాబుపై రవీంద్రునికి చాల ప్రేమ. అతడు బాగుగ పాడును. ఎల్లప్పుడు, నవ్వుచు అందరితో దయగా నుండెడివాడు. రవి అతనివద్ద చాల పాటలు నేర్చుకొనెను. అక్షయ చౌదరి అనునతనికికూడ, సంగీతమన్న మెక్కువ ఇష్టము. అతని కంఠమంత బాగుండక

పోయినను చేతికి దొరకినదానితో తాళము వేయుచు నేదియో పాడుచుండెడివాడు. అతడొకనాడు రవికి ఆంగ్ల బాలకవి చాటర్టన్ను గురించి చెప్పెను. చాటర్టన్ రవివలెనే తన పదహారవయేట ప్రాచీనరచననుకరించుచు కొన్ని క్రొత్త పద్యములు వ్రాసి అవి ఎక్కడనో ప్రాచీన వ్రాతప్రతులలో దొరకినవని ప్రకటించెను. కొన్నాళ్లు అతని మాటలను అందరు నమ్మిరి. రవీంద్రుడు బెంగాలీలోకూడ నా విధముగా చేసిన బాగుండునని యెంచెను. ఆతడు మధ్యయుగమునందలి మైథిలీ వైష్ణవ కవుల ననుసరించుచు కొన్ని పద్యములు వ్రాసి 'భానుసింహ' అను పేరుతో అవి ఎక్కడనో ప్రాత గ్రంథములలో దొరకినవని ప్రకటించెను. కొన్నాళ్లు, అందరు అవి ఎవరో భానుసింహుడను ప్రాచీన కవి వ్రాసినవనియే భావించిరి. ఒక విద్యార్థి జర్మన్ విశ్వవిద్యాలయములో ఈ పద్యముల గురించి పరిశోధనచేసి డిగ్రీకూడ తెచ్చుకొనెనట!

ఆ దినములలో బెంగాలీలో నవ్యసాహిత్యరచనలు విరివిగా వెలువడుచుండెను. విద్యాధికులైన వారిండ్లలో ఈ సాహిత్యము పట్ల ఎక్కువ శ్రద్ధ ఉండెను. బంకిమ్‌చంద్రుని నవలలు అప్పటికే చాల ఖ్యాతి గాంచి యుండెను. ఆయన కథలు వరుసగా 'వంగ దర్శన్' అను పత్రికలో వెలువడు చుండెను. ఈ పత్రిక రాగానే ఠాకూర్ ఇంటిలో వారందరు 'నేను ముందు' 'నేను ముందు' చదువవలెనని ఉత్సాహపడు చుండిరి. రవి ఈ కథలను పైకి చదువగా నతని చుట్టు చేరిన స్త్రీ జనమంతా విని ఆనందించెడివారు.

తరువాత కొంతకాలమునకు జోతీంద్రనాథుడు స్వయముగ 'భారతి' యను నొక వంగసాహిత్య పత్రికను ప్రారం

భించెను. ద్విజేంద్రనాథుడు ఆ పత్రికకు సంపాదకుడు. రవి భారతికి కథలు, పద్యములు, వ్రాయుచుండెను. తరువాత నతడు సంపాదక వర్గములోకూడ చేరెను. అతని 'భాను సింహ' పద్యములు తొలిసారి ప్రకటింప 'భారతి'లోనే ప్రచురించెను.

కథలు పద్యములేగాక రవి పాశ్చాత్య సాహిత్యమును గురించి విమర్శలుకూడ వ్రాసెడివాడు. బడి మానినప్పటి నుండి అతడు తీవ్రముగ కృషిచేసి శీఘ్రముగానే అన్ని దేశముల సాహిత్యముతోను పరిచయము కలిగించుకొనెను. ఆతని జ్ఞానము దినదినప్రవర్థమాన మగుచుండెను.

జ్యోతీంద్రుడు నాటకములు వ్రాసి తమ గృహావరణము లోనే వానిని ప్రదర్శించుచుండెను. రవీంద్రుడు ఈ నాటకములలో పాల్గొనుచుండెను. అతడు హాస్యపాత్రలను, ఉదాత్తమైన పాత్రలనుకూడ చక్కగా పోషించుచుండెను. రవీంద్రునికి నాటక కళయందు ఎక్కువ అభిమానము. తాను వ్రాసిన నాటకములలో తరుచు తానే ప్రధాన పాత్రను ధరించుచుండెను. తాను నటించుటయే గాక, తరువాత శాంతి నికేతనములోని పిల్లలకుకూడ శ్రద్ధతో నటించుట నేర్పుచుండెను. జ్యోతీంద్రనాథుడుకూడ అతని కెక్కువసహాయ పడుచుండెను.

రవి పదునాల్గవ యేట అతని తల్లి మరణించెను. అవసాన సమయమున ఆమె ముఖము అతి ప్రశాంతముగ నుండెను. ఆమె శరీరము వాకిలి దాటగానే రవికి ఎక్కడలేని ఒంటరితనము ముంచుకువచ్చెను. కాని, అతని వదినగారు,

అక్క స్వర్ణకుమారి, అతనిని చేరదీసి ఆదరించిరి. వారి ప్రేమతో రవి తన తల్లిని కొంతవరకు మరచిపోగల్గెను. స్వర్ణకుమా రవిని చాల ప్రేమించెడిది. అన్ని విషయములలోను సహ యముగా నుండెడిది. ఆమెకూడ కథలు వ్రాసెడిది.

## నాల్గవ అధ్యాయము

# జాగృతి

రవీంద్రునికి పదునేడవ యేడు రాగానే అతనిని ఇంగ్లండు పంప నిశ్చయించిరి. ఆతని రెండవ అన్నగారగు సత్యేంద్ర నాథుడు ఐ. సి. ఎస్. ఆ సర్వీస్‌లో చేరిన మొదటి హిందు వతనే. అతడు అప్పుడు అహమ్మదాబాదులో నుండెను. భార్యా బిడ్డలు మాత్రము ఇంగ్లండులోనుండిరి. అతను సెలవుపెట్టి వారి దగ్గరకు వెళ్లవలె ననుకొనుచున్నందున రవీంద్రుని అతని వెంట పంప నిశ్చయించిరి. రవీంద్రుడు కొంచెము ముందుగా అహమ్మదాబాదు వెళ్లి అక్కడ ఆంగ్ల దేశాచారములను సాంప్రదాయములను నేర్చుకొనుచుండెను. అహమ్మదాబాదు చాల పురాతన పట్టణము. భారతీయ ప్రాచీన సంస్కృతి, శిల్పము, అందు కాననగును. కలకత్తా నగరము కేవలము ఆధునిక వ్యాపార కేంద్రము. అహమ్మదాబాద్ చారిత్రక ఔన్నత్యము రవీంద్రు నాకర్షించెను. సత్యేంద్రుడు ఉన్న భవనమే ఒక ప్రాచీన మహారాజ మహాలు. అక్కడ గదిగది తిరుగుచు రవి మొగల్ సామ్రాజ్యవైభవమును గూర్చి వింతవింత కథలు ఊహించుకొనుచుండెను. చాల

ఇంగ్లండ్‌లో రవీంద్రుడు

ోజుల తరువాత ఆ అనుభవమునే Hungry Stones (ఆకొన్న
ాళ్లు) అను పేరున కథగా రచించెను. అందు పురాతన
వనములో నివసించు ఒక ఉద్యోగి భావములు, అనుభవ
ులు వర్ణించెను. ఈ కథ తనకు అహమ్మదాబాదులోనే
్ఫురించినదని ఠాకూర్ చెప్పి ఉన్నారు.

తరువాత, కొంతకాలమునకు అచ్చటికి సమీపముననే
ుహాత్మా గాంధి దక్షిణాఫ్రికానుండి తిరిగి వచ్చిన పిదప,
బర్మతి ఆశ్రమమును స్థాపించెను. ఒకసారి రవీంద్రుడు
చ్చటకు వెళ్లి మహాత్మునితో కొంతకాలము గడపెను. ఆ
ధముగ తాను కథ రచించిన స్థలమును తిరిగి ఒకసారి
ూడగల్గెను.

అహమ్మదాబాదునుండి రవి బొంబాయి వెళ్లి అక్కడ
్నేహితుల ఇంటి పిల్లలతో కలసి ఇంగ్లీష్ నేర్చుకొనుచుండెను.
తరువాత 1878 లో నాతడు సత్యేంద్రనాధునితో గూడ
ఇంగ్లండు వెళ్లెను. అక్కడ అతడు మొదట కొన్నాళ్లు తన
ుదినెగారి దగ్గరనే ఉండి, ఒక ఆంగ్ల పాఠశాలలో చదువు
ొనెను. క్రమేణా బాలురందరు ఠాకూర్‌కు స్నేహితులు
ాజొచ్చిరి. మొదట, కొంచెము సిగ్గుతో దగ్గరకు వచ్చి
అతని చేతిలో పండో, మిఠాయో ఉంచి పారిపోయెడివారు.
ఈ విధముగా వారు ఆ విదేశీయునకు స్వాగత మొసగిరి.

కొన్నాళ్లకు ఠాకూర్ స్కాట్ అను వారి కుటుంబ
ముతో కలసియుండి లండన్ విశ్వవిద్యాలయములో ఆంగ్ల
సాహిత్యము నభ్యసించెను. స్కాట్ భార్య రవిని తల్లివలె
ఆదరించుచుండెను. అంతేకాక, ఆ కుటుంబమువారందరు రవి
చదువునందు శ్రద్ధ వహించుచుండిరి. ప్రతి సాయంత్రము

ప్రసిద్ధ ఆంగ్ల రచయితల గ్రంథములను రవి పైకి చ
వినిపించుచుండెను. ఈ విధముగ నతడు ఎంతో భాషా జ్ఞ
మును అలవరచుకొనెను. అతనికి ఇంకను ఆంగ్లేయు
అనేకులు స్నేహితులైరి. కేవలము చదువుటవల్లనే కా
అతడు నలుగురితో కలసి మెలిసి తిరుగుచు పాశ్చాత్యు
గురించి అనేక విషయములు తెలుసుకొనెను.

అతడు ఇంగ్లండ్‌లో దాదాపు రెండు ఏండ్లుండెన
కాని, ఏ విషయమునందును ఒక ప్రత్యేక క్రమముననుసరి
ఒక డిగ్రీ కాని, సర్టిఫికేట్ కాని, పొందలేదు. అతడు భార
దేశమునకు తిరిగి వెళ్లగా, ఆతని కుటుంబమువారు రవిని న్యాయ
శాస్త్రము చదివింపదలచిరి. అందుకై అతనిని తిరిగి వెంట
లండన్‌కు ప్రయాణము చేసిరి. అతడు తన బంధువొకరితో
కలసి బయలుదేరెను. కాని, ఆ చుట్టమునకు త్రోవలో
జబ్బుచేయుటచేత ఇద్దరును మద్రాస్‌నుండియే తిరిగి కలకత్తా
చేరుకొనిరి. ఆ తరువాత, రవి విద్యాప్రయత్నములు సంపూర్ణ
ముగ విడిచిపెట్టిరి. మహర్షి కుటుంబ ఆస్తిని సరిజూచు ప
రవికి ఒప్పగించెను. రవికి అప్పటికి ఇరువదేండ్లు.

ఆస్తి యాజమాన్యమును వహించుటకు ముందు ర
కొంతకాలము సాహిత్యకలాపములో జరిపెను. అప్పుడే
'వాల్మీకి ప్రతిభ' అను గేయనాటికను రచించెను. కథావస్తువ
వాల్మీకి చరిత్ర, రామాయణ రచన. నాయకుడైన వాల్మీ
కాళికా భక్తుడు. ఒకనాడు దొంగలు ఒక బాలికను బంధించి
కాళికాదేవికి బలి ఇచ్చుటకు కొనివత్తురు. వాల్మీకి ఆ బిడ్డన
చూచి జాలిపడి విడిపించును. తరువాత ఆత్మవేదనతో అరణ్య
మంతయు దిమ్మరుచుండును. అప్పుడు అనుచరు లిద్దరు ఒక

పక్షిని చంపగా చూచి మరింత ఖేదపడును. ఆ వేదనతో తన పెదవులనుండి వెలువడిన శ్లోకరూపకమైన సంస్కృత వాక్యముల మాధుర్యమున కతడు విభ్రాంతి చెందియుండగా సరస్వతీదేవి ప్రత్యక్షమగును. తానే బాలికా రూపమున నతని దయార్ద్రహృదయమును మేల్కొలిపినట్లు తెలిపి, తన వీణ నతనికి బహుమానముగా నిచ్చి కవిగా ఆశీర్వదించును.

ఈ నాటకములోని దొంగల పాటలు, ఆనంద గీతములు, వేట దృశ్యములు, ప్రకృతి సౌందర్యమును ప్రతిబింబించు వన దేవతల ఆటపాటలు, మిక్కిలి మనోరంజకముగా నుండును. జీవకళ ఉట్టిపడు పాత్రలతో చక్కని నటనా కౌశల్యమునకు అవకాశమిచ్చును. ఇందు ఠాకూర్ ప్రాచీన బెంగాలీ వరుస లనే గాక, ఇంగ్లండులో తాను నేర్చుకొనిన ఇంగ్లీష్, ఐరిష్ రాగవరుసలుకూడ వాడెను. ఇది ఒక నవీన సంప్రదాయమై ప్రేక్షకులను చాల నాకర్షించెను. నాటకమున దొంగల మోటు దనము, ప్రకృతి రామణీయకత చక్కగా ప్రతిబింబించినవి.

ఆమేడు జ్యోతీంద్రనాథుడు, ఆతని భార్య కలకత్తాకు సమీపమున గంగానది యొడ్డుననున్న చంద్రనగర్‌లో నివసించు చుండిరి. సుందరమై, ప్రశాంతమైన ఈ ప్రదేశమున కొన్నాళ్లు రవి వారితో కలిసి ఉండెను. రవీంద్రునికి గంగ యనిన మిక్కిలి ప్రీతి. నదీ జలమున ప్రతిక్షణము మారు రంగుల సౌందర్య మును చూచి దినమంతయు ఆనందించుచుండువాడు. ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము, ఎల్లప్పుడు గంగ అందముగా ఉండెడిది. రాత్రిపూట ఆ తేటనీటిలో వెన్నెల ప్రతిబింబించెడిది. ఆ వాతావరణములో రవి ఉత్సాహముతో

చాల పద్యములు వ్రాసెను. ఇవియే 'సంధ్యా గీతములు'. ఈ గ్రంథ ప్రచురణ వలన రవీంద్రునికి ఆనాటి బెంగాలీ రచయితలలో మంచిపేరు వచ్చెను. గ్రంథము వెలువడిన కొన్నాళ్లకు ప్రఖ్యాత రచయిత బంకించంద్రుడు ఒక పెండ్లి యింటికి వెళ్లెను. ఆ గృహయజమాని ఎంతో గౌరవముతో, నతని మెడలో పుష్పహారము వేయబోయెను. సరిగా, ఆ సమయమునకే రవీంద్రుడుకూడ అక్కడికివచ్చెను. బంకిమ్ వెంటనే ఆ హారమును తీసికొని రవీంద్రుని మెడలో వేసెను. గృహయజమానితో నతడు 'పుష్పహారము వేయవలసినది నాకు కాదు; రవీంద్రునికి; మీరాయన సంధ్యాగీతములు వినలేదా?' అనెను.

1882 లో, రవీంద్రుని ఇరువదియొకటవ యేట, అతనికొక అద్భుతమైన అనుభవము కలిగెను. అది విచిత్రమైన మానసికానుభవము కాని, భౌతికముకాదు. అప్పుడతడు కలకత్తాలో మ్యూజియమ్ దగ్గర ఒక ఇంటిలో నుండెను. ఆ ఇంటికి తూర్పున ఎవరిదో పెద్ద తోట. ఒకనాడు ఉదయమున రవీంద్రుడు వసారాలో నిలచి, చెట్ల వెనుక సూర్యోదయమును చూచుచుండెను. 'నేను ఆ దృశ్యమును చూచుచుండగా, నా కన్నుల ముందర యేదో పురాతనమైన మంచు తెర విడిపోయినట్లయినది. ఆ ఉదయారుణ కాంతి ప్రపంచముపై సోకగానే యేదో ఆంతరంగికానందము, తేజస్సు, ప్రస్ఫుటమయ్యెను' అని అతడు చెప్పెను.

ఈ అనుభవము గురించియే మరియొకచోట, 'సంతోష సౌందర్య తరంగము లన్నివైపుల పెల్లుబికిన' వని చెప్పెను. ఇంతవరకు తాను భౌతిక నేత్రములతో బాహ్యాకారమును

మాత్రమే చూచుచున్నట్లును, ఇప్పుడు తన సంపూర్ణమైన ఆత్మతోను మనస్సుతోను వస్తువుల నిజస్వరూపమును కనుగొన కలిగినట్లును భావించెను. ఇక, ఏదియు అర్థరహితముగ లేదు. సామాన్య వస్తువులుకూడ, ఏదో అద్భుతమైన నూతనార్థములతో స్ఫురించెను. ఏదో శాశ్వతమైన, అందమైన జీవితము, ఆనందము, వానిలో ప్రకాశించెను.

ఒకసారి, అతడు ఇద్దరు బాలురు స్నేహముతో చెట్టపట్టా పట్టుకొని నవ్వుకొని పోవుట చూచెను. అతని కది అనంతానందములో నొక భాగముగ తోచెను. ఒక ఆవు దూడను ప్రీతితో నాకుచుండెను; ఒక తల్లి బిడ్డ నాడించుచుండెను — ఇది యంతయు విశ్వప్రేమలో నొక భాగము. ప్రపంచములో ప్రతి అంశము విలువైనదే. ఇదివరకు ఒక వ్యక్తిని చూచిన ఠాకూరునకు చాల విసుగుగా నుండెడిది. ఇప్పుడా వ్యక్తినే సంతోషముతో నెదుర్కొని మాట్లాడ గలిగెను.

ఈ అద్భుతానుభవమును నాడే రవీంద్రుడు ఒక పద్యములో వ్యక్తము చేసెను. దానినిగూర్చి రవీంద్రు డిట్లు చెప్పెను: 'నాకు జ్ఞానోదయమైన ఆ తొలిదినముననే ఒక పద్యమును వ్రాసి, దానికి The Awakening of the Fountain (జలజాగృతి) అని పేరు పెట్టితిని. హిమాలయపు గుహలలో దట్టమైన మంచుముసుగు వెనుక నిద్రాణువైయున్న సెలయేరు తొలి సూర్యకిరణములు తాకగనే, మంచుతెర వీడి గలగల ప్రవహించుచు అనంతమైన సముద్రమున సంగమించి ఆత్మత్యాగముతో పరిపూర్ణత చెందును.' హిమబంధమై నిద్రించు సెలయేరు, సూర్యరశ్మిలో సంతోషముతో, స్వేచ్ఛగా ముందుకు సాగు ప్రవాహము, చివరకు ఆత్మత్యాగము చేయుచు

సముద్రునిలో లీనమై నది పొందు ఆనందము—ఇవి అన్ని యును రవి ఈ పద్యమున చక్కగా వర్ణించెను:

‘ప్రభాత భానుని మధుర స్పర్శ
తెల్లవారగనే సోకెను నా ఆత్మపై;
ప్రభాత పక్షుల సుందర గానము
ప్రతిధ్వనించెను నా చీకటి గుహలో; ఎన్నినాళ్లకో,
ఎన్నినాళ్లకో, ఏ మాయవలననో నేడు
నాలో జీవము మేల్కొని, కదలెను;
నిజముగ నాలో జీవము
కదలెను, మెలగెను
పరిపూర్ణ ఉత్తుంగ ప్రళయ తరంగములో;
జీవిత కాంక్ష బలమైనది,
జీవిత ప్రేమ దృఢమైనది,
లేదు నిరాశ! లేదు నిరాశ!’

కాలక్రమేణా ఈ దివ్యదర్శనానుభవము కొంత మరుగు పడినా, దాని ప్రభావము మాత్రము రవీంద్రునిలో ఆ జన్మాంత ముండెను. సామాన్యవస్తువులలో మరుగుపడియున్న అద్భుత ములే అతని కథలలో, పద్యములలో కాన్పించును. ఆ వింతలు ఆతని కవనముద్వారా మనముకూడా చూడగలము.

తరువాత సంవత్సరము రవీంద్రుడు కర్వారువెళ్లి అక్కడ సత్యేంద్రనాథుని కుటుంబముతో కలిసి యుండెను. ఇక్కడ కూడ, అతని జీవితము సౌందర్యముతో, స్నేహముతో గడచి పోయెను. అది సముద్రతీరము; తరంగముల సౌందర్యము అతని ఆత్మను జేరి ఆతని రచనలకు ప్రోద్బల మిచ్చెను.

రవీంద్రుడు ఎప్పుడును శ్రద్ధగా పనిచేయువాడు. ఒక క్షణమైనను, సోమరిగా నుండువాడుకాడు. ఆట పాటలయందైన, ఏ పనియందైనను పూర్తిగా లీనమగువాడు. కర్వారులో ఉన్నప్పుడు రవీంద్రుడు వనవిహారములలోను, వెన్నెల విహారములలోను, పోటీపందెములలోను నిమగ్నుడగువాడు. అయినను, సాహిత్య కలాపముకూడ మానుకోలేదు. అప్పుడే, 'సన్యాసి' అను నాటకమును రచించెను. రవికి ఇదివరకు అనుభవము కలిగిన విషయమునే ఇందు మరియొకవిధముగా చెప్పెను. ప్రేమ, ప్రకృతి సౌందర్యము సత్యాన్వేషణకు ఆటంకములు కానను విషయములను ఈ నాటకము వ్యక్తము చేయును. అంతేగాక, ప్రేమ, సౌందర్యము మానవునకు సత్యమును సాధించు సాధనములనికూడ ఈ నాటకము తెల్పును.

ఇందు మొదటి దృశ్యములో ఒక సన్యాసి తన గుహ ముందట కూర్చొని తనకు భౌతిక బంధనములనుండి, కోరికల నుండి సంపూర్ణముగా విముక్తి కలిగినదని గర్వపడుచుండును. ఇంక తాను తిరిగి నలుగురితో కలసి ఉన్నను భయములేదని భావించును. 'ఇప్పుడు సంసారబాధలు, ఆశలు నన్నంటవు. మంచుతెర విడిపోయి, జ్ఞానము స్వచ్ఛముగా ప్రకాశించు నప్పుడు, నేను అసత్యముల కాలవాలమైన ప్రపంచమందు నివసించియు, దాని కతీతుడనుగా నుండగలను. ఇప్పుడు నా హృదయము నేదియు పీడింపజాలదు' అని అతడనుకొనును.

రెండవ దృశ్యములో, అతడు ఒక రహదారి ప్రక్కన కూర్చొని వచ్చిపోవు వ్యక్తులను పరికించుచుండును. ఆ త్రోవనే వాసంతియను ఒక పసిబాలిక వచ్చును. ఆమె

ఒంటరిది. నిస్సహాయ. ఆమె తండ్రి సంఘాచారముల మన్నించ లేదు. అందుచే నిరాశ్రయమైన ఆ బాలికను సంఘము బహిష్కరించినది. ఆమె సన్యాసివద్దకు వచ్చి కూర్చుండును. సన్యాసికి ఎవరితోను నిమిత్తము లేదు. ఏ బాహ్యస్పర్శ అతనిని కదలింపజాలదు. అందుచేత, నతడూరకుండును. ఆ అభాగినికి సన్యాసి భావములు స్ఫురించవు. కాని, అతడు తన్ను అసహ్యించుకొనుటలేదని మాత్రము గ్రహించును. ఆమె హృదయము కృతజ్ఞతతో, ప్రేమతో నిండిపోవును. సంతోష ముతో, నాతని ప్రక్కనే నిద్రపోవును. ఆమెను చూచు చుండగనే సన్యాసి హృదయములో, తిరిగి, మానవసహజమైన ప్రేమభావ మంకురించును. మేల్కొనినపిదప, వాసంతి ప్రేమతో నతని హస్తమును తన చెక్కిలికి రాచుకొనును. అమాయకముగా, సుందర కుసుమభరితమైన తీగను చూపి తనవలెనే దానికిని ఒక మహా వృక్షము ఆశ్రయము కావలసి యున్నదని చెప్పును. కాని, ఇప్పటికే సన్యాసి తన హృదయ చాంచల్యమునకు భయపడును. అతడు క్రూరముగ తీగను విదల్చి, ఆ అమాయకురాలిని విడచి వెళ్లిపోవును. వాసంతి జాలిగా 'తండ్రీ! నీవు విడచి వెళ్లినచో నేను బ్రతుకను!' అని విలపించును. కాని, సన్యాసి వినిపించుకొనడు.

మూడవ దృశ్యములో, అతడు ఒక కొండదారిలో నాగి, ప్రకృతి సౌందర్యము నవలోకించుచుండును. అతనికి తెలియ కుండగనే అతనిలో యేదో మార్పు కలిగినది. చినిగిన బట్టలతో నక్కడి కొక పసిపిల్ల తండ్రిని వెదకుకొనుచు వచ్చును. ఆమె ఆకారము, కంఠము, అమాయకమైన జవాబులు అన్నియును అతనికి వాసంతిని తలపించును. అతడిప్పుడు తన అనురాగము

తెలుసుకొని సిగ్గుపడడు. శత్రువునివలె దానిని తరిమివేయుటకు ప్రయత్నించడు. కాని, ఎట్లైన తిరిగి వాసంతిని కలుసుకొని ఆమెను ఓదార్చవలెనని ఆతృతపడును.

కడపటి దృశ్యములో, ఆతడు తన భిక్షాపాత్రను, జోలి దండములను విడచి మానవ ప్రపంచములోను విశ్వప్రేమలోను తనకు కలిగిన నూతనానుభవమును, నమ్మకమును ప్రకటించును. 'మిణుగురుపురుగు కాంతితో తన మార్గమును వెదకుకొనుచు, సూర్యకాంతిని, నక్షత్రములను విడచువాడు నిజముగా మూర్ఖుడు. శరీర రహితమైన శూన్యబంధనము నుండి నేను విముక్తుడను—వస్తు సమూహములో బాహ్యాకారములలో, కర్తవ్యముల మధ్య నేను స్వతంత్రుడను. మూర్త వస్తువే నిజముగా అమూర్తమైనది; అనంతమైనది. ప్రేమయే సత్యము!' అని చెప్పును. పల్లెలో ప్రతివ్యక్తిని వాసంతిని గురించి అడుగును. చివరకు ఆమె మరణించినదని తెలుసుకొనును.

1883 లో రవీంద్రుడు మృణాలినీదేవిని వివాహమాడెను. కొన్నినెలల తరువాత, అన్న జ్యోతీంద్రుని భార్య మరణించెను. ఇది అతనికి తీరని దుఃఖకారణము. ఈ వదినగారియందు రవీంద్రుని కెక్కువ అభిమానము. తల్లి పోయిన తరువాత ఆమె యెన్నియోవిధముల నతనిని కాపాడెను. ఆమె ప్రేమ అందరిని ఆనందపరచుచుండెను. ఆమె మృత్యువుతో, రవీంద్రుని జీవితమున నొక ఘట్టము ముగిసెను. ఆతని వివాహముతో నొక నూతనాధ్యాయము ప్రారంభమయ్యెను.

ఐదవ అధ్యాయము

# బంగారు వంగభూమి

పెండ్లి అయిన తరువాత పదిహేనేండ్లు రవీంద్రుడు వంగదేశమందే యుండి సాహిత్య కృషిచేసెను. 1884-89 మధ్య మాత్రము ఒకసారి మూడు నెలలు యూరోప్‌కు వెళ్లి వచ్చెను. ఆతనికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలిగిరి. సంపూర్ణమైన సంసార సుఖము నతడనుభవించెను. ఈ కాలములోనే అతడు అనేక గ్రంథములను రచించెను. పద్యసంపుటములు, గేయసంపుటములు అనేకములు ప్రచురించెను. అతని వదినగారు, సత్యేంద్రనాథుని భార్య, 'బాలక్' అను ఒక పిల్లల పత్రికను ప్రారంభించెను. రవీంద్రుడు ఈ పత్రికలోను 'భారతి' లోను అనేక వ్యాసములు, కథలు, గేయములు ప్రచురించుచుండెను. క్రమక్రమముగా నాతని కీర్తి అతిశయిల్లెను. ప్రజలతని వాక్కులను శ్రద్ధతో వినుచుండిరి. అనేక ముఖ్య విషయములలో నాతడు పాల్గొనుచుండెను. అతని ప్రజాహిత కార్యములలో మొదటినుండి న్యాయాభిమానము వ్యక్తమగుచుండెను. అహితమైనను న్యాయమైనదానినే అతడెప్పుడు అనుసరించుచుండెను.

బ్రహ్మసమాజమతమును స్థాపించి నాయకత్వము వహించిన వారిలో దేవేంద్రనాథ్ ఠాకూర్ ముఖ్యులు. విగ్రహారాధనను బహిష్కరించి, సంఘ దురాచారములను రూపుమాపుట ఈ మత సంప్రదాయము. రవీంద్రుని కాలమునాటికి ఇందు మూడు విభాగము లేర్పడెను. రవీంద్రుని కుటుంబమువారు

ఆదిబ్రహ్మసమాజమునకు చెందినవారు. పెండ్లి ఐన రెండు మూడు సంవత్సరముల తరువాత రవీంద్రుడు ఈ బ్రహ్మ సమాజమునకు కార్యదర్శియై చాలరోజులు పనిచేసెను. సమాజ ప్రార్థనలలో పాడుటకే అతడనేక గీతములు రచించెను. తరుచు సమాజసభలో మాటలాడుచుండెను. ఈ సంభాషణ ములు స్వానుభవముతోను ఉత్తమ భావములతోను కూడి వినువారికి ఉత్తేజకరముగ నుండెను. కాని, కొంతకాలము తరువాత, రవీంద్రుడు ఈ సమాజమును విడిచిపెట్టును. 'పండిన విత్తనము సమయము వచ్చినప్పుడు తాను పుట్టిన వృక్షమును విడిచి స్వేచ్ఛగా మఱియొకచోట క్రొత్త జీవితమును గ్రహించును. నేను ప్రస్తుతము ఆ పరిస్థితిలోనే ఉన్నాను' అని అతడనెను. ఫీలైనన్నినాళ్లు అతడు బ్రహ్మసమాజమునకై కృషిచేసి తన ఋణము తీర్చుకొనెను. కాని, విశాలమైన అతని సత్యాన్వేషణ సంకుచితమైన మత బంధనములలో నిముడ జాలకపోయెను. పరమాత్ముని శక్తి వివిధ వ్యక్తుల నొకే కుటుంబ ముగ ఏకము చేయుగలదని అతని నమ్మకము. కాని, వివిధ మతములు వ్యక్తులను విడదీసి వేరుచేయుటకే ఉపయోగించు చుండెను. అతడు ప్రత్యేకించి ఒక మతమును 'ఇది నా మత' మని చెప్పుటకంటె సర్వమానవ మతమును గురించియె మాటలాడుచుండెను.

19-వ శతాబ్దములో బ్రహ్మసమాజము వంటి సంస్థలు కొన్ని హిందూ ధర్మములను విపరీతముగ విమర్శించుచుండెను. కొన్ని హిందూ ఆచారములను, సంప్రదాయములను పూర్తిగా రూపుమాపవలెనని వాని ఉద్దేశము. దీనివలన సనాతన ధర్మ పరులలో కలవరము బయలుదేరెను. హిందూధర్మము పూర్తిగా

నశించిపోవునని వారి భయము. ఈ నూతన భావములను ఎదుర్కొనువారొక క్రొత్త సంఘముగా నేర్పడిరి. విదేశీ భావములను, ఆచారములను గ్రహించుట వీరు గర్హించిరి. ఈ ఉద్యమమునకు 'క్రొత్త హిందూధర్మ'మను పేరు వచ్చెను. చాలమంది ఇందు సభ్యులుగా నుండిరి. కొందరు బంకిమ్ చంద్ర చటర్జీ వంటివారు, మనసార, ఉదాత్త భావముతో ఉద్యమాభివృద్ధికి పాటుపడుచుండిరి. కాని, మరికొందరు సంకుచిత భావముతో స్వలాభమునకై అన్యాయ మార్గముల ననుసరించుచుండిరి.

రవీంద్రుడు తండ్రి శిక్షణలో ఎల్లప్పుడు సత్యమునే ప్రేమించుట నేర్చుకొనెను. అతడు ఈ 'నూతన హిందువుల'ను తన శక్తి నంతయు వినియోగించి ఎదుర్కొనెను. వారి ప్రచారము సత్యమునకు విరుద్ధమని, వారి ఆచరణలు హిందూ మతమునకే తలవంపులని అతడు భావించెను.

ఒకసారి, ఈ 'నూతన హిందూధర్మము'నకు చెందినవారు కలకత్తాలో మతప్రచారము చేయుచున్న ఒక క్రైస్తవ మిషనరీని క్రూరముగా కొట్టి గాయపరచి, పారిపోయిరి. ఈ విషాద ఘటన విన్నప్పుడు రవీంద్రుడు మిక్కిలి పరితపించెను. అది చాల అవమానకరమైన విషయమని, పిరికితనమని అతడు భావించెను. వెంటనే అతడు 'ధర్మ ప్రచారమ'ను వ్యంగ్య గేయమును రచించి ఈ 'నూతన హిందువుల' నాక్షేపించెను. వారి చేష్టలు హిందూ ధర్మమునకు విరుద్ధమైనవని ప్రకటించెను. దీనివలన బంకిమ్ చంద్రునికిని రవీంద్రునికి మనస్పర్థ లేర్పడెను. రవీంద్రునికి బంకిమ్ యెడల గొప్ప గౌరవము. అదృష

వశమున, బంకిమ్ మరణించుటకు పూర్వము ఇద్దరికిని తిరిగి స్నేహమయ్యెను.

రవీంద్రునికి దేశభక్తి, జాత్యభిమానము మెండు. తన జీవితకాలమంతయు నాతడు భారత దేశాభ్యుదయమునకే పాటు పడెను. అయినను సంకుచితమైన దేశాభిమానమును అతడు తీవ్రముగ నిరసించుచుండెను. అతడు 'విశ్వకవి' ఐనను ముఖ్యముగ వంగదేశపు కవి అని కూడ చెప్పనచ్చును. అతని పద్యములు వంగదేశపు సుందర దృశ్యములతో, అక్కడి వానలతో, పంటలతో, వసంత పరిమళములతో నిండియుండును. అక్కడి నదులు, వరిచేలు వెదురు పొదలలో దాగిన పల్లెలు, అచ్చటి ప్రజల పేదరికము, మూగవేదన—అన్నియు రవికి సుపరిచితములు, ప్రేమాస్పదములు. ఇవి అతని గేయములలో ప్రతిధ్వనించును. ఈ గీతములలో ప్రసిద్ధమైనది 'సోనార్ బంగ్లా', అనగా 'బంగారు బెంగాల్'. బెంగాలీ భాషలో సోనార్ అను పదములో ప్రేమ, సౌందర్యము, అభిమానము—ఎన్నో వ్యక్తమగును. ఈ గీతములో పదములు, రాగము కూడ, అతి సరళమైన బెంగాలీ జానపదగీతముల తలపించు చుండును. ఇప్పుడు ఈ గేయమును వంగదేశమంతటా వినవచ్చును. అందు రెండు చరణము లిట్లుండును:

'సోనార్ బంగ్లా! నా ప్రియతమ,
నీ నీల గగనం, చల్లని పవనం
నా హృదిలో వేణువు నూదును, అనంతముగ;
ఫాల్గునములో నీ మామిడి తోపులో
సువాసనలు నాపై మరపించు

"అఘురన్" లో నీ సస్యశ్యామల భూములు
ఎంత తీయని చిరునవ్వులు వెదజల్లు!

*　　*　　*　　*

పశువులు మేయు నీ పొలములలో
పడవలు దాటు నీ నదీ తీరములో
పక్షులు పాడెడు నీ పల్లె నీడలలో, సందులలో
ధాన్యము నిండిన నీ గృహాంగణములో
నా రోజులు గడచును ప్రశాంతముగా
గోపకులు, కర్షకులు నీ భూమిలో
అన్నలు తమ్ములు అందరు...'

*　　*　　*　　*

కేవలము వంగదేశమును స్తుతించుటతో మాత్రము రవీంద్రుడు తృప్తిపడలేదు. అతనివలె దేశాభివృద్ధి కనేక విధముల పాటుపడిన కవులు చాల తక్కువ. ఈ పదిహేను సంవత్సరములలో బెంగాలీ భాషను, పల్లెలను సంస్కరించుటకు రవీంద్రుడు చాల శ్రమపడెను. జీవితాంతమువరకు అతడీ రెండు విషయములందు శ్రద్ధ జూపుచుండెను.

గడచిన శతాబ్దములో చదువుకొన్న బెంగాలీ వారందరికి తమ మాతృభాషను నిరసించుట సామాన్యముగ నుండెను. సమావేశములలోను, ఇతర చోట్లను వారు వీలయినంతవరకు ఆంగ్లభాషనే వాడుచుండిరి. పాఠశాలలలో అన్ని విషయములు ఆంగ్ల భాషలోనే బోధించుచుండిరి. బెంగాలీవారు ఆంగ్లమున మాట్లాడుట గౌరవముగ భావించిరి. మాతృభాషను చక్కగ నేర్చియుండుటలో గొప్పలేదు. రవీంద్రుని కిది చాల బాధ

కలిగించెను. అతడు పాఠశాలలో అన్ని విషయములు బెంగాలీ లోనే బోధింపవలెనని ప్రచారము చేసెను. రవి అన్నగారు అతనికి మొదట బెంగాలీలోనే అన్ని విషయములు బోధింప జేసి, తరువాతనే ఆంగ్లభాష నేర్పించెను. ఈ విషయమును అతడు మరచిపోలేదు. ఇదియే క్రమమైన పద్ధతి యని అతడు భావించెను. సంగీతములో కూడ, నతని గురువు మొదటనే అర్థముకాని హిందూస్థానీ పాటలు నేర్పక సరళమైన బెంగాలీ జానపదగేయములు పాడించెను. ఆ పాటలు తన కర్థమగుట చేతనే రవి వానిని ఎక్కువగ ప్రేమించెను. తను చిన్నతనములో నేర్చుకొని ఆనందించిన పల్లె పదములు, పిల్లల పాటలు అన్నియు రవి ఇతరులకొరకు సేకరించి యుంచెను.

ఆ రోజులలో సంవత్సరమున కొకసారి 'వంగదేశ ప్రాంతీయ సభ' జరుగుచుండెను. రవి తప్పక ప్రతిసారి ఆ సభకు వెళ్లెడివాడు. ఆ సభా కార్యక్రమమంతయును ఆంగ్లములోనే జరుగుచుండెను. 1897 లో రవి అందరు బెంగాలీలే కాబట్టి, కార్యకలాపము వంగభాషలోనే జరుగవలెనని పట్టుబట్టెను. కాని, చాలమందికి అది నచ్చకపోవుటచేత నాతడు కృతకృత్యుడు కాలేదు. రెండేళ్ల తరువాత నొకసారి అధ్యక్షుడు ఆంగ్లభాషలో మాట్లాడినప్పుడు, రవి దానిని బెంగాలీలో తిరిగి చెప్పెను. ఆ తరువాత కొంత కాలమునకు సభా కార్యక్రమము బెంగాలీలోనే జరుగజొచ్చెను.

ఇట్లు ఎన్నో సంవత్సరములు కృషిచేసి రవీంద్రుడు బెంగాలీ భాషకు తగిన ప్రాముఖ్యత కలిగించెను. ఇప్పుడు వంగదేశమునందు పాఠశాలలన్నిటిలోను పాఠములు బెంగాలీ లోనే చెప్పుదురు. ఆంగ్లభాషను రెండవ భాషగా మాత్రమే

పిల్లలు నేర్చుకొనుచున్నారు. సభలన్నియు బెంగాలీలోనే జరుగుచున్నవి. బెంగాలీవారు తమ మాతృభాషలో మాటలాడుటకు సిగ్గుపడుటకు బదులు ఇప్పుడు గర్వపడుచున్నారు. విశ్వవిద్యాలయములో పట్టప్రదానోత్సవ సమయమందు ఉపన్యాసములు ఆంగ్లములోనే జరుగుట ఆచారము. కాని, ఒకసారి రవీంద్రుడు బెంగాలీలోనే మాటలాడెను. ఈ మాతృభాషాభిమానము ఒక్క వంగదేశములోనేకాక, క్రమక్రమముగా తక్కిన ప్రాంతములకుకూడా ప్రాకెను. మహాత్ముని జాతీయసేవా కార్యక్రమములో ముఖ్యమైన పదమూడు విషయములలో మాతృభాషాభిమాన మొకటి.

ఈ విధముగ బెంగాలీభాష కొరకు కృషి చేయునప్పుడు రవీంద్రునికి ఆంగ్లభాష నేర్చినవారే కాక, వంగభాషా పండితులుకూడ వ్యతిరేకముగ నుండిరి. ఆ రోజులలో బెంగాలీలో ప్రజలు మాటలాడు వాడుక భాషకును, గ్రంథములలో వాడు శిష్ట భాషకును చాల భేదముండెడిది. ప్రజలందరు విజ్ఞానవంతులై గ్రంథములను సులభముగ నర్థము చేసుకొనవలెనని తలచినచో అందరు వాడుక భాషలోనే వ్రాయవలెనని రవి పట్టుబట్టెను. కాని, పండితులు ఇందుకు ఒప్పుకొనలేదు. ఈ భేదము అన్ని ప్రాంతీయ భాషలకును సర్వసామాన్యమైనది.

వాడుకభాష సజీవమైనది. గ్రాంథిక భాష నిర్జీవమైనది, అసహజమైనది అని, రవీంద్రుడు పద్యములు, కథలు మున్నగునవి వాడుక భాషలోనే రచించుచుండెను. పండితులు దీనిని నిరసించిరి. కాని, అతడు లక్ష్యపెట్టలేదు. పండితపామరుల కందరికి నచ్చునట్లుగా 'సోనార్ బంగ్లా' వంటి గేయము లనేకములు రచించెను. ఈ గీతములన్నియు మనోహరముగ

భావపూరితములై ఆకర్షణీయముగ నుండుట కందు వాడిన సరళమై, సజీవమైన వాడుకపదములే కారణము. ఇప్పుడు చాలమంది బెంగాలీ కవులు వాడుక భాషలోనే రచించు చున్నారు. చాల పుస్తకములు పసిపిల్లలకుకూడ అర్థమగు నట్లుండును. దీనికంతయు కారణము రవీంద్రుని కృషియేనని చెప్పవలెను.

1890 సంవత్సరమునుండి రవీంద్రునికి పల్లెప్రజలతో ఎక్కువ పరిచయము కలిగెను. అతడు తమ భూములపై యాజమాన్యము వహించినది ఆ ఏడే. ఠాకూర్ కుటుంబము నకు ఒరిస్సాలోను ఉత్తర బెంగాల్‌లోను భూములుండెను. అప్పటికి రవీంద్రునికి ముప్పది సంవత్సరములైనా నిండలేదు. భూములను గురించి, పల్లె జీవితమును గురించి అతనికేమియు తెలియదు. అందుకే, మొదట అతడు కొంత భయపడెను.

అతడు ఒరిస్సాలో పద్మానది వద్ద షిలైదాలో కాపురము పెట్టెను. అక్కడికి చిన్నతనములో నొకసారి అన్నగారితో వెళ్లియుండెను. అప్పుడు అక్కడి ప్రకృతి సౌందర్యము, ప్రశాంతత మాత్రమే అతనిని ఆకర్షించియుండెను. కాని, ఇప్పుడు వ్యవసాయము మున్నగు పనులు చూచుకొనుటలో నాతనికి పల్లెప్రజలతో పరిచయ మేర్పడెను. అతడు వారి కష్ట సుఖములను గ్రహించి వారి ఆవశ్యకతలను గుర్తించెను. ధనవంతులందరు పట్టణములలో నివాస మేర్పరచుకొనుటచేత, పేదవారి జీవితము దుర్భరముగ నుండెను. అతడు పడవలో ఒక చోటినుండి మరియొకచోటి కేగుచు, పనులు చూచు కొనుచు, అచ్చటివారి కాప్తుడయ్యెను.

పూర్వము, ధనవంతులైన భూఖామందులందరు పల్లెల లోనే నివసించుచుండుటచేత వారు అచ్చటవారికి తగిన సౌకర్యములు చేయుచుండిరి. రహదారులు, గుళ్లు, భవనములు బాగుచేయించి, పల్లెలు పరిశుభ్రముగ ఆరోగ్యముగా నుండునట్లు చూచుచుండిరి. కంసాలులు, సాలెవారు, వడ్రంగులు అందరు వారి నాశ్రయించి జీవనము గడుపుకొనుచుండిరి. ప్రతి పల్లెకూడ ఆహార విషయమున, వస్త్రముల విషయమున, విద్యా వినోద విషయములన్నింటియందు స్వయం సంపూర్ణమై యుండెను. కాని, ధనవంతులు పట్టణములకు తరలిపోయి శిస్తు వసూళ్లకు మాత్రమే పల్లెలకు వచ్చుట ప్రారంభించినప్పుడు, అవి క్షీణదశకు వచ్చెను. బ్రతుకు తెరువులేక, చాలమంది పట్టణముల చేరుచుండిరి. పల్లెల దుర్దశను గమనించువారు లేకపోయిరి.

పల్లెప్రజలు పట్టుదలతో పనిచేసినచో తమ పనులు తామే స్వయముగ నిర్వహించుకొనగలరని రవి ఊహించెను. దానికి ధన మవసరములేదు. అందరు కలసి పనిచేసినచో చాలును. పొలముపని లేనప్పుడు వారు రోడ్లు బాగు చేసుకొనవచ్చును. కాని, పల్లెవాసుల కీ మాటలు నచ్చలేదు. వారు సోమరితనమున కలవాటు పడియుండిరి. ప్రభుత్వము కాని, భూస్వాములుకాని ఈ పనులు చేయవలెనని వారి ఉద్దేశ్యము. ఎప్పుడును, ఇతరుల ఆజ్ఞలను పాటించుటమాత్రమే తెలిసియుండుటచే వారు స్వతంత్రించి పనిచేయజాలకుండిరి. ఏమైన కష్టములు వచ్చినను వారవి తొలగించుటకు ప్రయత్నింపక 'అంతా కర్మ' అన్న వైరాగ్య భావముతో నుండిరి. హిందువుల కన్న ముస్లిములు రవీంద్రుని మాటలు కొంచెము పాటించిరి.

రవీంద్రుడు, కుమార్తె బేల

కాని, దీనివలన రవీంద్రుడు నిరుత్సాహపడలేదు. ఈ పల్లెల పునరుద్ధరణ అంత సులువైనదికాదని ఆతడు గ్రహించెను. ఊరక సలహాల నిచ్చుటచేతనే పల్లీయులలో మార్పు రాదు. వారి పనులు వారే శ్రద్ధతో చేసికొనుటకు ముందు వారి దృక్పథము మారవలెను. వారికి ఆత్మాభిమానము ఎక్కువ కావలెను. ఇందుకు వారికి విద్య అవసరము. యువకులందరు విజ్ఞానవంతులై క్రొత్త మార్గములకు నడుము కట్టవలెను. తరువాత, ఇది యంతయు నిజముగ ఫలవంతము కావలెనన్నచో భూసంస్కరణ జరిగి ఆర్థిక విధానము మారవలెను. దీనికంతయు తగిన పరిష్కారము అప్పుడు రవికి స్ఫురించలేదు. కాని, చాల రోజుల తరువాత, అతడు శ్రీనికేతనము స్థాపించి గ్రామోద్ధరణకు పూనుకొన్నప్పుడు ఈ సమస్యలన్నియును అతడు చాలవరకు పరిష్కరింపగలిగెను. అప్పటికి అతనికి అరువది సంవత్సరములు. ఐనను అతని ఉత్సాహమేమాత్రము తగ్గలేదు. ఇదివరకు కంటె అనుభవము, విజ్ఞానము మాత్రము అధికమయ్యెను.

ఈ సమయమున రవీంద్రుడు వ్రాసినవన్నియు గ్రామ్య జీవితముతో, వ్యక్తులతో నిండియుండెను. అతడు తన మేనకోడలికి ఈ పల్లె జీవితమును వర్ణించుచు లేఖలు వ్రాసెను. వానినే Glimpses of Bengal (వంగదేశ దృశ్యములు) అను పేరుతో తరువాత ప్రచురించెను. అతని కథలు అనేకముల కథావస్తువు ఈ లేఖలలో కనుపడును. పట్టణమునకై పరితపించుచు పసిపిల్లలకు చదువు చెప్పుచుండు పోస్టుమాస్టర్ ఇందు కానవచ్చును. రవీంద్రుడు ఈ విధముగ వ్రాసిన కథలన్నియు ఆంగ్లమున కనువదింపబడినవి. అవి ఆతని ఉత్తమ

రచనలుగా పరిగణింపబడుచున్నవి. ఈ కథలవలన పట్న
వాసపువారికి పల్లెజీవితము కొంతవరకు అర్థమయ్యెను.

## ఆఱవ అధ్యాయము

# శాంతినికేతనము

1900–1901 లో రవీంద్రుని జీవితమున నొక క్రొ
దశ ప్రారంభమయ్యెను. అప్పటికి అతనికి నలుబది ఏండ్ల
తన జీవితమున నేదో మార్పు రాగలదని ఉత్సాహముతో
అశాంతితో కలవరపడుచుండెను. కాని, అది ఎట్టి మార్
అప్పటికి అతనికి స్పష్టముగా తెలియదు.

ఈ సమయమున నతడు భగవంతునియందు తనకుగల
భక్తి విశ్వాసములను వెలిబుచ్చుచు ప్రార్థన గీతములు వ్రాసెను
వృద్ధుడైన అతని తండ్రి సదా దైవప్రార్థనలోనే నిమగ్నుడై
యుండెను. ఒక రోజు రవి తాను వ్రాసిన నూతన గీతములు
తండ్రియొద్ద పాడెను. ఆ పాటలనే అతడు తరువాత 'నైవేద్య
మను పేరుతో ప్రచురించెను. మహర్షి ఆ పాటలు విని
రవీంద్రుని భక్తికి చాల సంతోషించెను. రవి ఆ గ్రంథమును
తన తండ్రికే అంకిత మిచ్చెను.

ఆ రోజున రవి పాడిన పాటలలో ఒకదాని భావ మిది:

'నాకు దగ్గరగా ఉన్నవారు అందరికన్నా నీవే నాకు
సన్నిహితుడవని యెరుగరు. నాతో మాటలాడు
వారు నీ మౌన వాక్కులే నా హృదయమును నింపునని
ఎరుగరు.

నా త్రోవలో గుమిగూడువారు, నేను నీతోనే ఒంటరిగ
నడుచుచున్నానని ఎరుగరు.

నన్ను ప్రేమించువారు, ఆ ప్రేమ నిన్ను నా హృదయ
మున చేర్చునని ఎరుగరు.'

ఈ గేయమందలి సరళత, సత్యభావము మహర్షిని చాల ఆకర్షించెను. అతడు చిరునవ్వుతో ఇట్లనెను: 'పూర్వము ఉత్తమ కవులను రాజులాదరించి బహూకరించెడివారు. కాని, ఇప్పుడది లేదు. కాబట్టి నేనే నిన్ను బహూకరించెదను.' అని చెప్పుచు ఆ పాటలు ప్రచురించుటకు తగిన ధనమును రవీంద్రున కిచ్చెను. పుస్తకము ప్రచురించిన తరువాత రవీంద్రుడు తిరిగి తండ్రియొద్దకు వెళ్లి మరియొక వరమడిగెను. శాంతినికేతనాశ్రమములో ఒక పాఠశాలను ప్రారంభించుటకు అనుమతి వేడెను. తాను తండ్రిదగ్గర స్వేచ్ఛగా ఆనందముతో పెరిగి విద్యలు నేర్చినట్లే పిల్లలకు చదువు నేర్పవలెనని అతని సంకల్పము. మహర్షి ఆశీర్వాదముతో క్రొత్తబడి ప్రారంభ మాయెను.

1901 లో రవీంద్రుడు తన కుటుంబముతో శాంతినికేతన మున నివాస మేర్పరచుకొనెను. రవీంద్రుని కా ప్రాంతము సుపరిచితము. అతని తండ్రి, అన్నగారు అక్కడ చాల రోజులుగా నివసించుచుండిరి. ఏకాంతము, ప్రశాంతత కోరు బంధుమిత్రులు అప్పుడప్పుడు వచ్చి పోవుచుండిరి. ఆశ్రమ మంతట చల్లని చెట్లు. అక్కడ మహర్షి ఒక మందిరమును కట్టించెను. 1900 లో భవన నిర్మాణ దశవార్షికోత్సవ సందర్భమున రవి అక్కడ ఉపన్యాసమిచ్చెను. ఆశ్రమ జీవితము చాల సరళమైనది. స్వేచ్ఛ గలది. నియమములు చాల

R. B. A. N. M. S. H. S. M. LIBRARY
Bangalore 42
Accession No; 3192
U. D. C. No.

తక్కువ. ఆశ్రమ ద్వారముపై 'ఇచ్చట నిరాకారభగవంత
సేవింపవలెను' అని చెక్కియుండెను. విగ్రహారాధన వి
పెట్టుట, ఇతర మతముల దూషింపకుండుట, అహింస —
మూడే ఆశ్రమ నిబంధనములు.

రవీంద్రుడు తలపెట్టిన బడికి శాంతినికేతనము అ
విధముల తగినది. రవీంద్రునికి పిల్లలన్న ఎక్కువ ప్రే
అతనికే చాలమంది పిల్లలుండిరి. వారందరు స్వేచ్ఛ
ఆనందముగ నుండునట్లు పెద్దవారిని చేయుట అతని ఆశయమ
అతనికి తన బాల్యము చక్కగా జ్ఞప్తియుండెను. అతడప్పు
స్వేచ్ఛగా తిరుగుటకెంతో ఉత్సాహపడుచుండెను. ఇల్లు, బ
కూడ చెరసాలవలె కనుపించెను. అర్థముకాని ఇంగ్లీషు చదు
పాఠములు విసుగెత్తించుచుండెను. అందుచేత బడిలో పిల్ల
ఎట్టి నిర్బంధములు లేక స్వేచ్ఛగా నుండవలెనని అత
కోరెను. ఆ విధముగనే వారు తమ శక్తి నంతయు వినియో
గించి వృద్ధికి రాగలరని అతని భావము. ఆట పాటలలో
వారికి విజ్ఞానము కలిగించవలెనని తలచెను. అంతేగాక
వారు ప్రకృతి సౌందర్యమును గుర్తించి అందు లీనమగుటకూ
నేర్చుకొనవలెను. జరసంకాలో కొబ్బరి తోపులలో ఏద
సౌభ్రాతృత్వము రవికి గోచరించెడిది. శాంతినికేతనములో
చల్లని చెట్లనీడలలో అట్టి స్నేహము, సౌభ్రాతృత్వమే ర
పిల్లలకు నేర్పెను.

మొదటి సంవత్సరము క్రొత్త బడిలో ఐదుగురు పిల్లల
మాత్రమే ఉండిరి. అందు ఒకరు రవీంద్రుని కొడుకే! కాని
కొన్ని సంవత్సరముల తరువాత, అక్కడ నూటయేబది మంది
వరకు చేరిరి. ఇప్పుడు అక్కడ చాలమంది బాలికలుకూడ

ఉన్నారు. వారికి ప్రత్యేక వసతిగృహముకూడ కలదు. కాని, వారి విద్యాబోధన అంతయు బాలురతో కలిసియే యుండును.

రవీంద్రుడు తన పాఠశాలను ప్రాచీన గురుకులములవలె నడుపదలచెను. పూర్వము అరణ్యములలో, తపోవనములలో, జన సమ్మర్దమునకు దూరముగా ప్రకృతిబడిలో బాలురు ఋషుల శుశ్రూషచేసి చదువుకొనుచుండిరి. అక్కడ వారి జీవితము నిర్మలమైనది, నిరాడంబరమైనది. గురు శిష్యుల సంబంధము ప్రేమపూరితమైనది. సత్యాన్వేషణమే వారి ముఖ్య ఉద్దేశము. రవీంద్రుడు ఆ ఆదర్శములనే మనసున నుంచుకొని, ఆధునిక జీవితమున కనుగుణముగ తన పాఠశాలను స్థాపించెను. అతని స్నేహితు డొకరు చెప్పినట్లు అది నిజముగ శాంతినిలయము; తరతరములనుండి హిందూదేశమున రూపొందిన ఆత్మ నిజస్వరూపము.

శాంతినికేతనము కవి ఊహించిన బడి కావుననే అది సంగీతముతో కవిత్వముతో నిండియుండెను. 'శాంతి నికేతనము కాగితముపై గాక జీవితముపై వ్రాసిన కవిత్వమని' రవీంద్రుడు చెప్పెను. 'ఒకనాడు, వర్షాకాలమున మేఘముల చాటునుండి సూర్యకిరణములు తొంగితొంగిచూచు సమయమున సాలవృక్షముల వెచ్చని నీడలలో కొందరు బాలురను నా చుట్టు చేర్చుకొనినపుడు నేను కవిత్వము వ్రాయ ప్రారంభించితిని. కాని, మాటలతో కాదు' అని అతడు చెప్పెను. బడిలో ప్రతిదినము పాటలతో ప్రారంభమై పాటలతోనే అంతమగుచుండెను. రవీంద్రుడు తన ప్రార్థనాగీతములనే బాలురకు నేర్పెను. ప్రతి ఉదయము సూర్యోదయమునకు పూర్వమే కొంతమంది బాలురు గోష్ఠిగానము చేయుచు ఆశ్రమమంతయు

తిరిగి అందరను లేపుదురు. ఆ పాట ప్రకృతి శోభను, ఉదయ సాంధ్యలకు, వసంతకాల పుష్పములకు, శరత్కాలపు పంటలకు, వెన్నెల రాత్రులకు కవి దేవున కర్పించు కానుకలు. ధన్య వాదములు. అందొక పాట భావమిది:

'నా జీవిత సంధ్యలలో, సౌందర్యముతో చనుదెంచు
 నీకు,
నే నమస్కరింతు; నిన్ను పూజింతు;
నా అంతరాంతరాంధకారములో, ఆనందము కొని
 తెచ్చు నీకు
నే నమస్కరింతు; నిన్ను పూజింతు;
నాపై వాలిన ఆకాశములో ప్రశాంతమైన
మలయపవనపు కౌగిటిలో నిద్రలో
నీకు నే నమస్కరింతు; నిన్ను పూజింతు;
అలసిన ధరణీ మహిత సింహాసనమున
నీలాకాశములో,
చలింపని తారలతో నిశ్శబ్దముగ పలుకు
నీకు నే నమస్కరింతు, నిన్ను పూజింతు;
ఈ శ్రమ ఫలిత ఏకాంత పాఠశాలలో
ఈ పరిమళయుత సంధ్యా కుసుమమాలలలో నీకు
నే నమస్కరింతు, పూజింతు.'

తరువాత కొన్నాళ్లకు రవీంద్రుని మేనల్లుడు దినేంద్ర నాథుడు ఈ పాఠశాలకు చాల సేవ చేసెను. అతను గొప్ప గాయకుడు. పిల్లలకు రవీంద్రుని పాటలన్ని క్రొత్త రాగము లతో నేర్పువాడు. వారికి ఈ పాటలు చాల ఇష్టము. సౌందర్యమయమైన ప్రకృతి యెంత ఆనంద మీయకలదో కవి

భావనవలన అనుభవించి అందు భగవంతుని నిజ స్వరూపము ఇమిడియున్నదని వారు తెలిసికొనగలిగిరి.

గ్రామీణజీవనములోని విశేషములను, ఋతువుల మార్పును రవీంద్రుడు బడిలో ఉత్సవములద్వారా పిల్లలకు తెలుపుచుండెను. శాంతినికేతనమున ప్రతి ఋతువు ప్రారంభమునను ప్రతి విశేష సమయమునను ఉత్సవములు జరుగును. శరదోత్సవము, వన మహోత్సవము, వ్యవసాయ మహోత్సవము, ఇట్లు ఎన్నో జరుగుచుండెను. ఇవి అన్నియును ఆట పాటలతో, నృత్యములతో ఊరేగింపులతో జరుపుదురు. ప్రతి ఉత్సవమునకు తగినట్లు రవీంద్రుడొక క్రొత్త నాటకమును రచించుచుండెను. శరదోత్సవము, ఫాల్గుణి, వసంతము మొదలగు గేయనాటికలన్నియును ఇట్లు వ్రాసినవే. నాటకములద్వారా విజ్ఞానాభివృద్ధి కలుగునని నమ్మి రవీంద్రుడు వారిచేత తరుచు నాటకములు వేయించెడివాడు. బడిలో పిల్లల సంఖ్య తక్కువగా నున్నప్పుడు అందరికిని నటించుటకు అవకాశము లభించెడిది. నాటక ప్రదర్శనమును గురించిన కార్యకలాపములో పిల్లలకు నటనను గురించి, దుస్తులు రంగస్థల పరికరములు మున్నగువాటిని గురించి అనేక విషయములు తెలిసెడివి. డాక్ ఘర్ (పోస్టాఫీసు) అను నాటకమును వీరికొరకే రవీంద్రుడు రచించెను.

తన అభిప్రాయములనర్థము చేసికొని ఆచరణలో పెట్టగల ఉత్సాహవంతులైన యువకులనే రవీంద్రుడు పాఠశాలలో అధ్యాపకులనుగా నియమించెను. వీరు బాలురకు సాహిత్యము, చరిత్ర, విజ్ఞాన శాస్త్రము మున్నగునవి కుతూహలము కలుగునట్లుగా చెప్పగలవారు. పిల్లలకు నేర్పుతో చెప్పించో అన్ని

విషయములందు ఆసక్తి ఉండునని ఠాకూర్‌నకు తెలియును. ఊరికే విషయము మాత్రము చెప్పినచో పిల్లలకు విసుగెత్తుటయే గాక, వినిన దానిని త్వరగ మరచిపోదురు. అట్లు కాక, ఆటలతో జోడించి కథలవలె చెప్పినచో వారు శ్రద్ధగా విందురు. ఎప్పటికిని మరచిపోరు. తమకు ఇష్టమైన ప్రతి విషయమందు బాలురు ఏకధ్యానతో కృషి చేయుదురు. అందుకే రవీంద్రుడు పిల్లలకు స్వేచ్ఛ నిచ్చి వినోదమును, విజ్ఞానమును జతపరచెను.

శాంతినికేతనము పిల్లలకు ఇల్లువంటిది. 'ఇది ఇల్లు; దేవాలయము' అని ఠాకూర్ చెప్పెను. 'ఈ ప్రపంచములో పిల్లలు నిజముగ ఇంటికి తిరిగి వచ్చుటకు ఇక్కడ నేను ఏర్పాటు చేసితిని' అనెను. పాఠశాలలో అందరును స్నేహితులు; అధ్యాపకులు పిల్లలు అన్నదమ్ములవలె మెలగెడివారు. అధ్యాపకులే కాక రవీంద్రుడుకూడ చిన్నపిల్లవానివలె బాలురతో నాడుకొనువాడు. వారికంటె ఎక్కువ అల్లరి చేయువాడు. పిల్లలు ఒంటి కాలిమీద నడచుట, మోకాళ్లపై నడచుట, దుముకుట మున్నగునవి పరిశ్రమకొరకు, ఉల్లాసముకొరకు ప్రోత్సహించెడివాడు. గృహస్థులైన అధ్యాపకులు అప్పుడప్పుడు పిల్లలను వారి ఇండ్లకు తీసికొనిపోవువారు. వారి భార్యలు పిల్లలను తల్లులవలె ఆదరించెడివారు.

ఏ తరగతియందుకూడ ఎక్కువమంది పిల్లలుండుట ఠాకూర్‌నకు ఇష్టములేదు. పిల్లలు చాలమంది ఉన్నప్పుడు వారిని చిన్నచిన్న తరగతులుగా ఏర్పాటు చేసెడివాడు. ఒక్కొక్క అధ్యాపకుడు కొంతమంది పిల్లలను తన చుట్టు చేర్చుకొని ఏ మూలో చెట్టుక్రింద పాఠము చెప్పెడివాడు.

ఒక్కొక్కప్పుడు ఉల్లాసముగ, పిల్లలు, అధ్యాపకుడు, చెట్ల మీదకుకూడ ఎక్కి కూర్చొని చదువు కొనెడివారు. అంతటి స్వాతంత్ర్యత, స్వేచ్ఛ వారి కుండెడిది. ఏకకుటుంబము వారివలె అందరు స్నేహముగ నుండెడివారు. ఈ స్నేహభావము లేక, కఠిన నియమములుండియు ప్రయోజనము లేదు.

'నేనెప్పుడును వారిని "ఈ పని చేయవద్దు, ఈ చోటికి పోవద్దు" అని ఆజ్ఞాపించలేదు. చెట్లెక్కవద్దని చెప్పలేదు. వారు స్వేచ్ఛగా, ఆనందముగా, ఉండునట్లు మాత్రమే చూచితిని' అని, రవీంద్రుడు చెప్పెను. కాని అందరు తమ ఇష్టము వచ్చినట్లుండుటయే స్వేచ్ఛ కాదు. వీధిలో పోవు నప్పుడు బండ్లకెదురుగా, అందరికి అడ్డముగా పోవుట స్వేచ్ఛ అనిపించుకొనదు. జనులందరు సుఖముగా సురక్షితముగ సాగిపోవుటకు కొన్ని నియమములు అనుసరింపక తప్పదు. రవీంద్రుడు బాలురకు ఇట్టి నియమ బద్ధ స్వాతంత్ర్యమునే నేర్పెను. పాఠశాల చక్కగా నడచుటకు కొన్ని నియమములు అవసరమని అతడు గుర్తించెను. పిల్లలందరుకూడ, దీనిని గ్రహించి వారే కొన్ని నియమముల నేర్పాటు చేసికొనిరి. వారిలో కొందరిని సంఘ నాయకులుగా ఎన్నుకొనిరి. ఆశ్రమ పరిశుభ్రత, వినోద కలాపములు, భోజనసమయములు మున్నగు వానికి ఒక్కొక్కరు బాధ్యులుగా నుండిరి. ఒక బాలుడు ఈ సంఘ నియమముల పాటించనప్పుడు తగిన శిక్షయేదో పిల్లలే నిర్ణయించుచుండిరి.

ఈ విధముగ పిల్లలే బాధ్యత వహించి పాఠశాల నడుపు పద్ధతినతడు ఇంగ్లండ్, అమెరికా దేశములలో చూచెను. అక్కడ చట్టరీత్యా శిక్షననుభవించుచున్న బాలురకు ప్రత్యేక

పాఠశాలలుండెడివి. అందు తగిన బాధ్యత నిచ్చి స్వేచ్ఛగ విడిచిపెట్టినప్పుడు, ఎంతటి దుష్ట బాలురుకూడ సన్మార్గులై తమ జీవితమును చక్క దిద్దుకొనుచుండిరి. ఆ పద్ధతినే రవీంద్రుడనుసరించి ఫలసిద్ధి గాంచెను. ఒక్కొక్కసారి తల్లి దండ్రులు చాల మొండి బాలురను ప్రత్యేకముగ శాంతి నికేతనమునకు పంపుచుండిరి. కాని, అచ్చటి ప్రశాంత వాతా వరణములో వారు సాధువులగుచుండిరి. రవీంద్రునికి వారి వలన ఎట్టికష్టమును లేకుండెను. ఈ విధముగ రవీంద్రుడు పాశ్చాత్యదేశమందలి పద్ధతులను హిందూదేశమందలి ప్రాచీన పద్ధతులను జతపరచి క్రొత్త మార్గములతో పాఠశాల నడపెను.

ఇచ్చట, ఉత్తమ బోధనవలన పిల్లలు సత్యమును ప్రేమించుట నేర్చుకొనిరి. ప్రకృతి ఒడిలో కవితా గాన ములతో పెరుగుటచేత సౌందర్యమును ఆరాధించుట నేర్చు కొనిరి. నలుగురితో కలసిమెలసి మంచి చెడ్డలను గ్రహించుట నేర్చుకొనిరి. రవీంద్రుడు తండ్రిగారి ఆశ్రమములో జీవ హింస చేయరాదను నియమమును చక్కగా పాటించి పిల్లలకు సమస్త జీవులయెడ, దయ, సానుభూతి కలిగియుండుట నేర్పెను. ఇతర బాషలను, ఆచారములను, మతములను గౌరవించుట కూడ నేర్పెను. బడిలో చాలమంది విదేశీయులుకూడ అధ్యాపకులుగానుండిరి.

రవీంద్రుడు బడిలో పిల్లలకు మత బోధన చేయలేదు. మతమనగా కొన్ని నియమములను తెలుసుకొనుట కాదు; భగవంతుని సత్యస్వరూపమును భావించుట అని అతని అభిప్రాయము. భగవంతుని ఆరాధించువారితో కలసిమెలసి

యుండి, ప్రకృతిని, సృష్టిసౌందర్యమును గ్రహింపగలిగినప్పుడు దేవుని గురించి వారే తెలుసుకొందురని అతని అభిప్రాయము. ప్రతిదినము బడిలోని పిల్లలందరు ఉదయము, సాయంత్రము పావుగంట సేపు నిశ్శబ్దముగా, మౌనముగ, నుండవలెను. ఈ సమయములో దేనిని గురించి ఆలోచించవలయునో రవీంద్రుడు వారికి చెప్పలేదు. ఆ తరువాత వారిని 'దేనిని గురించి ఆలోచించినార'ని ఎప్పుడు అడుగను లేదు. మౌనముగా నుండుటయే వారి మనస్సునకు, ఆత్మకు శాంతిని చేకూర్చి జ్ఞానమును కలిగించునని అతని భావన. ప్రతిరోజు మౌనము పాటించిన తరువాత పిల్లలందరు ఒకచోటచేరి ప్రార్థన చేయుదురు. ఆ ప్రార్థన శ్లోకములు, రవీంద్రుడు రచించినవే. అతడు వారికి వాని అర్థమును చక్కగా చెప్పును. ఒక ప్రార్థన శ్లోకము ఈ భావములోనుండెను:

'నీవే మా తండ్రివి, అది గ్రహించు నేర్పు నిమ్ము;
ఓ తండ్రీ! పాపము తొలగించి మంచిని గ్రహించు శక్తి
నిమ్ము;
నీ వలననే మా ఆనందము, మా సుఖము;
నీకు నమస్కరింతుము, నీవే ఉత్తముడవు,
పరమాత్ముడవు.'

ఈ ప్రార్థనలో అన్ని మతములవారును చేరవచ్చును.

ఈ పాఠశాలలో పనిచేయుట రవీంద్రుని కెంతో ఉత్సాహముగానుండెను. కాని మొట్టమొదట, కొన్నేండ్లు, సంతోషముతోపాటు కొన్ని చిక్కులుకూడ లేకపోలేదు. ముఖ్యముగ, ఆర్థిక సంబంధమైన చిక్కులు. మొదట, రవీంద్రుడు పిల్లల దగ్గర జీతమేమి తీసుకొనలేదు. అందుచే బడినడుపుట

కష్టముగానుండెను. అతని భార్య నగలన్నియు నమ్మి అతనికి సహాయము చేసెను. కాని, ఇంతకన్నకూడ అధిక కష్టములు రవీంద్రుడు భరింపవలసి వచ్చెను. 1902 లో అతని భార్య జబ్బుపడి మరణించెను. ఆమె వియోగమును తలచుచు రవి వ్రాసిన 'స్మరణి' (Remembrance) అను పద్య సంపుటి అతని బాధను వ్యక్తము చేయును.

'ఆమె జీవించి యుండగా నాకిచ్చిన ప్రతి కానుక,
స్వామీ! నేను తిరిగి ఇవ్వగలిగితిని;
ఆ రోజులు తిరిగి రావు.
ఆమె రాత్రి నేడు ఉదయమైనది'

కొన్నాళ్ల తరువాత, అతని కూతురు రేణుక చాల జబ్బుపడెను. రవీంద్రుడు ఆమెను అల్మోరాకు తీసుకు వెళ్లెను. అక్కడ ఉన్నప్పుడే ఆ బాలిక వినోదముకొరకు Crescent Moon (బాలచంద్రుడు) రచించెను.

కాని, అతని ప్రేమ, శ్రద్ధ, ఫలించలేదు. రేణుకకు జబ్బు నయము కాలేదు. 1903 లో ఆమె మరణించెను. ఆ తరువాత, సంవత్సరమునకు రవీంద్రుని స్నేహితుడు సతీష్ చంద్ర రాయ్ చనిపోయెను. ఇతడు కవి. పాఠశాలలో రవీంద్రునికి చాల సహాయపడుచుండెను. రవీంద్రుడతనిని కొడుకువలె ప్రేమించెను. అతడు గొప్ప కవియగునని ఆశించి యుండెను.

ఆ తరువాత, 1905 లో మహర్షి దేవేంద్రనాధుడు పరమపదించెను. అప్పుడాతనికి ఎనుబదిఎనిమిది సంవత్సరములు. 1907 లో రవీంద్రుని చిన్నకొడుకు సమీంద్రనాథ్,

పదమూడేండ్లవాడు, చనిపోయెను. ఈ కష్టములన్ని రవీంద్రుని చాల కలతపెట్టెను. ఐనను, అతడు ధైర్యము వహించి తన కర్తవ్యమును నెరవేర్చుచునేయుండెను. దుఃఖములు వచ్చినను అతడు భగవంతునిలో, సత్యములో నమ్మకము కోల్పోలేదు.

## ఏడవ అధ్యాయము

# రాజకీయములు

శాంతినికేతనము స్థాపించుటకు పూర్వము కొన్ని సంవత్సరములనుండి రవీంద్రుడు దేశసేవ, ప్రజా సేవ చేయుటకు మార్గముల వెదకుచుండెను. ప్రజలు స్వదేశీ వస్తువులనే కొనవలెనని స్వదేశీ వ్యాపారము, పరిశ్రమలు అభివృద్ధిచెందవలెనని అతడు తలచెను. అతని అన్నకొడుకు లిద్దరు కుష్టియాలో జనపనార మిల్లును, చక్కెర మిల్లును పెట్టిరి. స్నేహితులు కొందరు కలకత్తాలో 'భండార్' అను దుకాణమును పెట్టిరి. రవీంద్రుడు ఈ స్వదేశ వ్యాపారములను ప్రోత్సహించి వానిలో భాగస్వామిగా చేరెను. కాని, దురదృష్టవశమున మిల్లులు కాని, దుకాణములు కాని లాభదాయకము కాలేదు. కొన్నాళ్ల తరువాత, అవి మూసివేయవలసివచ్చెను. ఇందుమూలమున రవీంద్రునికి చాల అప్పులయ్యెను. శాంతినికేతనము స్థాపించినప్పుడు ఆర్థిక సంబంధమైన చిక్కులధికముగా నుండుట కిదియే కారణము.

1899 లో కలకత్తాలో ప్లేగు వ్యాధి వ్యాపించినప్పుడు రవీంద్రుడు జనుల కొరకు చాల శ్రమపడెను. విరాళములు సేకరించి, సేవా మందిరములు ఏర్పాటుచేసి సహాయపడెను.

బెంగాల్‌లో వరదలు, కరువులు తరుచు వచ్చుచుండును. అవసరమైనప్పుడల్లా రవీంద్రుడు చాల సానుభూతితో బీద వారికి సహాయపడుచుండెను. అట్లే బీహార్‌లోను, క్వెట్టా లోను భూకంపము వచ్చినప్పుడుకూడ చాల సహాయపడెను. అతడు తన విజ్ఞానమును, అనుభవమును ఎల్లప్పుడు మానవ సేవకే వినియోగించుచుండెను.

1905 లో రవీంద్రుడు 'భండార్' అను క్రొత్త పత్రికను పెట్టెను. ఇందు రాజకీయముల గురించి, ఆర్థిక విషయముల గురించి చర్చించుచుండెను. ఇందు ఒక వ్యాసములో బ్రిటిష్ పరిపాలన వలన విదేశ వ్యాపారమును ప్రోత్సాహపరచుట తప్ప, హిందువుల కేమియు లాభములేదని తెల్పెను. అందుచే స్వదేశ సంస్థానాధిపతులు హిందూ పరిశ్రమలను, కళలను అభివృద్ధిపరుపవలెనని కూడ సూచించెను. రవీంద్రుని దేశభక్తి, నిశిత దృష్టి దీనివలన తెలియును.

1905 లోనే లార్డ్ కర్జన్ బెంగాల్‌ను తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్ అని రెండు భాగములుగా చేయ తలపెట్టెను. దీనివలన దేశములో అలజడి అధికమాయెను. వంగదేశమున ప్రజలు ప్రభుత్వముపై తిరుగుబాటు చేసిరి. ప్రజల అభీష్ట మును ప్రభుత్వము గుర్తింపలేదని నిందించిరి. దేశమంతట ప్రభుత్వ చర్యను ఖండించుచు సభలు జరిగెను. బెంగాల్ అవిభాజ్యమని, ఒకే బెంగాల్ కావలెనని, ఆందోళన జరిగెను. రవీంద్రుడు ఈ ఉద్యమమునకు నాయకుడయ్యెను. ఆతడు కలకత్తాలో అనేక సభలలో మాట్లాడెను. ఉద్రేకపూరిత మైన గీతములు వ్రాసెను. ప్రజలాతని మాటలను ఆవేశ ముతో వినుచుండిరి. పాటలను వ్రాసినవెంటనే నేర్చుకొని

గుంపులుగా కలసి పాడుచుండిరి. రవీంద్రుడే కలకత్తాలో తన క్రొత్త పాటను పాడుచు జనులందరితో వీధి వీధి తిరిగెను. ఆ పాటలో ప్రభుత్వమును 'ఈ బంధము విధికృతము; విడదీయుట ఎవ్వరి తరము!' అని హెచ్చరించెను.

ఒక సభలో, ఒక్కసారిగా రవీంద్రుడు ఏబదివేలు వసూలు చేసెను. దానితో బెంగాల్ విభాగమును ఎదుర్కొన సమకట్టెను. కాని, ప్రభుత్వముపై తిరుగుబాటు శాంతియుతముగా నుండవలెనని అతని అభిప్రాయము. సహాయ నిరాకరణము చేయవలెను. ప్రభుత్వముతో ఏ విషయమునందు ఏకీభవించక ఐక్యబెంగాల్ కొరకు ప్రత్యేకముగ కృషిచేయవలెను. సంఘమును బాగుచేసికొని న్యాయాచరణ, సౌభ్రాతృత్వము నెలకొల్పవలెను. అంతేకాని, వినాశకరములగు దుండగములు చేయకూడదు. ప్రభుత్వము విద్యార్థులు రాజకీయ సభలలో పాల్గొనకూడదని నిషేధించినప్పుడు రవీంద్రుడు దానిని చాల ప్రతిఘటించెను.

ఉద్రేక పూరితులైన బెంగాలీయువకులకు రవీంద్రుని శాంతి వాక్యములు నచ్చలేదు. సంఘ జీవనము నభివృద్ధి చేసికొని, ఆత్మగౌరవము, స్వశక్తి అభివృద్ధిపరచుకొనుటకు చాల కాలము పట్టును. అంతకంటె ప్రభుత్వోద్యోగులపై దారుణముగ దాడి చేయుట సులభముగను ఎక్కువ ఉద్రేకపూరితముగను తోచెను. ఆ విధముగనే త్వరలో స్వరాజ్యము సంపాదింపవచ్చునని వారి అభిప్రాయము. కాని, ఇట్టి హింసా విధానమువలన స్వరాజ్యము వచ్చినను లాభదాయకమగునా, పల్లె ప్రజలకు నిజముగ ఎక్కువ సౌకర్యములు కలుగునా, అని వారు ఆలోచించలేదు. క్రమక్రమముగ ఉద్యమము సంకుచిత

మార్గముల ననుసరించి తప్పుత్రోవల పోవుచుండెను. అందుకే రవీంద్రుడు రాజకీయములనుండి విరమించుకొని, తిరిగి, శాంతి నికేతనము చేరెను. ప్రజలాతని నర్థము చేసుకొనలేదు. విశ్వాస ఘాతకుడని, దేశద్రోహియని నిందించిరి. కాని, ఠాకూర్ లక్ష్యపెట్టలేదు. అతనికి ప్రజల ప్రశంసలతో నిమిత్తము లేదు. తాను సత్యమని భావించిన దానికొరకు ఏకాకిగా నిలబడగలవాడు. తన అభిప్రాయముల ననుసరించి సత్యము, న్యాయము ఐన మార్గములలో శాంతినికేతన మందును గ్రామములందును కృషి చేయుటయే ఉత్తమమని భావించెను

బెంగాల్ రాజకీయములలో హిందూ ముస్లిమ్ విచక్ష[ణ] కూడ అధికమగుచుండెను. హిందూ సంఘము, ముస్లిమ్ సంఘము అని రెండు కక్షలేర్పడెను. అదికూడ రవీంద్రుని చాల బాధకరముగా నుండెను. 1908 లో రవీంద్రుడు బెంగాల్ ప్రాంతీయ సభకు అధ్యక్షుడుగానుండి ఆ సభల[ో] మాట్లాడెను. అప్పుడు ఈ మత భేదముల వలన కలిగె[డు] అనర్థముల గురించి వివరముగా చెప్పెను. యువకులంద[రు] చిన్నచిన్న జట్లుగా పల్లెలకుపోయి సేవచేయవలెను. హిం[దు]వులు, ముస్లిమ్‌లుకూడ ఒకటిగానే వెళ్లి పల్లెటూళ్లలో హింద[ూ] ముస్లిమ్ ఐక్యత, స్నేహము అభివృద్ధి అగునట్లు చేయవలె[ను]. మతము ఏదైన, మానవులందరికి అవసరమైనది ఒక్కటే. విధముగ, అన్ని మతముల వారికి ఐక్యత యుండుటయే న్యా[య]మైనది. ఉత్తమమైనది. ఇది కేవలము రాజకీయముల కొ[రకు] మాత్రమే కాదు.

రవీంద్రుడు హిందువు కాబట్టి హిందువులకు ముస్లి[మ్‌ల] యెడ గల బాధ్యతలను గురించి ఎక్కువగా చెప్పెను. వ




రవీంద్ర రచన - వ్రాతప్రతి

ముల వలన హిందూదేశమునకు కలిగిన లాభములను గుర్తించు కొనవలెనని చెప్పెను. 'విదేశములనుండి వచ్చినప్పుడు మహమ్మదీయులు తమ విజ్ఞానమును, భావములను హిందూదేశమునకు తెచ్చిరి. ఇక్కడ సంగీతము, శిల్పము, చిత్రలేఖనము, సాహిత్యము మున్నగు వాటినన్నింటిని క్రొత్త విధానములతో పెంపొందించిరి. వారిలో గొప్ప తత్వవేత్తలు, మత ప్రవక్తలు కలరు. కాని, హిందువు లెప్పుడును వారిని విదేశీయులుగానే చూచుచుండిరి. మనము ఒకరి నొకరు గౌరవించుకొనలేదు; అర్థము చేసుకొనలేదు; ఒకరి కొకరు సహాయపడలేదు' అని అతడు చెప్పెను.

ఐతే, హిందూ ముస్లిము ఐక్యతకు పాటుపడినను వారిలో భేదములు లేవని చెప్పరాదు. గోడ పగిలినచో దానిమీద రంగు పూసిన మాత్రమున అది మరుగుపడదు. అందుచే హిందూ ముస్లిములలో గల భేదములు గుర్తించక తప్పదు. వాటిని గ్రహించినచో కలసి జీవించుట కష్టము కాదని రవీంద్రుని అభిప్రాయము. ఉద్రేక పూరితులు సత్యమును చూడజాలరు. రాజకీయములలో తన కిష్టమైన దానినే గ్రహించి అదియే పరిపూర్ణ సత్యమని తన్నుతాను మోసగించు కొనుట చాల సులభము. రవీంద్రుడు ఇటువంటిది ఎన్నడు చేయలేదు. ప్రతి విషయమును చక్కగా ఆలోచించి సంపూర్ణ సత్యమునే గ్రహించుచుండెను. ప్రసిద్ధ ఆంగ్ల కవి ఆర్నాల్డ్, గ్రీకు కవి సోఫోక్లిస్‌ను గురించి చెప్పిన వాక్యము రవీంద్రునికి కూడ అన్వయించును: 'అతడు జీవితమును సుస్థిర భావముతో చూచెను. సమగ్రముగ చూచెను.'

ఎనిమిదవ అధ్యాయము

# ప్రపంచ ఖ్యాతి

1908 నుండి రవీంద్రుడు కొన్ని ఉత్తమ గ్రంథములు రచించెను. బెంగాలీలో 'గీతాంజలి' అను పద్యములు రచించి తరువాత వానిని ఆంగ్లమున కనువదించెను. శాంతినికేతన విద్యార్థుల నిమిత్తము 'శరదోత్సవము' అను గేయ నాటిక రచించెను. 'ప్రాయశ్చిత్తము' అను గేయనాటికకూడ రచించెను. ఇందు ముఖ్యమైన పాత్ర ధనంజయుడు. ఇతడు శివ భక్తుడు, సాధువు, ప్రాచీన బెంగాలీ యోగులవలెనే సరళమైన భక్తిగేయములు పాడుచు ప్రచారము చేయును. ధనంజయుని పాత్ర అహింసను చాటును. అప్పటికి మహాత్ముని అహింసా బోధ ఇంకను ప్రచారములో లేదు. కాని, తరువాత మహాత్ముడు చెప్పిన అహింసా ధర్మములకును ధనంజయుని వాక్యములకును చాల సామ్యము కలదు. 1910 లో ఈ నాటకము శాంతినికేతనమున ప్రథమమున ప్రదర్శించినపుడు రవీంద్రుడే ధనంజయుని పాత్ర వహించెను. అతడు ఉద్దేశించినట్లు ఇటువంటి నాటకములను, అభిప్రాయములను ప్రత్యేక బోధన అవసరము లేకనే అవగాహన చేసుకొనుచుండిరి. రవీంద్రుడు ఈ సమయమందే My Reminiscences (నా జ్ఞాపకములు) అను గ్రంథమునుకూడ రచించి ఒక బెంగాలీ మాస పత్రికలో ప్రకటించెను.

1911 లో రవీంద్రుని ఏబదవ జన్మదినోత్సవము శాంతినికేతనమున చాల ఉత్సాహముతో జరిపిరి. ఉదయము పిల్లలందరు మందిరములో విశేష ప్రార్థనలు జరిపిరి.

సాయంత్రము 'రాజా' అను నాటిక ప్రదర్శించిరి. రవీంద్రుడే రాజుపాత్ర ధరించెను. ఆనాడు మందిరములో రవీంద్రుడు జన్మదినములగురించి చమత్కారముగా మాట్లాడెను. 'పుట్టి నప్పుడు బిడ్డ ఏడ్చును. వెచ్చని, సురక్షితమైన, మాతృ గర్భమునుండి చలితో, ఆపదలతో నిండియున్న ప్రపంచము లోనికి వచ్చుటకు బిడ్డ ఇష్టపడదు. కాని, ఆ కుటుంబము వారు మాత్రము సంతోషముతో బిడ్డ పుట్టినదని ఉత్సవము జరుపుదురు. అనగా, సంకుచితమైన తల్లి గర్భమునుండి విశాల ప్రపంచములోనికి బిడ్డ అడుగు పెట్టినదని సంతోషము. ఇక జీవితములో ఆపదలను, అద్భుతములను ఎదుర్కొని పెరిగి పెద్దయై మానవుడనిపించుకొనవలెను. జన్మదినము మన జీవిత యాత్రలో మొదటిదినము. అందుకే మనము ప్రతి సంవత్సరము ఆ రోజు ఉత్సవము చేసుకొందుము. ఇల్లు వదలి తొలిసారి పాఠశాలకు పోవునప్పుడు బాలుడు మరియొక క్రొత్త ప్రపంచములో అడుగుపెట్టుచున్నాడు. కావున, అది మరియొక జన్మదినము. ఇదేవిధముగ జీవితములో ప్రతిసారి ఒక క్రొత్త అనుభవమును పొందినప్పుడు ఒక నూతన ప్రపంచములో అడుగుపెట్టి క్రొత్త ఆపదలను సాహసములను ఎదుర్కొనుచున్నాము. వాటిని చూచి భయపడకూడదు. అవి లేకుండ మనకు ఆత్మవికాసము కలుగదు. నేను ఈ పాఠశాల ప్రారంభించుటకూడ నాకొక క్రొత్త జన్మదినము. ఆ రోజు నేనొక క్రొత్త ప్రపంచములో అడుగు పెట్టితిని. మనము మరణించినప్పుడు అదికూడ మనకొక జన్మదినము. తెలిసిన ఈ ప్రపంచమునుండి తెలియని మరియొక విశాల జీవితము లోనికి అడుగుపెట్టుచున్నాము' అనెను.

రవీంద్రుని ఏబదవ జన్మదినోత్సవము శాంతినికేతనము లోనేగాక బెంగాల్ అంతటా జరిగెను. ఈ సందర్భమును పురస్కరించుకొని వంగదేశీయులందరు ఠాకూర్ యెడ తమకు గల గౌరవమును ప్రేమాభిమానములను ప్రకటించిరి. కలకత్తాలో 1912 లో బెంగాలీ సాహిత్య సంఘమువారు కలకత్తాపట్టణ సభాభవనములో ఆతని గౌరవార్థము గొప్ప సభ జరిపిరి. రవీంద్రుని గురించిన జయ జయధ్వానములు వేలాదిజనుల ఏకకంఠముతో మిన్నుముట్టెను.

కొన్నాళ్లతరువాత మాఘోత్సవము జరిగెను. ఇది బ్రహ్మసమాజపు వార్షికోత్సవము. రవీంద్రు డీ ఉత్సవము నకు వెళ్లెను. అక్కడ ఒక క్రొత్త పాట పాడెను. అదియే నేటి మన జాతీయ గీతము.

'జనగణ మన అధినాయక జయహే
భారతభాగ్య విధాతా!...'

తరువాత, రెండునెలలు రవీంద్రుడు సాహిత్య వ్యాసంగములో గడపెను. అతడు ఐరోపాకు వెళ్లుటకు నిశ్చయించుకొనెను. కాని, ఈలోపల అధిక శ్రమవలన అతని ఆరోగ్యము చెడెను. అందువలన షిలైదా ప్రదేశమున కొన్నాళ్లు విశ్రాంతి తీసుకొనవలసి వచ్చెను. అక్కడ ఉన్నప్పుడే తాను బెంగాలీలో వ్రాసిన పద్యములు కొన్ని ఆంగ్లమున కనువదించెను. వానిని ప్రచురించవలెనను ఉద్దేశ్యము అప్పుడాతనికి లేదు. కేవలము ప్రొద్దుపుచ్చుటకొరకు వ్రాసినవి అవి. కాని, ఈ అనువాదములవలననే అతనికి ప్రపంచ ఖ్యాతి వచ్చెను. తరువాత యూరోప్ ప్రయాణములోకూడ అతడు తన పద్యముల ననువదించుచుండెను.

కొన్నాళ్లు విశ్రాంతి తీసికొనిన తరువాత ఆరోగ్యము చక్కబడగా, 1912 లో రవీంద్రుడు ఇంగ్లండుకు వెళ్లెను. లండన్‌లో అతనికి విలియమ్ రాతెన్‌స్టెయిన్ అను మిత్రుడుండెను. ఇతడు గొప్ప కళావేత్త. తను హిందూదేశమునకు వచ్చినప్పుడు 'జొరసాంకో' వెళ్లి రవీంద్రుని కలుసుకొనియుండెను. ఇంగ్లండులో రవీంద్రుడు, రాతెన్‌స్టెయిన్ తమ తమ రచనలగురించి, ప్రస్తావించుకొనుచుండగా, రాతెన్‌స్టెయిన్ 'మీ పద్యములేవైనా ఆంగ్లమున కనువదింపబడినవా?' అని అడిగెను. రవీంద్రుడు తాను అంతకు కొంచెము ముందే చేసిన అనువాదము చూపెను. అవియే 'గీతాంజలి' పద్యములు. రాతెన్‌స్టెయిన్ ఆ పద్యములు చదివి చాల ఆనందించి, నలుగురికీ వానినిగురించి తెలియవలెనని, అందరు వానిని చదువవలెనని ఉత్సాహపడెను. రవీంద్రుడు విశ్వకవి యని, అతని కవనమందలి ఉన్నతభావములు సర్వమానవసముదాయమునకు వర్తించునని అతనికి తోచెను. రాతెన్‌స్టెయిన్ రవీంద్రుని పద్యములు, మొదట ప్రసిద్ధ ఐరిష్ కవి డబ్ల్యు. బి. ఈట్సుకు చూపించెను. ఈట్సు రవీంద్రుడు గొప్ప కవి యని వెంటనే గ్రహించెను. తరువాత రాతెన్‌స్టెయిన్ కొందరు ఆంగ్ల కవులను తన ఇంటికాహ్వానించి సభ ఏర్పాటు చేసెను. ఈ సభలో రవీంద్రుని రచనల కొన్నిటి ఆంగ్ల అనువాదములు ఈట్సు చదివి వినిపించెను. చదువుట ముగిసినను సభికులు ఎవరును కదలలేదు. వారి నిశ్చేష్టత చూచి రవీంద్రుడు తన పద్యములు వారికి నచ్చలేదని నిరుత్సాహపడెను. కాని, అది అతని పద్యములు వారికి నచ్చక కాదని, అతని కవనము వారి హృదయములను తీవ్రముగ కదలించుటచేతనే, ఆశ్చర్య

ముతో ఆనందముతో వారు నోట మాటలేకయుండిరని తరువాత తెలిసికొనెను.

ఆనాడు అక్కడ సమావేశమైన వారిలో చాలమంది తరువాత రవీంద్రునికి ప్రాణస్నేహితులైరి. అందు ఒకరు ఎవ్రిమాన్స్ లైబ్రరీ సంపాదకుడు ఎర్నెస్ట్ రైస్, ఇంకొకరు ఛార్లెస్ ఫ్రీర్ ఆండ్రూస్. ఇతడు తరువాత ఢిల్లీలోని క్రీస్తు కళాశాలలో చాలకాలము పనిచేసెను. రవీంద్రుని పద్యములు వినినవెంటనే అతనితో స్నేహము చేయవలెనని చాల కుతూహలపడెను. సమావేశము ముగిసిన తరువాత రవీంద్రునితో కలిసి షికారు వెళ్లెను. దీనినిగురించి కొన్నేండ్లపిదప 1940 లో ఆండ్రూస్ మరణించినప్పుడు శాంతినికేతనమున, మందిరమున, మాటాడుచు రవీంద్రుడిట్లనెను:

'నేను సావకాశముగ హేమ్సుస్టెడ్ హీత్ మైదానము దాటిపోవుచుంటిని. వెన్నెల చక్కగా ప్రకాశించుచుండెను. ఆ వెన్నెల సౌందర్యములో యామినిస్నానము చేయుచున్నదా అనునట్లుండెను. వెనుకనుండి ఆండ్రూస్ వచ్చి నన్ను కలుసుకొనెను. ఆ నిశీథ నిశ్శబ్దములో అతని హృదయము 'గీతాంజలి' లోని భావములతో నిండియుండెను. భగవంతుని మీది ప్రేమతో అతడు నన్ను ప్రేమింపసాగెను. ఆ నిమిషమునుండి మా ఇద్దరి జీవితములు ఏక ప్రేమ ప్రవాహమున లీనమగునని అప్పుడు నేను ఊహించలేదు.'

నాటినుండి ఆండ్రూస్ రవీంద్రునికి పరమమిత్రుడయ్యెను. శాంతినికేతనములో చాలకాలము పనిచేసెను. స్వదేశమునకు తిరిగి వెళ్లిన తరువాత, ఇక్కడకు ఎప్పుడు వచ్చి

నను శాంతినికేతనమునందే ఉండెడువాడు. ఈ స్నేహము వారిరువురి జీవితములను పునీతము చేసెను.

1912 కు పూర్వము రవీంద్రునిగురించి ఇంగ్లండ్‌లో ఎవరికిని తెలియదు. విలియమ్ రాతెన్‌స్టైయిన్ ఇంటిలో సమావేశము జరిగిన తరువాత ఒక్కసారిగా రవీంద్రుని పేరు జగత్ప్రఖ్యాతమయ్యెను. అతని గౌరవార్థము ఎన్నో విందులు జరిగెను. చాలమంది రచయిత లతనిని కలుసుకొనిరి.

ఆంగ్లమున 'గీతాంజలి' ప్రచురితమైన వెంటనే రవీంద్రునికి ఇంకను ఆంగ్లేయు లనేకులు స్నేహమైరి. కాని, కొందరికి ఆతని రచన నచ్చలేదు.

కొందరికి అతని పద్యములు అర్థము కాలేదు. అనేకులు ప్రయత్నించి అర్థము చేసుకొని అతనిని మెచ్చుకొనిరి. రవీంద్రుడు ఏదో క్రొత్త సందేశమును, క్రొత్త సత్యమును తమ కందిచ్చెనని వారికి తోచెను. అతడొక కవియనియే గాక, భగవంతుని దూతగా పరిగణించిరి. 'గీతాంజలి'లోని పద్యములు మరలమరల సమగ్రముగ చదివి విన్నప్పుడే వాని సౌందర్యము మనకు గోచరించును. అందు కొన్నిటి భావమిట్లుండును:

'అతని ప్రశాంత పద ధ్వనులు, వినబడలేదా?
అతడు వచ్చును, వచ్చును, ఎల్లప్పుడు వచ్చును;
చైత్ర మాసపు వెచ్చని పరిమళయుత సమయములలో
అడవి త్రోవలలో
అతడు వచ్చును, ఎల్లప్పుడు వచ్చును;
ఆషాఢ మాసపు తొలకరి ముసురులో

దిగులు నిండిన రాత్రులలో
ఉఱుములతో మేఘ రథములో

అతడు వచ్చును, వచ్చును; ఎల్లప్పుడు వచ్చును;
దొంతరలై దొంతరలై పరతెంచు విషాద రేఖలలో
ఆతని అడుగులే నా హృదితాకును;
ఆతని స్వర్ణ పదముల మధుర
స్పర్శలోనే, నా ఆనందము ప్రకాశించును.'

* * * *

నీవే ఆకాశము, నీవే కోటరము
ఓ సౌందర్యమూర్తీ! రంగులతో, మధుర
ధ్వనులతో, పరిమళములతో
ఆత్మను కప్పు నీ ప్రేమకునివాసము,
ఆ కోటరమే,

ఆత్మ స్వేచ్ఛగా విహరించు ఆ అనంతాకాశములో,
స్వచ్ఛ ధవళ కాంతులు ప్రజ్వరిల్లును;
రాత్రి లేదు, పగలు లేదు, ఆకారము లేదు,
వర్ణములేదు; నిరంతర నిశ్శబ్దమే

* * * *

నా సోదరులందరికి నీవు సోదరుడవు.
కాని, వారిని నేను లక్ష్యపెట్టను.
నా ధనము వారితో పంచుకొనను.
ఆ విధముగ అంతయు నీతోనే పంచుకొందును

సుఖములో దుఃఖములో నేను వారి ననుసరింపను
ఆ విధముగ నిన్నే అనుసరింతును.

నా జీవితమును వీడుటకు సంకోచింతును.

ఆ విధముగ జీవితవాహినిలో మునుగకుండెదను.

1913 లో రవీంద్రుడు అమెరికా వెళ్లెను. అక్కడ చికాగో, హార్వార్డ్ మున్నగు విశ్వవిద్యాలయములలో ఉపన్యాసము లిచ్చెను. చిరకాలము అతనికి ప్రియముగా నుండిన విషయములను గురించియే మాట్లాడెను. హిందూదేశపు ప్రాచీన నాగరికత గురించి వివరించెను. శాంతినికేతన ఆదర్శము వేదకాలపు విద్యార్థి జీవితమందలి సరళతను, ప్రశాంతతను ఆధునిక జీవితములో అనుకరించుట గురించి చెప్పెను. జాతి విభేదము గురించి మాట్లాడెను. అమెరికాలో తెల్లవారు, నీగ్రోలు అనెడు భేదాభిప్రాయ మెక్కువ. హిందూదేశమునకూడ జాతివిభేద మెక్కువ. కనుక, ఈ సమస్య ఈ రెండు దేశములకు సమానము. అతి ముఖ్యమైనది. తన హార్వార్డ్ ఉపన్యాసములన్నిటిని కలిపి 'సాధన' అను పేరుతో రవీంద్రుడు తరువాత ప్రచురించెను. పద్యరూపమున అతడు వెలిబుచ్చిన భావములే ఇందు వచనమున కానగును. అమెరికానుండి ఇంగ్లాండు వెళ్లి, తరువాత, కొన్ని దినములకు రవీంద్రుడు హిందూదేశము చేరెను.

స్వదేశమునకు తిరిగి వచ్చినవెంటనే, రవీంద్రునికి నోబెల్ బహుమానము బహూకరింపబడినట్లు ప్రకటింపబడెను. ఇది ఒక స్వీడెన్ దేశ సంస్థవారు ఏటేట ఇచ్చు బహుమానము. విశ్వశాంతికి పాటుపడిన రచయితలలో, విజ్ఞాన వేత్తలలో మిన్నయగువారు ఇందు కర్హులు. ఇంతకు పూర్వము ఐరోపీయ జాతికి చెందినవారు తప్ప ఇతరులెవ్వరును ఈ బహుమతిని పొందియుండలేదు. ఆనాడు ఒక భారతీయునకు ఇట్టి

గౌరవము లభించుట ఎంతో గొప్ప. హిందూదేశమంత
ఉత్సవములు జరిగెను. రవీంద్రుడు చాల సంతోషించెను.

ద్వేషపూరితమైన విమర్శలను రవీంద్రుడు పాటింపన
తోచినను, లోలోపల చాల బాధపడుచుండెను. చా
నిరుత్సాహపడుచుండెను. అతడు ఒక పర్యాయము ఆండ్రూస్
ఛలోక్తిగా ఇట్లు వ్రాసెను:

'విమర్శకులు నన్ను గురించి యేమి వ్రాసినా నాకు లక్ష
ములేదు అన్నప్పుడు, నన్ను ఎవరును నమ్మవద్దు సుమా!' అ

ఈ నోబెల్ బహుమానపు ధనమునంతయును రవీ
ంద్రుడు శాంతినికేతనముకొరకు వినియోగించెను. కా
అతనిని ఇదివరకు తీవ్రముగ విమర్శించినవారందరు ఇప్పు
మెచ్చుకొని ఉత్సవములు జరుపుట అతనికి నచ్చలేదు. గౌ
వింప తగినవారు దేశములో చాలమంది కలరు. వారిని త
నట్లుగా ఎవరును అభిమానించుటలేదు. విదేశీయు లతని
ఈ విధముగ గౌరవించుట చూచి ఇదివరకు తన గ్రంథముల
చదువని భారతీయులుకూడ ఇప్పుడతనిని మెచ్చుకోసాగిరి
తన దేశీయులకు విచక్షణ, ఆత్మ గౌరవము లేనందుకు రవీ
ంద్రుడు సిగ్గుపడెను.

ఆ యేడే, కలకత్తా విశ్వవిద్యాలయము అతనికి గౌర
చిహ్నముగా సాహిత్యములో 'డాక్టర్' అను బిరుదము
నిచ్చెను. 1915 లో ప్రభుత్వము అతని రచనలను గుర్తించి
'సర్' అను బిరుదము నిచ్చెను. 'గీతాంజలి' వలన అతనికి
ప్రపంచ ఖ్యాతి కలిగెను. అన్ని దేశములవారును అతని
గ్రంథములు చదువసాగిరి.

## తొమ్మిదవ అధ్యాయము

# యుద్ధ ప్రభావము

### 1914—1919

**1912—13**లో రవీంద్రుని విదేశయాత్ర అన్ని విధముల ఫలవంతమైనది. క్రొత్తవారితో, అతని భావములను అర్థము చేసికొనగలిగినవారితో, స్నేహమయ్యెను. అతనికి యూరోప్ నందలి ఉత్తమ కళాభిజ్ఞులతో, పండితులతో, పరిచయ మయ్యెను. అచటి సామాన్యప్రజల ప్రేమాదరములు అతనిని ఆకర్షించెను. కాని, పాశ్చాత్య నాగరికత తప్పు మార్గములలో పోవుచున్నదని అతడు బాధపడెను. ప్రజలు, ప్రభుత్వము, ధనము, సౌఖ్యము, ప్రాణ రక్షణము—వీనికే ఎక్కువ ప్రాధాన్య మిచ్చుచుండిరి. న్యాయ సత్యములకు విలువ లేకుండెను. యూరోప్‌లో అన్ని దేశములలోను భయము, సందేహము ఎక్కువగా నుండెను. ప్రతి దేశము దేశ రక్షణకై గొప్ప సైన్యమును, నౌకా బలమును సమకూర్చుకొను చుండెను. పరస్పర అవిశ్వాసము, అసూయ, హింస అన్ని చోట్ల వ్యాపించి యుండెను. పాశ్చాత్య నాగరికత ఈ విధముగ హీనదశకు వచ్చుచున్నదని రవీంద్రుడు భావించెను. త్వరలోనే మహానర్థము కలుగుననికూడ అతడు అనుకొనెను.

రవీంద్రుడు అన్ని జాతులవారు స్నేహమువలనను పరస్పర సహకారము వలనను సౌఖ్యమును, నిజమైన ధన సంపత్తిని పొందగలరని ఊహించెను. అతడు శాంతినికేతన విద్యార్థులకు చరిత్రయనగ కేవలము పేర్లు, తారీఖులు మాత్రమే

కాదనియును, అది మానవుని జాతి జీవిత కథయని తెల్పెను. ఆ కథ చాల అర్థవంతమైనది. ఆదినుండి మానవులు ఎట్లు చిన్ని కుటుంబములగ, సమూహములగ, చివరకు జాతులుగ, పెంపొంది, సహకారముతో అభివృద్ధికి వచ్చిరో చరిత్రవలన మనకు తెలియును. హిందూదేశ చరిత్ర విదేశీయుల దండయాత్రలతో కూడినది. కాని ప్రతిసారి ఇక్కడికి వచ్చిన విదేశీయులందరుకూడ ఇక్కడనే స్థిర నివాస మేర్పరచుకొని హిందూదేశ ప్రజలతో గలసి శాంతియుతమైన జీవనము గడపుచుండిరి. అన్ని జాతులవారు ఏక మానవ కుటుంబముగా నేర్పడి శాంతముగా ఎట్లు జీవింపగలరో దీనివలన తెలియును. ఒక్కొక్క జాతికి ఒక విలక్షణత ఉండును. ఈ వేర్వేరు గుణములు ప్రపంచ శాంతికి, సంపదకు సహాయకరములు కాని, యుద్ధము చేయుటకు కాదు. అన్ని జాతులవారు సమష్టి కుటుంబమువలె నేర్పడి తమ ప్రత్యేక ప్రతిభను సర్వమానవ కల్యాణమునకు వినియోగింపవలెను.

ఈ ఉత్తమ విధానమును ప్రజలు గ్రహించుటెట్లు? ఈ విషయమున హిందూదేశమే తక్కినవారికి మార్గదర్శకమై శాంతి మార్గమును చూపవలెను. కొన్ని వందల సంవత్సరములుగ అనేక జాతులవారు, మతములవారు, భాషలవారు కలసి ఐక్యతతో శాంతముగ ఇచట జీవించుచున్నారు. ప్రాచ్య దేశములవారికి, పాశ్చాత్యులకుకూడ హిందువులు సమముగనే స్వాగతమిచ్చిరి. భారత భూమి అన్నిజాతుల నాగరికతా ప్రవాహములకు సంగమస్థానము. కాబట్టి, సర్వమానవ బృందమునకు కావలసిన శాంతి సహకారములకు మార్గము ఇక్కడే తెలిసికొనవలెను.

అంతర్జాతీయ సఖ్యమును పెంపొందించుటలో శాంతి నికేతనము తగిన స్థానమును పొందవలెనని రవి ఆశించెను. 1913 లో అతడు ఆండ్రూస్‌నకిట్లు వ్రాసెను: 'మన విద్యార్థులకు విశాలమైన దృక్పథము, విశ్వమానవ సౌభ్రాతృత్వము అలవడ వలెను' అని.

1914 లో ఆండ్రూస్, పియర్సన్ అను మరియొక మిత్రునితో ఆశ్రమమును చేరెను. వీరి రాక గురించి రవీంద్రుడు చాల సంతోషించెను. శాంతినికేతనము నిజముగ అంతర్జాతీయ సంస్థ కాజొచ్చెను. 1915 లో, దక్షిణ ఆఫ్రికాలో ఉన్న భారతీయులతో గూడ సంపర్క మేర్పడెను. అక్కడ గాంధీ స్థాపించిన ఫాయినెక్సు పాఠశాలలోని బాలురు శాంతినికేతన మునకు వచ్చి కొన్నాళ్లుండిరి. శాంతినికేతన విద్యార్థులు వారికి గొప్ప స్వాగతమిచ్చిరి. గాంధీకూడ, అప్పుడు అక్కడ రవీంద్రునితో కలసియుండెను. ఇదే వారి తొలి సమావేశము. ఈ విధముగ శాంతినికేతనమునకు క్రమక్రమముగ అన్ని దేశ ములతోను ఉద్యమములతోను సంబంధ మేర్పడుచుండెను.

1914 లో, రవీంద్రుడు ఊహించినట్లే, యూరోప్‌లో యుద్ధము ప్రారంభమయ్యెను. నాలుగు సంవత్సరములు అనంతమైన జన నష్టమును సర్వనాశనము జరిగెను. ఈ విషాద ఘటనవలన రవీంద్రుడు చాల చలించెను. అతనికి మానవత్వములో, స్వేచ్ఛలోకూడ నమ్మకము సడలెను. కాని, అతడు ధైర్యము వహించి తన భావముల ననుసరించి స్థిరముగా నుండెను. ఇతరులకు మంచిని బోధించుటకన్న మన జీవిత మును ఋజుమార్గమున నడుపుకొనుట ముఖ్యమని యతడు నమ్మెను. 'నేను ఆంతరంగికముగ వెలుగును పొందవలెనని

కోరుచున్నాను. ఊరికే, చేతిలో దీపము పట్టుకొనవలెనని కాదు' అని అతడనెను. అతడు తన పాఠశాలలోకూడ అందరును తన అభిప్రాయములనే అనుసరింపవలెనని కోర లేదు. వారి ఇష్టానుసారముండుటకు తగిన స్వేచ్ఛ నిచ్చెను. 'ఎవరిని ఏ విషయమునందు నిర్బంధించుట నా కిష్టములేదు. ఉత్తమ భావములు స్వేచ్ఛచేత, మనః పరిపక్వముచేత కలుగ వలెనేగాని, నిర్బంధముచేత కాదు. నాతో పనిచేయువారు బానిసలుగ మనుటకంటె స్వేచ్ఛాజీవులుగ మరణించుట నా కిష్టము' అని అతడు చెప్పెను.

యుద్ధము ప్రారంభమైన తొలిదినములలో రవీంద్రుడు 'బాలకా' అను పద్యకావ్యమును రచించెను. ఇందు చాల పద్యములు యుద్ధమునందలి విషాద సంఘటనలచే ప్రేరేపింప బడినవి. విజ్ఞాన శాస్త్రము విశదీకరించిన జీవిత రహస్యములకు సంబంధించినవి కొన్ని. యుద్ధ సమయములో మనము తరుచు భగవంతుని 'తీర్పును' గురించి చర్చింతుము. తప్పు చేసిన కొన్ని జాతులను భగవంతుడు యుద్ధముద్వారా శిక్షించునని కొందరి భావన. 'క్షమ' యనగ ప్రేమ, దయ, మృదుత్వము, సౌందర్యము మున్నగు సుందర భావములతో కూడినదని చాల మంది అభిప్రాయము. 'తీర్పు' అను పద్యములో రవీంద్రుడు ఈ భావములను ఆక్షేపించి వాని అంతరార్థము వివరించెను.

> 'పుష్పించు అడవులలో, పిల్లగాలుల సువాసనలలో
> పచ్చిక బయళ్లలో,
> ఝుమ్మను భ్రమరములలో వసంత గానము చేయు
> పక్షులలో,
> అలలు తాకిన తీరములో

గాలికి కదలు రెల్లుపూల వీవనలలో
నీ ధర్మాసనము దాగియుండును.

*　　　*　　　*

నిద్ర లేని కన్నులలో, మాటలేని ప్రేమ బాధలో
మిత్రులు కదపిన హృదయ రక్త పాతములో
ఎడతెగని ప్రేమ జాగరణములో
ప్రేమమయా! నీ ధర్మాసనము దాగియుండును.

*　　　*　　　*

ఓ భయంకర మూర్తీ!
ప్రళయ ప్రచండ ఝంఝా మారుతములో
పిడుగు మంటలలో
సంధ్యారుణ జ్వాలల సర్వనాశములో
అంధకారపు టాకస్మిక భయంకర ధ్వానములో
నీ క్షమ దాగియుండును.'

రవీంద్రుని మనసు గంభీర విషయములందే యుండలేదు. మానవులు యుద్ధములు చేయుదురు; మరణింతురు. కాని, ప్రకృతి శోభ మాత్రము తగ్గదు. ఎండకాయును, వర్షము కురియును. గాలి వీచును. ప్రతి వసంతము ఆకులు చిగిర్చి పూవులు పూయును. ప్రపంచమంతా పరిమళమయమగును. ఈ అభిప్రాయములను విస్తరించి, ఋతు శోభను వర్ణించు 'ఫాల్గుని' అను నాటకము 1915 లో రచించెను. ఈ నాటకము తొలుత శాంతినికేతనమున ప్రదర్శించిరి.

'ఫాల్గుని' గేయనాటిక. ఊరికే చదివినప్పుడుగూడ నదీ జలముల గలగల ధ్వనులవలె ఇంపుగా నుండును. ఇక సంగీ

తము, నాట్యము, రంగురంగు దుస్తులతో ప్రదర్శించినప్పుడు చూడ మనోహరముగా నుండును. నాటక ఉపోద్ఘాతమున, రాజు తలలోని రెండు పలితకేశములను జూచి తనకు వృద్ధాప్యము వచ్చినదని బాధపడును. మరణమును గురించి ఆలోచించును. రాజ పురోహితుని ఉపదేశమును విని, విరక్తుడై రాజకార్యములను మానును. అప్పుడతనివద్ద కొక కవి వచ్చును. తానొక క్రొత్త నాటకము వ్రాయుదునని చెప్పును. ఆ నాటకమున కేమియు అర్థములేదు. కేవలము పాటలు మాత్రమే.

జీవితానందము వెలిబుచ్చుట తప్ప నాటకమున ప్రత్యేక సందేశమేమియును లేదు. కథావస్తువు ప్రపంచ నాటకము నుండి గ్రహింపబడినది. శీతకాలపు ముసుగు తొలగిపోవుట గురించి నాటకము.

ఉపోద్ఘాతము తరువాత అసలు నాటకము ప్రారంభమగును. గుహలో దాగిన ముసలివానిని పట్టుకొనవలెనని చాలమంది బాలురు ఉత్సాహపూరితులై ప్రతిన పట్టుదురు. తరువాత 'దాదా' అను ఒక పాత్ర కవిత్వమందు విస్పష్టమైన అర్థము, నీతి, తప్పక ఉండవలెనని ఉపదేశించును. ఈ పాత్రద్వారా రవీంద్రుడు పురాతన భావములను కొన్నిటిని చాల పరిహసించును. తరువాత వచ్చెడి అంధగాయకుడు తన 'శరీరముతో, మనస్సుతో, ఆత్మతో' సర్వమును చూడ గల్గును. ఈతడు చాల చక్కని పాటలు పాడును.

పుష్పదేవతలు, దక్షిణ పవనము, వసంతము, యవ్వనము, సౌందర్యము మున్నగు పాత్రలు ఎందరో నాటకమున గలరు. మనుష్య పాత్రలు రంగస్థలమును విడచినవెంటనే ఉత్సాహ

పూరితమైన పాటలు పాడుచు నాట్యము చేయుచు వనదేవతలు ప్రవేశింతురు. ముసలివానిని పరిహాసమాడుచు వెంటదగిలి అతని తల గుడ్డ తొలగింతురు. ఈతడే శీతకాలము. ముసుగు తొలిగిన వెంటనే వసంతముగా మారిపోవును. ఈ నాటకమును చూచి ముఖ్యముగా బాలబాలికలు ఎక్కువగా ఆనందింతురు. తొలి ప్రదర్శనలో రవీంద్రుడే అంధగాయకుని పాత్ర వహించెను. తక్కిన పాత్రల నన్నింటిని శాంతనికేతన విద్యార్థులు మిక్కిలి ఉత్సాహముతో నటించిరి. మిక్కిలి పసివారు పుష్ప దేవతలుగా నటించిరి.

1916 లో 'బంకూరా' క్షామ నివారణకై ధనము వసూలు చేయుటకు ఈ నాటకము తిరిగి కలకత్తాలో ప్రదర్శించిరి. ఆ నాటకమును చూచినవారు రవీంద్రుని నటనను, పాటలను, వనదేవతల పాటలను ఎప్పటికిని మరువలేకుండిరి.

'ఈ నాటకము అడవుల సౌందర్యమును పట్టణమునకు తెచ్చినది. వృక్షములు, పూవులు, దక్షిణ పవనము పాడగలిగినచో ఇటులనే పాడును' అని ఒక విమర్శకుడనెను.

1916 లో రవీంద్రుడు అమెరికాకు, తరువాత జపాన్‌కు వెళ్లెను. జపాన్ ప్రభుత్వమువారు అతనిని చాల ఆదరించిరి. అతని గౌరవార్థము ఎన్నో సభలు జరిగెను. జపానీయులు సౌందర్యోపాసకులు. రవీంద్రునికి ఇక్కడ చాలమందితో స్నేహమయ్యెను. వారి సౌందర్యారాధనయే వారి ధీరత్వమునకు కారణమని, అది భారతీయులుకూడ నేర్చుకొనవలెనని రవీంద్రుడు భావించెను. 'ఈ సౌందర్యారాధనమే జపాను వారి స్థైర్యమునకు, విరక్తికి కారణము. సౌందర్యము, ఆనందము

వలననే నిజమైన విరక్తి కలుగును. భారతదేశమున మనకు కావలసినది పరిపూర్ణమైన జీవితము కాని, వైరాగ్యము కాదు' అని అతడు వ్రాసెను.

జపాన్ ప్రజల ఆనందమును సాహసమును మెచ్చినను, రవీంద్రునికి వారి ప్రభుత్వ విధానము నచ్చలేదు. అప్పటికే వారికి చీనా యెడల అసూయభావము, ద్వేషము ప్రబలి యుండెను. వారు కయ్యములను, కుస్తీలను పోటీలను ప్రోత్స హించు పద్ధతిగూడ అతనికి నచ్చలేదు. ఒక పర్యాయము ఇద్దరు యువకులు ఏదో విషయముపై తగవులాడుకొని, ఒక దిన మంతయు పోరాడిరి. చివరకు దెబ్బలు తగిలి ఇరువురును మరణించిరి. వారు పోరాడిన స్థలమును జపాన్‌వారు పవిత్ర స్థలముగ భావించి, వారి జ్ఞాపకార్థ మచట నొక శిలాస్థంభ మును నాటిరి. దానిపై చెక్కుటకు ఠాకూర్‌ను కొన్ని పద్యములు వ్రాయుమనిరి. రవీంద్రుడు ఈ విషాద సంఘటన గురించి చాల చింతించెను. కాని, వారి పోరాటమును మాత్రము మెచ్చుకొనలేదు. అది ఉత్తమ ప్రయోజనమునకై భగవంతుడిచ్చిన జీవితమును నాశనము చేసికొనుటయే అని అతడు భావించెను. అప్పుడు అతడు వ్రాసిన పద్యము లివి:

'వారు ద్వేషించి, ఒకరి నొకరు చంపుకొనిరి,
జనులది పొగడిరి;
కాని, భగవంతుడు ఈ అవమానము జ్ఞప్తికి రాకుండా,
ఆ స్థలమును పచ్చని గరిక చిగుళ్లతో కప్పివేసెను.'

టోకియో విశ్వవిద్యాలయములో అతడు ఎన్నో ఉపన్యా సము లిచ్చెను. 'జాతీయత'ను గురించియే ఎక్కువగ మాట లాడెను. కాని, జాతీయ అహంభావమును దేశదేశముల

మధ్య ద్వేషమును అతడు నిరసించెను. ఆధునిక జీవనములోని మూడు అనర్థములను గురించి అతడిట్లు చెప్పెను:

'ఒకటి, సామాన్య మానవుని శుభమును లక్ష్యపెట్టక ప్రభుత్వము కేవలము యంత్రమువలె పని చేయుట; రెండవది, స్వదేశ క్షేమలాభములనే చూచుకొని ఇతర దేశములను ద్వేషించి అణగద్రొక్క ప్రయత్నించుట'. ఈ సందర్భములో చీనా యెడల జపాను చర్యలను అతడు తీవ్రముగ నిరసించెను. కొన్నాళ్ల తరువాత అతడీ విషయమునే మన దేశములోగూడ చెప్పెను. 'నన్ను మీరు నిందింపవద్దు. నా దేశముకన్న భగవంతుడే గొప్ప యని నా భావము.' ఇక మూడవది సంఘ వ్యత్యాసము. సామాన్య మానవుని హక్కులను పాటింపక పోవుట. పనివారందరు తగిన వేతనములు, కావలసిన వసతులు లేక, గంటల తరబడి పనిచేయుట జపాన్‌లో పరిపాటై యుండెను.

రవీంద్రుడు జపాన్ వారికి స్నేహితునివలె హితబోధ చేసెను. కాని, అది వారికి నచ్చలేదు. ప్రభుత్వము, ప్రజలు అతని యెడల విముఖులైరి. ఇది అతనిని కొంత కలతపెట్టెను.

ఆ తరువాత, యుద్ధము ముగియువరకు అతడు స్వదేశమున ఉండెను. పాఠశాలలో మాతృభాషలోనే చదువు చెప్పవలెనని అతడు ఇంకను ఆందోళన చేయుచుండెను. ఆ రోజులలోనే 'చిలుక చదువు' అను వ్యంగ్య రచన రచించెను. స్వేచ్ఛగా పాడుకొనుచు తిరుగు చిలుకకు బలవంతముగా చదువు చెప్పుదురు. బంగారు పంజరములో బంధించి, రెక్కలు విరిచి కాళ్లకు సంకెళ్లు వేసి పాఠ్యగ్రంథములు కుప్పలు కుప్ప

లుగా చిలుకముందు పడవైచెదరు. చివరకు చిలుక చనిపోవును. చిలుకను తాకినపుడల్లా కాగితపు ధ్వనులే వినబడును. అప్పు డందరు 'చిలుక చదువు సమగ్రమైన'దని సంతసింతురు.

వ్యావహారిక భాషలో వ్రాయువారందరికి రవీంద్రుడు తోడ్పడుచుండెను. కలకత్తాలో అతని ఇంటికి అనేకమంది రచయితలు వచ్చుచుండిరి. రాజకీయములలోగూడ అతడు తిరిగి పాల్గొనసాగెను. కాంగ్రెస్ సంస్థను చేరి, తన చకచని పాటలతో జనానీకమునకు ప్రబోధము కలిగించుచుండెను.

1918 లో రవీంద్రుని పెద్ద కూతురు మరణించెను. అతడును, అనుచరులును ఈ దుఃఖములో మునిగి ఉన్నను శాంతినికేతన కార్యక్రమము చక్కగ సాగిపోవుచునే యుండెను. రోజులు గడచుకొద్ది రవీంద్రుడు ప్రపంచ శాంతి స్థాపనకు భారతదేశ మెట్లు తోడ్పడగలదో యోచించు చుండెను. అతడు ప్రపంచ విశ్వవిద్యాలయమును స్థాపించ వలెనని సంకల్పించి విశ్వభారతిని నెలకొల్పెను. ఆ పని ప్రారంభమగుటకు పూర్వ మీ దేశములో ఒక దుర్ఘటన జరిగెను.

1919, ఏప్రిల్ 13-వ తేదీనాడు జల్లియన్‌వాలా బాగ్‌లో సమావేశమైన నిస్సహాయ ప్రజానీకమును జనరల్ డయ్యర్ తుపాకులతో కాల్పించెను. కొన్నివందలమంది గాయపడి మరణించిరి. పంజాబ్‌లో 'మార్షల్ లా' ప్రవేశపెట్టబడెను. వార్తలు విరివిగా ప్రకటింపబడకున్నను శీఘ్రముగనే ఈ విష యము రవీంద్రుని చెవి సోకెను. అతడు ప్రభుత్వ చర్యను తీవ్రముగ గర్హించెను. వెంటనే కలకత్తా వెళ్లి, అచ్చటి రాజ కీయ నాయకులను ఆ కాల్పులను నిరసించుచు సభ జరుప

మనెను. తానా సభలో మాట్లాడుదునని కూడ చెప్పెను. కాని, అచ్చటి నాయకు లాతని మాట పెడచెవిని పెట్టిరి. ఆవేశముతో, రవీంద్రు డొక్కడే ప్రభుత్వమును ధిక్కరించు టకు పూనుకొనెను. తన దేశీయులందరిని నిర్దాక్షిణ్యముగ చంపిన ప్రభుత్వము తన కిచ్చియుండిన సర్ బిరుదు తన కక్కర లేదని, ప్రత్యేక గౌరవ చిహ్నము లేకుండగనే తాను తన ప్రజల పక్షమున నిలబడుదునని చెప్పి రవి తిరిగి సర్ బిరుదును వాడలేదు. వైస్రాయికి జాబు వ్రాసి తన 'సర్' కితాబును త్రిప్పి పంపించెను.

జల్లియన్‌వాలా బాగ్ దురంతమును రవీంద్రుడు రాజకీయ దృష్టితోనేగాక మానవ దృష్టితో నిరసించెను. ఇటువంటి ఘోరములు మానవజాతి కంతకును కళంకము. సమస్త జాతుల మధ్య సహకారముండవలెను అని అతని భావము. కాని, ఇట్టి ఘాతక చర్యలు స్నేహమున కాటంకములు. అందుకే వానిని అతడంత తీవ్రముగ నిరసించెను.

## పదవ అధ్యాయము

# విశ్వభారతి

శాంతినికేతనములో రవీంద్రుడు స్థాపించిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయమునకు 'విశ్వభారతి' అని పేరు. విశ్వవిద్యా లయము అనుటలోనే అది ప్రపంచ విజ్ఞానమును, సంస్కృతిని బోధించునదని తెలియును. ఇక విశ్వభారతి అనగా ప్రపంచ సంస్కృతిని భారత సంస్కృతిని సమ్మిళితము చేయునది. 'యత్ర

విశ్వంభవతి ఏక నిడమ్' అనగా 'ఎక్కడైతే సమస్త ప్రపంచము ఒక్కచోట కలుసుకొనునో' అనునది ఆ సంస్థ ఆదర్శము.

'విశ్వభారతి' స్థాపించుటకు గల కారణములను రవీంద్రుడే విశదీకరించెను. 'శాంతినికేతనము' సుస్థిరమై చక్కగా సాగుచున్నప్పు డాతనికి అంతకంటె విశాలమైన దృక్పథముతో అంతర్జాతీయముగ నుండి అన్ని సంస్కృతులను మేళవించు విద్యాసంస్థను స్థాపింపవలెనని తోచెను. క్రమక్రమముగ ఆ భావము రూపు దాల్చెను.

ప్రాచీన నలందా విశ్వవిద్యాలయమును గురించి అతడు చాల చదివియుండెను. హిందూ సంస్కృతిని, విజ్ఞానమును చక్కగా ప్రతిబింబించు అటువంటి జాతీయ విశ్వవిద్యాలయ మును మరల స్థాపించుట అవసరమని అతడు తలచెను. భారత దేశములో అంతవరకు ఉన్న విశ్వవిద్యాలయములన్నియు పాశ్చాత్య పద్ధతుల ననుసరించినవే. అక్కడ భారత విజ్ఞాన సంపద చక్కగా ప్రతిబింబించుట లేదు. రవీంద్రుడు క్రమ ముగ తన విశ్వవిద్యాలయమునందు ఒక్క భారత సంస్కృతియే గాక ప్రాచ్య దేశముల విజ్ఞానము, సంస్కృతి అంతయును ప్రతిపాదింపవలెనని తలచెను. 'ప్రాచ్య సంస్కృతుల నన్నిటిని ఏకీభవించు విద్యాసంస్థను స్థాపింపవలెనని నేననుకొంటిని' అని అతడు చెప్పెను. ముఖ్యముగా, భారతనాగరికత, దూర ప్రాచ్యముల సంస్కృతి, ఇస్లాము నాగరికతలే అతనిని ఆకర్షించెను.

విశ్వమానవ సౌభ్రాతృత్వమును నెలకొల్పుటలో శాంతి నికేతనము సహాయపడుచుండెను. అతని మిత్రులు ఆండ్రూస్, పియర్‌సన్ కూడ అందుకు చాల తోడ్పడిరి.

1920 లో రవీంద్రుడు తిరిగి యూరప్ వెళ్లెను. అప్పుడు చాల దేశములు తిరిగెను. ప్రతిచోట అతనికి ఘనమైన స్వాగత మిచ్చిరి. ఈ అఖండ స్వాగతమువలన అతడు తన బాధ్యత అధికమైనదని భావించెను. రాజకీయములతోను, జాతిమతముల తోను సంబంధము లేకుండ ప్రాచ్య పాశ్చాత్య దేశములు ఏకమగుటకు తాను కృషిచేయవలెనని తలచెను. శాంతి నికేతనములో అన్ని దేశములవారికి ప్రవేశము కలదు.

రవీంద్రుని ఆదర్శముల ననుసరించి విశ్వభారతిలో ముఖ్య ముగ మూడు విషయములు పాటింపబడుచుండెను. ఒకటి, పూర్తిగా హిందూదేశమునకు సంబంధించినది. భారతీయ నాగరికతా సంప్రదాయములను, సాహిత్య సంగీతములను, ఇతర కళలను పిల్లలు చక్కగా నేర్చుకొనవలెనని అతని ఉద్దేశ్యము. కాని, అతని భావము లెప్పుడును సంకుచితమైనవి కావు. తాను వంగదేశీయుడైనను వంగదేశ సంస్కృతిని మాత్రమే గౌరవించ లేదు. హిందూదేశమునందలి అన్ని ప్రాంతముల భాషలను సంప్రదాయములను, విజ్ఞానమును సమానముగ గౌరవించెను. విశ్వభారతిలో భారతదేశములోని అన్ని ప్రాంతములనుండి విద్యార్థులు వచ్చి చేరుదురు. వారందరు ఒకేచోట ఉండి, కలసియే భోజనము చేయుదురు. ఒక ప్రాంతపు వారి వంట మరియొకరు రుచి చూచుచుందురు. ఇక పాఠశాలలలో తిరువాన్కూరు ప్రాంత కథకళితోపాటు అస్సాము దేశ మణిపూరి నాట్యము కూడ నేర్పుదురు. రవీంద్రుని ఆధునిక బెంగాలీ సంగీతముతోపాటు, ఇతర శాస్త్రీయ సంగీతరీతులను గూడ నేర్చుకొనుచుండిరి. కళాకేంద్రములో అన్ని ప్రాంత ముల చిత్రములు, కుట్టుపనులు, మున్నగునవి ఉండును.

వీనికి సంబంధించిన విశేషములు అన్నియును ఆశ్రమములో ప్రదర్శింపబడును. విద్యార్థులు సంస్కృతము, హిందీ, పర్షియన్, మున్నగు భాషలనేర్చి ప్రాచీన హిందూ సంస్కృతిని గురించి పరిశోధనలు చేయుదురు. వారు తెలిసికొన్న క్రొత్త విషయములను గురించి అప్పుడప్పుడు ప్రసంగింతురు. విశ్వ భారతిని చూడవచ్చిన అతిథులు కూడ ఊరకేపోవుటకు వీలు లేదు. వారి సంస్కృతిని పిల్లలతో పంచుకొనవలెను. వారి కవిత్వమును చదివి వినిపింపవలెను. తమ ప్రాంతీయాచార ముల గూర్చి చెప్పవలెను. గాయకులైనచో పాడవలెను. ఈ విధముగ 'విశ్వభారతి'లో అన్ని ప్రాంతముల సంస్కృతి మేళవించుటకు అవకాశముండెను.

ఇక రెండవది, ఆసియా ఖండమంతటికి సంబంధించినది. పర్షియా, సిలోన్, బర్మా, మలయా, టిబెట్, ఇండియా అన్ని ఒకే భూఖండమునకు చెందినవి. కొన్ని శతాబ్దములుగ ఈ దేశముల మధ్య రాకపోకలు గలవు. యాత్రికులు, మత బోధకులు వచ్చుచు పోవుచు నుందురు. చీనా, భారతదేశముల సంస్కృతి అతి ప్రాచీనమైనవి. గౌతమ బుద్ధుని ఉపదేశములు హిందూదేశములో ప్రారంభమై ఆసియా ఖండమంతయును వ్యాపించినవి. కావున, వివిధదేశముల మధ్య ఎక్కువ సన్నిహితత్వము కలదు. భారతీయులు పాశ్చాత్యులతో కంటె, వీరితో చక్కగా కలిసిపోగలరు.

కాబట్టి ఈ దేశముల విజ్ఞానమును కూడ రవీంద్రుడు విశ్వభారతిలో నెలకొల్పదలచెను. అతడు స్థాపించిన చీనా భవనము చాల అభివృద్ధిపొందినది. ఇక్కడ చీనా, టిబెట్ సంస్కృతీ, సాహిత్యముల నేర్పుదురు. 1921 లో సిల్వేన్ లెవి

అను గొప్ప ఫ్రెంచి ప్రాచ్య భాషా పండితుడు చీనా, టిబెట్ నాగరికతను బోధించుటలో రవీంద్రునికి సహాయపడెను. రెండు మూడేళ్ల తరువాత రవీంద్రుడే చీనా వెళ్లెను. అక్కడ చాలమందితో అతనికి స్నేహమయ్యెను. చీనా సంస్కృతిపై అతనికి అభిమానము మెండు. విశ్వభారతిలో చీనా భవనములో నేడు అనేక చీనా, టిబెటన్ గ్రంథములు కలవు. చాలమంది చీనా, టిబెట్ భారతీయ పండితులు దాని అభివృద్ధికి పాటు పడిరి. ప్రతి సంవత్సరము చాలమంది విద్యార్థులు చీనానుండి ఇక్కడ చదువుటకు వత్తురు.

కళాకేంద్ర ప్రదర్శనశాలలో జపాన్, చీనా, మలయా, థాయ్‌లాండ్, జావా, సుమత్రా మున్నగు దేశములకు చెందిన అందమైన వస్తువు లెన్నో కలవు. ఈ దేశము లన్నింటినుండి అప్పుడప్పుడు విశ్వభారతికి విద్యార్థులు వచ్చుచునే యుందురు. ఈ విధముగ సంస్కృతిలో, కళా సాహిత్యములలో, ఏ దేశము ఇతర దేశములనుండి విభిన్నము కాదనియు, ప్రతి దేశము ఇతర దేశములనుండి చాల నేర్చుకొనవలెననియు రవీంద్రుడు చాటెను. ఆసియా దేశములన్నియు, సంస్కృతీ విషయమున ఒకదానికొకటి ఎంతో ఋణపడియున్నవని అతని భావము.

మూడవది, ఆసియాతోపాటు యూరోప్, అమెరికా మున్నగు పాశ్చాత్య దేశములకు సంబంధించినది. ఆర్యుల కాలమునుండి కూడ భారతదేశముపై దండెత్తివచ్చిన వారందరు భారతీయ నాగరికతాభివృద్ధి, కళా సంపాదన మున్నగు వాటిలో కొంత ఉపకారము చేయకపోలేదు. భారత సంస్కృతి ఇతర నాగరికతల నెన్నింటినో సమన్వయించుకొని పెంపొందినది. పాశ్చాత్య సంస్కృతియందలి ఉన్నత భావములను అనుస

రింపనిచో శాంతినికేతనము తగిన ఫలితముల నీయలేదని ఠాకూర్ ఒకసారి చెప్పెను. అమృతసర్ దురంతములవలన మనస్సు ఖేదపడుచున్నప్పుడు కూడ, రవీంద్రుడు పాశ్చాత్య నాగరికతయందలి ఔన్నత్యమును విస్మరించలేదు. ఆత్మ విశ్వాసము లేనిదే భౌతిక బలము లభింపదు. పాశ్చాత్య నాగరికత సాహసము, పట్టుదల, విచక్షణలతో కూడిన విజ్ఞాన శాస్త్రాభివృద్ధికి చెందినది. పాశ్చాత్య దేశములనుండి విశ్వ భారతికి చాలమంది విద్యార్థులు అధ్యాపకులు వచ్చి చేరు చుండిరి. అమెరికానుండి, యూరప్‌నుండి చాలమంది వచ్చి ఆ సంస్థ అభివృద్ధికి తోడ్పడిరి. ఆ విధముగ అది నిజముగ ప్రపంచ విశ్వవిద్యాలయ మనిపించుకొనెను.

విశ్వభారతిలో జాతిమత విచక్షత లేదు. అన్ని జాతుల వారు కలసియుండి, కలసియే భుజింతురు. ఎటువంటి మత భేదములు పాటించుటకు వీలులేదు. కాని, రవీంద్రుడు అన్ని మతములు ఒక్కటికాదని, ఒక్కొక్క మతములో ఒక ప్రత్యేక సత్యము ఇమిడియున్నదని గుర్తించెను. ప్రతి విద్యార్థి తన మతమును ఇతరుల మతములను సమానముగ గౌరవించుటకు ప్రోత్సహించెను. అంతేకాని, ఎవరిని స్వమతములను నిరసింప మని చెప్పలేదు. పైగా, ప్రతివారు తమ మతమునందలి విశేషములను ఇతరులకు తెలుపవలెనని కోరెను. ప్రపంచ మందలి ప్రముఖ మత నాయకుల వార్షికోత్సవములు జరుపు ఏర్పాటుచేసెను. దీనివలన విద్యార్థులందరికి అన్ని మతముల గురించి తెలియుచుండెను.

శాంతినికేతనము స్థాపించిన తరువాత ఇరవై సంవత్సరము లకు, 1921 లో విశ్వభారతి స్థాపించబడెను. ప్రారంభోత్సవ

మప్పుడు రవీంద్రుడు విశ్వభారతి యొక్క ఆదర్శములను, ఆశయములను గురించి చెప్పెను. పూర్వకాలమందు ప్రయాణ సౌకర్యములు లేక ఒక చోటినుండి మఱియొకచోటికి వెళ్లుట కష్టముగా నుండెను. అప్పుడు ఒక దేశము వారికి మరియొకరితో పరిచయములేక, ఒక్కొక్క చోట ప్రత్యేకమైన నాగరికత పెంపొందుచుండెను. ఇప్పుడట్టిది సంభవము కాదు. అన్ని ప్రాంతములకు, అన్ని దేశములకు సులభముగ రాకపోకలు గలవు. ఇతరులతో పరిచయము కలిగించుకొనక, వారి మంచి చెడ్డలను గ్రహింపక తప్పదు. నలుగురితో కలసిమెలసి యుండ లేనివానికి నేటి ప్రపంచములో స్థానము లేదు. ఆధునిక యుగములో విశాలదృష్టి అత్యవసరమైనది.

'భిన్న నాగరికతలు, సాంప్రదాయములు కలవారందరు ఒక్కచోట నివసించుటకు తగినట్లుగా నేను విశ్వభారతిని స్థాపించితిని. ఇటువంటి మహోన్నత కార్యమును ప్రారంభించు టకు ఇది చాల చిన్న స్థలమని మీరు భావించవచ్చును. కాని, అందుకు నేను భయపడుటలేదు. మానవులవలెనే గొప్ప భావములు కూడ చిన్నవిగానే పుట్టి పెరుగవలెను. విశ్వ భారతి ఒక గొప్ప భావము. అది సుస్థిరమైన ఎడల తక్కిన అన్ని సజీవ వస్తువులవలెనే క్రమముగ పెరుగును. గొప్ప భవనములు, ధనము మున్నగు బాహ్యాడంబరములే వస్తు వికాసమునకు కారణములని కొందరు భావించవచ్చును. వారు సత్య ప్రభావమును గుర్తించలేదని చెప్పవలెను. అది మేమారు మూలయందున్నను క్రమముగ పెరిగి అంతటా వ్యాపింపగలదు' అని ఠాకూర్ చెప్పెను. తన ఈ గొప్ప ప్రయత్నము ఒకవేళ విఫలమగునేమో యని అతడు ఎప్పుడును శంకింపలేదు.

ప్రయత్నించుట మాత్రమే తన కర్తవ్యమని భావించెను. 'భగవంతుడు మన కిచ్చిన బాధ్యతలను గ్రహించుటయే మన కర్తవ్యము. కృతకృత్యులము కాలేకపోయినను మనఃపూర్తిగ ప్రయత్నించుటచేతనే మన కర్తవ్యమును నెరవేర్చినవారమగుదుము' అని అతడు చెప్పెను.

విశ్వభారతిని గురించి కవికన్న కలలన్నియు ఇంకను పరిపూర్ణము కాలేదు. 1921 లో ప్రారంభమైన ఆ మహోన్నత సంస్థ ఇంకను పెరుగుచునే యున్నది. బాధ్యత వహింపతగిన వ్యక్తులు లేనిదే రవీంద్రుడే క్రొత్త శాఖను ప్రారంభింపడు. అందుకే విశ్వభారతిలో 'చీనా సంస్కృతి' తప్ప ఇతర శాఖలు స్థాపింపలేదు. ఇంకను హిందూ పాశ్చాత్య సంగీత సంప్రదాయముల సామ్య భేదములను పరిశీలించుటకు తగిన అంతర్జాతీయ సంగీతశాఖ లేదు. కాని, ఇతర విషయములలో ఇంత స్వల్ప కాలములో విశ్వభారతి గడించిన ఫలితములను, పరిణతిని, పరిశీలించినప్పుడు రవీంద్రునియొక్క ప్రతిభ మెచ్చుకొనక తప్పదు.

విశ్వభారతి స్థాపించినప్పుడే రాజకీయ రంగమున సహాయ నిరాకరణోద్యమము ప్రారంభమయ్యెను. 1915 లో మహాత్ముడు శాంతినికేతనమునకు వచ్చెను. తరువాత రవీంద్రుడు, మహాత్ముడు చాల దగ్గర స్నేహితులుగా నుండిరి. ఇరువురు, తమకుతోచిన విధమున దేశసేవచేయుచు ఒకరినొకరు మెచ్చుకొనుచుండిరి. సహాయనిరాకరణోద్యమ సమయములో ఒక వ్యాసములో మహాత్ముడు రవీంద్రుని ఒక గొప్ప రక్షక భటునిగ పేర్కొనెను. దేశ క్షేమమును ఎల్లప్పుడు కనిపెట్టుచు అంతరంగికముగ, బాహ్యముగ దేశమునకు ఎటువంటి కీడు

రాకుండ అతడు కాపాడునని చెప్పెను. ఇరువురును ఉత్తమమైన శాంతి విధానముతో జాతీయ స్వాతంత్ర్యము కొరకు పోరాడిరి. విశ్వభారతి తలపెట్టిన అంతర్జాతీయ సహకారము, భారతీయ స్వాతంత్ర్యము లేనిదే సమకూరదని ఇద్దరికిని తెలియును.

పదునొకండవ అధ్యాయము

## శ్రీనికేతన్

షిలైదాలో కుటుంబపు భూముల యాజమాన్యము వహించినప్పటినుండి రవీంద్రునికి అచ్చటి పల్లెప్రజలతో సంపర్క మేర్పడెను. గ్రామీణులు స్వతంత్రులై, స్వశక్తిపై ఆధారపడువరకు దేశమభివృద్ధి పొందదు. నిజమైన శాంతి సౌఖ్యములుండవు. కాబట్టి, అతడు పల్లెప్రజలకు సహాయ పడదలచెను. కాని, అది కష్టసాధ్యమనిగూడ అతడెరుగును. పల్లెప్రజలు విజ్ఞానవంతులై స్వతంత్రముగా పాటుపడునట్లు చేయుటకు, ఉత్సాహము ఒక్కమాత్రమేగాక పల్లెటూరి జీవితముగురించి చక్కగా తెలిసియుండవలెను.

పల్లెటూళ్ల పరిస్థితులను పరిశీలించి అభివృద్ధిపరచుటకు ప్రయత్నించుటగూడ విశ్వవిద్యాలయముల బాధ్యత. హిందూ దేశములో చాల గ్రామములు గలవు. ఉత్తమమైన విశ్వ విద్యాలయమునకు వానితో సంబంధముండవలెను. అందుచేత రవీంద్రుడు పల్లెటూళ్ల సమస్యలను పరిశీలించుట, పరిష్క రించుటగూడ విశ్వభారతిశిక్షణలో ఒక భాగముగ చేసెను. రవీంద్రుని పెద్దకొడుకు దేవేంద్రనాథుడు అమెరికాలో మూడేళ్లు వ్యవసాయ శాస్త్రము చదివియుండెను. అతడే ఈ

కార్యములో రవీంద్రునికి తోడ్పడుచుండెను. నవీన శాస్త్రము లేనిదే గ్రామపునర్నిర్మాణ కార్యక్రమములో బాధ్యత కల్గించు కొనుట హానికరమనిగూడ రవీంద్రునికి తెలియును.

శాంతినికేతన సమీపమున చాల పల్లెలు కలవు. ఇందు 'సంతాల్' జాతివారు నివసింతురు. బెంగాలీవారి ఆచార వ్యవహారములకును వీరికిని చాల వ్యత్యాసము కలదు. వీరు బలిష్టులు. స్వతంత్రాభిమానులు. దేవేంద్రనాథుడు మొదట శాంతినికేతనమునకు వచ్చినప్పుడు ఆ ప్రాంతమునందు చాల బందిపోట్లు జరుగుచుండెడివి. అప్పుడచ్చట నివసించు సంతాల్ జాతివారు చాల కష్టమైన మోటుపనులన్ని చేయుదురు. రవీంద్రుడు వారి స్వతంత్ర జీవనమును, నిజాయితీని మెచ్చు కొని వారికి సహాయపడదలచెను.

**1917** లో రవీంద్రుడు శాంతినికేతనమునకు రెండు మైళ్ల దూరములో 'సురుల్' అను పల్లెటూరిదగ్గర ఒక పెద్ద బంగాళాను కొనెను. అతడు తలపెట్టిన గ్రామ సేవా కార్యక్రమమును అక్కడ ప్రారంభించెను. రవీంద్రునికొడుకే కాక, యల్. కె. ఎల్మ్‌హర్స్ట్ అను ఆంగ్లేయుడు కూడ, విశ్వభారతి గ్రామ సేవాశాఖలో పనిచేయుచుండెను. ఇతడు ఇంగ్లండు లోను, అమెరికాలోను గ్రామ సమస్యలను ఎక్కువగ పరిశోధించి అనుభవము గడించెను. రవీంద్రుడు 'సురుల్'లో స్థాపించిన గ్రామ సేవా మందిరమునకు 'శ్రీనికేతన్' అని పేరు. గ్రామములు సిరిసంపదలతో తులతూగవలెనని రవీంద్రుని అభిప్రాయము.

విశ్వభారతిలోని ఇతర శాఖలవలెనే, శ్రీనికేతనముగూడ చిన్నదిగా ప్రారంభమై క్రమక్రమముగ అభివృద్ధిపొంది ప్రస్తుత

రూపమును దాల్చినది. ప్రాచీన మందిరములో నేడు కార్యాలయము, పుస్తకభాండాగారము కలవు. దానికి ఒకవైపున అధ్యాపకుల ఇండ్లు, మరియొకవైపున కొంత పొలము. ఇక్కడ క్రొత్తవిత్తనములను నాటి, అవి ఫలవంతములైనచో పల్లెవారు గూడ ఆ విత్తనములే నాటునట్లు ప్రోత్సహింతురు. 'సురుల్' ప్రదేశము మెట్టప్రదేశము. అన్ని విత్తనములు అక్కడ పండవు. అందుచేత, ముందు శ్రీనికేతన భూమిలో నాటి ఫలితములను చూచి తరువాత గ్రామభూములలో నాటుదురు. అక్కడ చెట్లు అంతగా లేవు. వర్షములు వచ్చినప్పుడు నేల కరగి, కొట్టుకొని పోవుచుండును. ఈ నష్టమును నివారించుటకు శ్రీనికేతనమువారు ప్రయత్నించుచున్నారు. అక్కడ చక్కని గోశాలకూడ కలదు. ఇందు చవుకగా అన్నికాలములందు పశువులకు మేతదొరకు విధానము కనిపెట్టుచుందురు. అక్కడ తోటలు లేవు. అందుచేత, గ్రామజనులందరిని వారి దొడ్లలోను, పొలములలోను పండ్లచెట్లు నాటుడని ప్రోత్సహింతురు. మంచి మొక్కలను చవుకగ శ్రీనికేతనములో అమ్ముదురు. వరీ, చెరకు, అక్కడి ముఖ్యమైన పంటలు.

ఆరోగ్యము, వైద్యము శ్రీనికేతనములో ఒక ముఖ్య భాగము. పల్లెటూళ్లలో ఆరోగ్య సహకార సంఘములు స్థాపింపబడెను. గ్రామములోని ప్రతి కుటుంబము చందా నిచ్చును. దానితో డాక్టరుకు జీత మిత్తురు. వైద్యుడు గ్రామములోనే ఉండును. అక్కడే ప్రత్యేకమైన మందుల షాపుకూడ నుండును. గ్రామములోనివారందరు ఉచితముగా వైద్యుని సహాయమును పొంది చౌకధరలకు మందులు కొనవచ్చును. వైద్యుడు రోగుల ఇండ్లకు వెళ్లినచో అందుకు

ప్రత్యేక రుసుము వసూలు చేయబడును. అది సంస్థకు చెందును. ఒక గ్రామములో వైద్యుని పోషించుటకు తగినన్ని కుటుంబములు లేనప్పుడు రెండు మూడు గ్రామముల కొక వైద్యుడుండును. ఇతడు రోగములు నివారించుటయే గాక, గ్రామ జనులందరు వ్యాధులు రాకుండ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించునట్లు చూచును. దోమలబాధ నివారించుటకు తగినమార్గములను సూచించును. ఈ విధముగ గ్రామములలో వైద్యుని ఖర్చు మూడువంతులు తగ్గెను. మలేరియా బాధకూడ చాలమట్టుకు తగ్గెను. డాక్టర్ హేరీ టిమ్బర్స్ అను అమెరికన్ మలేరియా నివారణ పరిశోధకుడు చాల సంవత్సరములు శ్రీనికేతనములో తన కుటుంబముతో నివసించి, అక్కడివారికి సహాయపడెను. ఈ విధముగ శ్రీనికేతనముగూడ అంతర్జాతీయమయ్యెను.

కాని, ప్రతి గ్రామస్థుడు సహకరించిననే గాని ఇటువంటి సంస్థ ఫలవంతము కాజాలదు. ఎవరైనను 'నా కుటుంబములోని వారెవ్వరు ఈ సంవత్సరము జబ్బుపడలేదు; నేను ఎందుకు చందా కట్టవలెె' నని భావించినచో అంతయు నిష్ప్రయోజనమగును. గ్రామస్థుల సహకారము లేనిదే, ఏ పని చేయుటకు సాధ్యముకాదని రవీంద్రుడు మొదటనే గుర్తించెను. చందాలు సక్రమముగా రానప్పుడు సంస్థను నడుపుట కష్టము. గ్రామవాసులందరు విద్యావంతులైనప్పుడే తగిన సహకారము లభించును. అందుచేత, శ్రీనికేతనములో ఒక విద్యాశాల కూడ కలదు. కాని, అక్కడ ప్రత్యేక పాఠశాలగాని, అధ్యాపకులుగాని లేరు. తగిన పాఠశాలలను ప్రభుత్వమే నడుపును.

శాంతినికేతనమున ఉత్సవము

శ్రీనికేతనములో అధ్యాపకులకు కొంత శిక్షణ ఇయ్య బడును. వారు పిల్లల సమస్యలను అర్థముచేసికొని, సాను భూతితో, వారికి విద్య నేర్పవలెను. అందుచేత, అక్కడ అధ్యాపకులకు శిక్షా కేంద్రము స్థాపింపబడెను. ఇక్కడ, గ్రామ సమస్యలు గ్రామీణ జీవితము వారికి చక్కగ తెలుప బడును.

రెండవది విద్యార్థులకు శిక్షణ నిచ్చుట. శ్రీనికేతన ములో స్కౌటు సంఘమును స్థాపించిరి. వీరిని 'బ్రతీబాలక్' లందురు. రవీంద్రుడు రచించిన చిన్న గేయము వారి ఆశయ ములను తెలుపును. వారు దానిని పాడుచు పనిచేయుదురు. ఎల్లప్పుడు, కష్టములలో నున్నవారికి సహాయపడెదమని వాగ్దా నము ఈ గేయ సారాంశము. పాఠశాలలలో చెప్పని విశేష విషయములు వీరు సంఘ సమావేశములలో నేర్చుకొందురు. వారు ఎప్పుడును పరిశుభ్రముగ ఆరోగ్యముగ నుందురు. గ్రామములో నెక్కడైన నిప్పు రగుల్కొన్నచో వెంటనే సహాయపడుదురు. ఎప్పుడును అప్రమత్తులై యుందురు. వారు ఇంటి ఆవరణలోనే కూరగాయలు పండింతురు. ఏ కూరలు ఆరోగ్యమునకు ముఖ్యమైనవో తెలిసికొందురు. వైద్య మున కుపయోగించు మూలికలేవో, అవి ఆ చుట్టుపట్ల ఎక్కడ దొరకునోకూడ తెలిసికొనియుందురు. గ్రామములో ఎవరికైన ఆరోగ్యము సరిగాలేనియెడల వైద్యశాలకు తీసికొనివెళ్లి మందు ఇప్పించెదరు. అడవులు, తటాకములు బాగుచేసి దోమల బాధనివారింతురు. రహదారులు శుభ్రముగా నుంచుదురు. వారు తమ ఇండ్లచుట్టేగాక, తమ సంఘము ఉన్నస్థలమున చక్కని తోటలను పెంచుదురు. అందలి కూరలను పండ్లను

అమ్మి వచ్చిన ధనముతో పాఠ్య గ్రంథములు కొందురు. వారికి వేరే ఆటపాటలు, నాటకములు అన్ని యుండును. అప్పు డప్పుడు, అందరును కలసి ఇతర ప్రదేశములు చూచుటకు పోవుదురు. ఈ విధముగ విజ్ఞానమును, వినోదమును జతపరుతురు.

బ్రతీబాలక్ సంఘము పరస్పర సహకారము నేర్పును. ఇంగ్లండ్‌లో రాబర్ట్ బాడెన్ పవెల్, స్కౌట్ సంఘములను మొట్టమొదట స్థాపించెను. రవీంద్రుడు ఆ పద్ధతులను చక్కగ పరిశీలించి హిందూ గ్రామజీవితమునకు సరిపడునట్లు సమన్వయించెను.

పల్లెలలోని పాఠశాలలన్ని చాలవరకు ప్రాథమిక విద్యను మాత్రమే బోధించును. కాని, గ్రామములోని యువకులు నిజముగ వివేకవంతులై తమ గ్రామస్థులకు మార్గదర్శకులు కావలెనన్నచో అంతకంటె ఎక్కువ విద్య వారి కవసరము. శ్రీనికేతన్‌లో ఒక వసతి గృహముకూడ స్థాపింపబడెను. ఎనిమిది తొమ్మిదేండ్ల బాలు రక్కడ ప్రవేశించి పదిహేను పదహారు సంవత్సరములు వచ్చువరకు అక్కడనే ఉందురు. బెంగాలీ సాహిత్యము, చరిత్ర నేర్చుకొందురు. జీవిత చరిత్రలు చదివి సమకాలిక సమస్యల చర్చింతురు. విజ్ఞాన శాస్త్రము, గణిత శాస్త్రముకూడ నేర్చుకొందురు. ఈ విధముగ వారి దృక్పథము విశాలమగును. తోటపని, బట్టలు నేయుట, మున్నగునవికూడా నేర్చుకొందురు. కాని, వారికి సామాన్య ముగ పరీక్ష లేవియు నుండవు.

ఆ తరువాత, ఇంక ఏ ప్రత్యేక విషయమునందైనను ఉన్నత విద్య నభ్యసింపవలెనని వారు ఇంటిలోనే చదువుటకు

వీలగునట్లు ఏర్పాటు చేసెను. ఈ విధముగ బాలబాలికలు ఇంటివద్దనే చదువుచు ప్రపంచ జ్ఞానమును సంపాదించుటకు అవకాశము కలిగెను. ఈ పద్ధతిప్రకారము ఇంటిదగ్గర చదివిన వారికి, వారువారు చదివిన తరగతులను అనుసరించి ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నతవిద్యా పత్రములను ఇచ్చెదరు. ఈ విద్యావిధానమునకు కావలసిన పుస్తకములు రవీంద్రుడు చాల కుతూహలముతో తానే వ్రాయుచుండెను.

శ్రీనికేతనమున ఒక పత్రికకూడ ప్రచురింపబడుచుండెను. ముఖ్యమైన వార్తలు, గ్రామవాసుల కుపయోగించు వ్యాసములు, ఇందు సరళమైన బెంగాలీలో ప్రచురింపబడుచుండెను. వయోజన విద్యకు ఈ పత్రిక చాల ఉపయోగపడుచుండెను. వయస్సున పెద్దవారు చదువ నేర్చుట మాత్రమే వయోజన విద్యకాదు. వారికి విశాలమైన దృక్పథము, ప్రతివిషయము గురించి స్వయముగ ఆలోచించుకొను శక్తి, నిత్యజీవితములో ఆనందమును గుర్తించు శక్తి, కలిగించుటయే నిజమైన వయోజన విద్య అని రవీంద్రుని భావము.

శ్రీనికేతనములో శిల్పభవనము ఒక ముఖ్యమైన అంగము. ఇక్కడ బాలురకు జీవనాధారమగు చేతి పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు అన్నియు సమగ్రముగ నేర్పుచుందురు. వడ్రంగి పనిశాఖలో బల్లలు, కుర్చీలు, తలుపులు అన్నియును చేయుదురు. చేనేతపనిశాఖలో చీరెలు, తివాసీలు, తువ్వాళ్లు మున్నగునవి నేయబడును. పుస్తకములకు అట్టలు వేయుట, తోలు సంచులు, చెప్పులుమున్నగునవి చేయుట నేర్పుదురు. మట్టితో కప్పులు, పూలసజ్జలు, మున్నగునవి చేయుదురు. శాంతినికేతనములోని కళాశాఖవారి సలహాల ననుసరించి

ఇక్కడ అన్నియును చక్కని రంగులతో, బొమ్మలతో ఆకర్ష
ణీయముగ చేయుదురు. కలకత్తాలో ఒక ప్రత్యేక దుకాణ
ములో శిల్పభవనములో చేసిన వస్తువులు అమ్ముదురు. అమ్ము
టకు తగిన వస్తువులను చేసినవెంటనే విద్యార్థులకు జీతమిత్తురు.
వర్షములు లేక, కరువులు వచ్చినప్పుడు పరిసర ప్రాంతముల
వారికి ఈ శిల్పభవనమునందలి పనివారు చాల సహాయము
చేయుదురు. గ్రామవాసులందరితో వారికి పరిచయము.
అందరికి వీరియెడల విశ్వాసము. ఎవరికి ఎటువంటి సహాయము
కావలయునో వారికి తెలియును. ప్రభుత్వోద్యోగులతో
కలసి వారు క్షామనివారణకు, బాధానివారణకు పాటుపడుదురు.

శ్రీనికేతనముచుట్టుప్రక్కల పల్లెలలో ఠాకూర్ ఎక్కువ
సిరిసంపదలే గాక జీవితములో ఉత్సాహము, ఆనందముకూడ
కలుగునట్లు చేసెను. జీవితములో ధనసంపదయేగాక, శాంతి
సౌఖ్యములుకూడ చాలముఖ్యమైనవి. తాను ప్రారంభించిన
గ్రామసేవా కార్యక్రమము దేశమంతట వ్యాపింపవలెనని
అతడు కోరలేదు. ఒక్క పల్లెలోని ఒక వ్యక్తి తన సహ
కారమున సౌఖ్యమును, ఆనందమును అనుభవింపకలిగినచో
తన జీవితము ధన్యమని రవీంద్రుడు భావించెను. అదియె
నిజమైన స్వరాజ్యము. హిందూదేశములోని అసంఖ్యాకము
లైన గ్రామములన్నియును స్వయంసంపూర్ణములై సౌఖ్య
వంతముగా నున్నప్పుడే దేశము నిజముగ స్వతంత్రమగును.
గ్రామముల ఔన్నత్యమే దేశౌన్నత్యము. గ్రామముల
సుఖమే దేశ సౌఖ్యము. దేశములోని ప్రతి పల్లె శ్రీనికే
తనమువలె ఆనంద సౌందర్యములతో ప్రకాశింపవలెనని రవీం
ద్రుని ఆశయము.



## పన్నెండవ అధ్యాయము

# కథారచయిత

1914—19 మధ్య రవీంద్రుని జీవితములో పేర్కొనదగినవి, అంతర్జాతీయ విశ్వవిద్యాలయమును స్థాపించుట, దేశము చాల క్లిష్ట పరిస్థితులలోనున్నప్పుడు జాతీయోత్సాహముతో గ్రామాభివృద్ధికొరకు కృషిచేయుట, మున్నగునవి. సామాన్య మానవులిందులో యే ఒక్క కార్యమును చేయుటకైనను చాల కష్టపడియుందురు. కాని, అరువది యేండ్లు దాటినను రవీంద్రుడు దీనివలన అలసిపోలేదు. ఉత్సాహమును కోల్పోలేదు. ఈ సమయములో అతడు ఇంకను ఏవో వ్రాయుచు, అనువదించుచు, తన పుస్తకముల ప్రచురణమును పర్యవేక్షించుచు శ్రమపడుచుండెను. ఇంగ్లండ్‌లోను, అమెరికాలోను అతని గ్రంథములు, కథలు, నవలలు ఉపన్యాసములు ఎన్నో ప్రచురితమయ్యెను. అతని గ్రంథములు ఇతర యూరోపియన్ భాషలలోకికూడ అనువదింపబడెను. 1923 లో అతడు 'విశ్వభారతి క్వార్టర్లీ' అను పత్రికను ప్రారంభించెను. ఇందు మూడు నెలలకొకసారి విశ్వభారతి కుపయోగించు వ్యాసములు ప్రచురింపబడును. దేశదేశముల నాగరికతను గురించి, సాహిత్యమును గురించి ఇందు వ్యాసములుండును. కొన్నాళ్లు రవీంద్రుడే దీనికి సంపాదకుడుగానుండెను. అతడు మరణించువరకు ఈ పత్రిక ప్రతిసంచికకు ఒక వ్యాసముగాని, పద్యముగాని తప్పక రచించుచుండెను. అతడు యూరోప్‌లోను, ఇతరచోట్ల, పర్యటించుచున్నప్పుడు తన స్నేహితుడు ఆండ్రూస్‌కు పెద్దపెద్ద ఉత్తరములు వ్రాయుచు

శాంతినికేతన విశేషములన్నియు తెలుసుకొనుచుండెను. తరువాత ఈ ఉత్తరములన్నియును ప్రచురింపబడెను. అందులో చాల లోకజ్ఞానము, సమకాలిక సమస్యల గురించి కొంత ఛలోక్తికూడ గోచరించును. రవీంద్రుడు హాస్య ప్రియుడు.

రవీంద్రునికి ఒక పాత కథ చాల ఇష్టము. ఒకసారి ఒక మేకపిల్ల బ్రహ్మవద్దకు వెళ్లెను. 'నన్ను ఏమి చేయ మందువు? అందరు నన్ను ఆహారముగా తినుచున్నారు' అని మొరబెట్టెను. బ్రహ్మకేమియు తోచలేదు. 'నేనేమి చేయ దును! నిన్ను చూడగానే నాకే తినవలెనని బుద్ధిపుట్టుచున్నది' అనెను!

ఒక ఫ్రెంచి రచయిత రవీంద్రుని నవలకు పీఠిక వ్రాయుచు ఇట్లు చెప్పెను: 'ఫ్రాన్స్‌లో చాలమంది రవీంద్రుని ఆధ్యాత్మిక ప్రధానమైన పద్యములు, వేదాంత సంబంధమైన వ్యాసములు మాత్రమే చదివి, అతడు సామాన్య మానవుడు కాడని, దేవ దూతయని భావింతురు. సామాన్య ప్రజల జీవితముతో అతనికి సంబంధము లేదనికూడ తలతురు. కాని హిందూ దేశములో గొప్ప మత ప్రవర్తలు, వైజ్ఞానికులు, కవులు అందరుకూడ మంచి హాస్య దృష్టికలవారే. అట్లే రవీంద్రుడు కూడ సరసుడు. నవ్వి, నవ్వింపగలవాడు' అని ఆ ఫ్రెంచి రచయిత తెల్పెను. రవీంద్రుని నవలలు, కథానికలు చదివినచో సామాన్య ప్రజల జీవితముతో అతనికిగల పరిచయము, హాస్య ధోరణి వ్యక్తమగును.

రవీంద్రుడు తన బాల్యములో జరిగిన విశేషములనే జ్ఞప్తియందుంచుకొని చాల చక్కని కథలల్లెను. 'అస్థి

పంజరము' అను కథ అటువంటిదే. చిన్నప్పుడు వారి ఇంటిలో ఒక అస్థిపంజరముండెడిది. ఠాకూర్ ఇంటిలో పిల్లలందరు దానినిచూచి వేర్వేరు ఎముకల పేర్లు నేర్చుకొనెడివారు. గాలి వచ్చినప్పుడు అందలి ఎముకలు కదలుచు గలగలమని చప్పుడయ్యెడిది. ఈ ధ్వనికి నిత్యము అలవాటు పడియుండుటచే పిల్లలు భయపడెడివారు కాదు. రవీంద్రుడు వ్రాసిన కథలో గోడకు తగిల్చిన అస్థిపంజరము ఒక రోజు కలలో అతనికి కనిపించి, తానొకప్పుడు చాల అందమైన స్త్రీనని తన కథ చెప్పును.

రవీంద్రుని చిన్నతనములో మహర్షి పంజాబునుండి, ఇతర చోట్లనుండి తాను వెళ్లినప్పుడు నౌకర్లను తీసికొని వచ్చెడివాడు. తన బాల్యదశలో రవీంద్రుడు ఈ వింత సేవకులు తన్నెంతగా ఆకర్షించినది తెల్పును. వీధిలో అమ్ముటకు వచ్చువారుకూడ బాలకుడైన రవీంద్రుని ఎక్కువగ ఆకర్షించిరి. 'కాబూలీవాలా' అను కథ పరాయి దేశమునుండి ఇట్లు అమ్ముకొనుటకు వచ్చిన వారియెడల రవీంద్రుని అభిమానమును తెల్పును. అహమ్మదాబాద్‌లో తన అన్నగారి విశాలభవనములో ఒంటరిగ నున్నప్పటి అనుభవమును 'ఆకొన్న రాళ్లు' అను కథగా వ్రాసెను. ఒక ప్రభుత్వోద్యోగి ఏదో పని మీద ఒక ప్రాచీన భవనములోనుండును. అక్కడి పూర్వ వైభవమును గురించి అతడు వింతగా ఊహించును. రాత్రింబవళ్లు అతడు తన ఊహాప్రపంచములో, ఆ భవనపు రాళ్లు చెప్పు కథలు వినుచుండును. తిరిగి, అతి కష్టముమీద, వాస్తవిక జగత్తులో ప్రవేశించును.

రవీంద్రుని కథలలో పాత్రలు, సన్నివేశములు అన్ని అతి సరళమైనవి. అతడు పల్లెలోగాని, పట్టణములోగాని,

సామాన్య ప్రజలను పాత్రలుగా గ్రహించి వారి దినచర్య లను, భావములను, కష్ట సుఖములను వర్ణించును. కాని, అతని లేఖిని ప్రభావమువలన సామాన్య ఘటనలే మంత్రశక్తిని పొందినట్లు హృదయమును కదలించును. 'సుభ' అను కథలో ఒక పల్లెటూరి మూగ బాలిక ఆవేదనను వర్ణించెను. సుభ తన తల్లిదండ్రులకు మూడవకూతురు. ఆ పిల్లకు మాటలు రావు. కాబట్టి, ఆమెకు ఎటువంటి భావములు సుఖదుఃఖములు కూడ లేవని అందరు భావింతురు. ఎవరికి తను అక్కరలేదని తెలుసుకొని ఆ మూగ పిల్ల, పాపము, తనవలె నోరులేని జీవులతోను అచేతనములైన వానితోనే, స్నేహము చేయును. ఆవులు, ఊరి చెరువు, చెట్లు చేమలు ఆమె మిత్రులు. ప్రకృతియె ఆమె తల్లి. మానవ సంఘముతో ఆమెకు సంబంధము లేదు. కాని, కులాచారము ప్రకారము ఆమెకు పెండ్లిచేయక తప్పదు. ఆమెను కలకత్తాకు తీసికొని వెళ్లి అక్కడ ఒక పెళ్లి వారికి చూపుదురు. పెండ్లికొడుకు ఆమెను చూచిచూచి పరీక్షించి 'ఫరవాలేద'నును. అదృష్టవశాత్తు, పెండ్లి ముగియు వరకు పెళ్లికూతురు నోరు తెరవనక్కరలేదు. పెండ్లి సక్రమ ముగ జరిగిపోవును. సుభతల్లిదండ్రులు కులము నిలుపుకొని ఇంటికి తిరిగి పోయెదరు. కాని, పాపము సుభకు ఈ గొడవ ఏమియు అర్థము కాలేదు. ఆమె ప్రతి ముఖము చూచిచూచి ఎక్కడను ఆదరణ పొందలేకపోవును. తాను ఎరిగిన జీవులు ఎక్కడను కనుపింపరు. ఇదివరకున్న మానస్నేహము దూరమై ఆమె తపించిపోవును. ఈ కథలో సుభ మానసికావస్థ అతి సున్నితముగా చిత్రితమైనది. రవి నాటి కులమర్యాదలను వ్యంగ్యముగ ఆక్షేపించెను.

ఇటువంటిదే 'సెలవలు' అను కథ. ఇది ఫతిక్ అను బాలుని విషాద చరిత్ర. తల్లికి చిన్నకొడుకుమీద ఎక్కువ ప్రేమ. పెద్ద కొడుకైన ఫతిక్‌ను సరిగా చూడదు. అతనికి మాతృప్రేమ తెలియదు. ఫతిక్ మేనమామ అతనిని కలకత్తా తీసికొనివెళ్లి చదివింతుననును. ఫతిక్ సంతోషముతో అతని వెంటబోవును. కాని, ఆ మేనమామ భార్య చాల కఠినురాలు. ఫతిక్ అక్కడ ఉండుట ఆమె కిష్టములేదు. అతనిని చాల నిరాదరించును. ప్రేమాదరణములకు దూరమైన ఫతిక్ తన్ను ఎవరైనను ప్రేమించవలెనని, తాను ఎవరికైనా ఉపయోగపడవలెనని పరితపించును. తిరిగి, ఇంటిని గురించి, తల్లిని గురించి తలచుకొనును. సెలవలు ఎప్పుడు వచ్చునని ఆతృత పడును. చివరకు అతనికి చలిజ్వరము వచ్చును. తన జబ్బుతో తన అత్తను ఇంకను కష్టపెట్టుట ఇష్టములేక, ఎవ్వరితోను చెప్పకుండా కలకత్తాకు ప్రయాణమగును. అది శ్రావణ మాసము. విపరీతపు వర్షములు. త్రోవలో వానకు తడిసి జ్వరమధికమగును. అలసిపోయిన అతనిని మేనమామ తిరిగి ఇంటికి తీసికొనివచ్చును. కొన ఊపిరితో, పాపము! అతడు హృదయవిదారకముగ: 'అమ్మా, సెలవలు ఇచ్చారు' అని, కండ్లు మూయును.

రవీంద్రుని కథలన్ని సరళముగానుండును. అతడు పాత్రల భావములను, మనస్తత్వమును అద్దములోవలె చూపును. వారి కష్ట సుఖములను చాల సానుభూతితో వర్ణించును. అదే అతని కథలలోని అందము. ఎప్పుడో అతనికి కలిగిన అనుభవ పరంపర అతని రచన లన్నింటిలోను కానసగును. దీనివలననే అతడు సామాన్య జనులలో దాగియుండే గొప్ప

గుణములను, ప్రకృతికి, మానవునికిగల పరస్పరాకర్షణ, సృష్టి లోని ఆనందము, అంత చక్కగా వర్ణింపకలిగెను.

రవీంద్రుని కథలు కొన్ని చాల హాస్యపూరితములు. ప్రతి వాక్యమునందు యేదో వ్యంగ్య ధ్వని తొణికిసలాడుచు నవ్వు పుట్టించును. సాధారణముగ రవీంద్రుడు ఒక కథ వ్రాయుట ముగిసినతోడనే శాంతినికేతనము వారినందరిని పిలచి ఏ చెట్టుక్రిందనో చదివి వినిపించెడివాడు. చమత్కార ముగనున్న రవీంద్రుని ప్రతివాక్యమునకు పిల్లలు నవ్వెడివారు. ఆ నవ్వుల ప్రతిధ్వనులలో కథ సజీవమయ్యెడిది. పిల్లలు ఆసక్తితో ఏకాగ్రచిత్తులై చివరవరకు వినెడివారు. రవీంద్రుని భావపూరితమైన మధుర కంఠముతో ఆ కథలు వినుట ఒక అపూర్వానందము.

రవీంద్రుని కథలు, నవలలు బెంగాలీ సాంఘిక జీవితమును సమగ్రముగ చిత్రించును. గత శతాబ్దములో అక్కడవచ్చిన మార్పులనుకూడ తెల్పును. అతని నవలలో ఎక్కువ ప్రసిద్ధ మైన 'గోరా' రవీంద్రుడు తన చిన్నతనములో కలకత్తాలోని సాంఘిక పరిస్థితిని ఇందు చక్కగ వర్ణించెను. గోరా, 1857 సిపాయిల తిరుగుబాటు సమయమున పుట్టినవాడు. గోరా తల్లిదండ్రులు ఐరిష్‌వారు. కాని, హిందువులవద్ద పెరిగెను. ఈ విషయము కథాంతమువరకు గోరాకు తెలియదు. గోరాకు హిందూదేశమన్నను, హిందూమతమన్నను అధికమైన భక్తి, ఉత్సాహము. పెరిగి పెద్దవాడై, దేశ నాయకుడగును. గోరా నవలలో రవీంద్రుడు అప్పటి క్రొత్త హిందూమత నాయకు లను, బ్రహ్మసమాజమతము వారిని చిత్రించెను. గోరా క్రొత్త హిందూ ధర్మమునకు చెందినవాడు. అతనిలో కపటములేదు.

ఉత్తమ భావములు కలవాడు. కాని, అతని అనుచరులు కొందరుమాత్రము అటువంటివారు కారు. గోరాకు, అతని మిత్రుడు వినయునికి ఒక బ్రహ్మసమాజపు కుటుంబముతో పరిచయమగును. వీరు చాలమటుకు పాశ్చాత్య పద్ధతుల ననుకరించువారు. గోరాకు వారి భావములు, పద్ధతులు సరి పడవు. కాని, ఆ కుటుంబపు వ్యక్తుల ఉదారస్వభావము, విద్యావివేకములు అతనిని ఆకర్షించును. నవలలో ముఖ్య మైనది గోరా మనస్సులోని ఈ సంఘర్షణ. కథలో సంకుచిత భావములుగల హిందువులను, అట్లే, విశాలదృష్టిలేని బ్రహ్మ సమాజమతమువారిని చక్కగ చిత్రించెను. ఇందు స్త్రీ పాత్రలు చాల సహజముగ మనోహరముగ పోషింపబడినవి. గోరాను పెంచిన ఆనందమయి స్వార్థత్యాగము, విశాలహృదయము, మరువరానివి.

రవీంద్రుని మరియొక ఉత్తమ నవల 'ఇంటా బయటా' అనునది. గోరాలో చాల పాత్రలుగలవు. కాని, ఇందు మూడే పాత్రలు: భార్య, భర్త నిఖిల్, అతని స్నేహితుడు సందీప్. నిఖిల్ ఒక భూస్వామి. చాల చదువుకొన్నవాడు. అతడు దేశభక్తి, జాతీయ భావములు కలవాడు. కాని, హింసాపద్ధతి అతని కిష్టములేదు. తన చుట్టుపట్ల గ్రామముల నభివృద్ధిపరచుటకు పాటుపడును. కాని, అతని స్నేహితుడు సందీప్ దృక్పథము వేరు. ఆతడు విదేశ వస్తువులను తగుల బెట్టవలెనని, ఏ విధముననైనను దేశస్వాతంత్ర్యమును సాధింప వలెనని తలచును. నిఖిల్ స్వదేశ వస్త్రములను ప్రోత్స హించును, కాని, తన గ్రామములో విదేశ వస్త్రములను విక్రయించుట నిషేధించి గ్రామస్థులందరు స్వదేశీ బట్టలనే

కొనునట్లు నిర్బంధించుట కిష్టపడడు. ఒకసారి, సందీప్ అనుచరులు నిఖిల్ గ్రామములో ఒక విదేశీ బట్టల దుకాణమును తగులబెట్టుదురు. ఆ విధముగ ఆ దుకాణదారుడు నిరాశ్రయుడగును. నిఖిల్ తన భార్యను చదివించుటకు చాల ప్రయత్నించును. కాని, కొంతకాలము ఆమె సందీప్ మాటలచే ఎక్కువ ఆకర్షింపబడును. ఆమెకు చదువు చెప్పుచున్న ఆంగ్ల యువతి, సందీప్ అనుచరుల దుండగములకు భయపడి ఊరు విడచిపోవును. నిఖిల్ స్టేషన్‌వరకు వెళ్లి ఆమెను చాల గౌరవముతో సాగనంపివచ్చును. నిఖిల్ భార్య విమలకు ఇది నచ్చదు. ఆమె భర్తను దేశద్రోహియని నిందించును. ఈ కథ విమల, నిఖిల్, సందీప్ ముగ్గురిచేత చెప్పబడును. ఒక్కొక్కరు వారి దృక్పథమును, భావములను విశదీకరింతురు. నిఖిల్, సందీప్, విమల—వీరి పరస్పర సంబంధము చక్కగా వర్ణింపబడినది. ఇదియే కథకు ముఖ్యాంగము.

రవీంద్రుడు 'నాల్గు అధ్యాయములు' అను నవలలో అప్పటి రాజకీయ పరిస్థితులను వర్ణించెను. 'పడవ మునుక' చక్కని సాంఘిక నవల. క్రొత్త పెళ్లివారు ఒక పడవలో నదిని దాటుచుండగ, నదీ మధ్యమున తుపాను వచ్చి పడవ మునిగిపోవును. తనవారినుండి విడిపోయిన పెండ్లికొడుకు నీటినుండి బయటపడును. తెలివి వచ్చిన తరువాత, తన ప్రక్కనే పసుపు బట్టలతో నున్న బాలికను చూచి ఆమెయే తన భార్య అనుకొనును. పెండ్లిలో అతడు సిగ్గువలన, పిల్లను సరిగా చూడలేదు. ఇంటికి తీసికొని వెళ్లిన తరువాత, ఆ పిల్ల తన భార్య కాదని తెలిసికొనును. ఆ మాట ఆమెతో చెప్పినచో ఇల్లు విడిచి వెళ్లునని భయపడును. కాని, ఇంటిలో నుంచుకొని ఆమెను

భార్యగా చూచుటకు అతని మనస్సొప్పదు. ఈ సంధిగ్ధావస్థలో నేమిచేయవలెనో తెలియక బాధపడును. చివరకు, మరికొన్ని విచిత్ర సంఘటనలు జరిగి కథ సుఖాంతమగును.

రవీంద్రుడు కథలు వచనములోనేగాక పద్యములలో కూడ వ్రాసెను. వీని కథా వస్తువు చాలవరకు హిందూదేశ చరిత్ర సంబంధమైనది. భారతవీరుల దేశభక్తి, ధైర్య సాహసములు, వారి అద్భుత చర్యలు వర్ణించు పద్య కథలు కొన్ని. వారి జీవితమందలి విషాద సంఘటనలు వర్ణించునవి కొన్ని. కొన్ని కథలు పురాతన బౌద్ధగాథల ననుసరించినవి. రవీంద్రునికి బుద్ధ చరిత్ర, బౌద్ధ గాథలు చాల ఇష్టము. ఈ గాథలు కొన్ని అతడు నాటకములుగా కూడ వ్రాసెను. 'నటీర్ పూజ', 'చండాలిక', 'శ్యామ' బౌద్ధ గాథ లాధారముగ వ్రాసినవే. రవీంద్రుడు రచించిన గేయ కథలు కొన్ని సమకాలిక సంఘటనలు ఆధారముగ వ్రాసినవి. 'సముద్ర తరంగములు' అనుదానిలో యాత్రికుల పడవ తుపానులో మునిగిపోవుట అద్భుతముగ వర్ణించెను.

1919 తరువాత రవీంద్రుడు తన జీవితమును ఎక్కువగ దేశాటనలో గడపెను. కాని, ఎంత కార్యనిమగ్నుడై యున్నను అతడు కావ్యరచన మానలేదు. పరిసర వస్తువుల సౌందర్య మాతని నెప్పుడును ఆకర్షించుచునే యుండును. శాంతినికేతన సమీపమందలి 'కోపాయ్' నదిని గురించి ఒక పద్యమున వర్ణించెను. ఇది చిన్న సెలయేరు. రవీంద్రుడు దీని సౌమ్య సౌందర్యమును షిలైదాలోని పద్మానదితీవ్రతతో సరిపోల్చి చక్కగా వర్ణించెను. పనిచేయు సంతాల్ కన్యను గురించినది మరియొక పద్యము. శ్రమపడుచున్నను ఆమె

నవ్వు ఆనందముతో ప్రతిధ్వనించుచుండెను. ఇంకొక పద్యములో పొలముపాలేరు ధూళి ధూసరితమైన మార్గమున, వార్థక్యముతో నడుము వ్రాలి, సంతకు నడచిపోవుచుండుట శబ్దచిత్రముగ వర్ణించెను.

రవీంద్రుడు చివరవరకు సామాన్య మానవుల జీవితమును చూచి ఆనందించుచు మెచ్చుకొనుచుండెను. అతడు మహా తత్వవేత్త, అధ్యాపకుడు, దేశ భక్తుడు. మానవ సేవయే పరమావధిగా గలవాడు. కాని, అన్నింటికన్న ముఖ్యముగా అతడు కవి, గాయకుడు, కళావేత్త. ప్రకృతిలో, మానవ జాతిలో అతనికున్న ఆకర్షణ శాశ్వతమైనది. కవికి విశ్వముపై గల అపరిమిత ప్రేమ భావమును 'బాలకా' అనే పుస్తకములో అతడిట్లు వర్ణించెను:

'అద్భుతమైన ఈ ఉజ్వల ధాత్రికి
నా హృదయ మర్పించితిని, ప్రేమించితిని.
నా జీవితమునంతయును చాపచుట్టగ
ఈ ప్రపంచమునకే చుట్టితిని.
సంధ్యారుణ మసక కాంతులు, బంగారపు ఉదయ కాంతులు
ఎన్నో, లెక్క లేనన్నిగా
నా ఆత్మను తాకి, జారిపోయెను;
నేడు, చివరకు,
నా జీవితమే, భూమి, ఆకాశము,
సముద్రము సూర్యచంద్రులు, అన్నీ;
జీవితమే నన్ను వరించెను,
అద్భుతమైన ఈ ఉజ్వల ధాత్రిని
నిజముగనే ప్రేమించితిని.'

పదమూడవ అధ్యాయము

# నాటకము — నటించుట

రవీంద్రునికి చిన్నతనమునుండి నాటకము లనిన యెక్కువ అభిమానము. చిన్నప్పుడు, రవి అన్నగార్లు ఇంటిలో నాటక ప్రదర్శనములు జరిపెడివారు. కాని, పిల్లలు వానిని చూచుటకు వీలులేదు. రవి, తక్కిన పిల్లలు వసారాలో కూర్చుని ఇంటికి వచ్చు అతిథులను చూచెడివారు. నాటకము వారికి కొంత కొంత వినబడుచుండెడిది. ఆ రోజులలో నాయిక పాత్రను పురుషులే ధరించుచుండెడివారు. కొంచెము పెద్దవాడైన తరువాత, రవి అన్నగార్లతోపాటు ఈ నాటక ప్రదర్శనలలో పాల్గొనెడివాడు. నాటకములు రచించెడివాడు. అతని పందొమ్మిదవయేట వారి ఇంటిలో ప్రదర్శించుటకే 'వాల్మీకి ప్రతిభ' రచించెను. అతడు వ్రాసిన మరి కొన్ని నాటకములు ఇదివరకే పేర్కొనబడినవి.

రవీంద్రుని నాటకములు కొన్ని ఆంగ్ల నాటకములవలె చురుకైన సంభాషణలతో చక్కని నాటకీయమైన సన్నివేశములతో నుండును. మరికొన్ని, సంభాషణలే లేక పూర్తిగ పాటలతో, నాట్యముతో నుండును. కాని, సంభాషణలు ప్రధానమైన నాటకములలోకూడ, కథలోని ముఖ్య భాగములు అక్కడక్కడ పాటలలోనే ఉండును. రవీంద్రుడు ప్రధానముగ కవి. కవి యనగ సృష్టించువాడు. అతని నాటకములలో ప్రతి ప్రదర్శనమునకు ముందు ఏదో క్రొత్త మార్పు చేయుచుండెడివాడు. సంభాషణ ప్రధానమైన నాటకములు

ఒక్కొక్కసారి గేయ నాటికలుగా మారెడివి. ఇట్లు ప్రతిసారి నాటకము క్రొత్తదిగానే తోచెడిది.

1922 లో రవీంద్రుడు రచించిన 'ముక్తధార' అను నాటకము చాల ప్రశంసనీయమైనది. ఇందలి గాథ రెండు రాజ్యములకు చెందినది. ఉత్తరకూటము, శివతరాయ్. ఇందు రెండవది, అనగా శివతరాయ్, ఉత్తరకూటమునకు సామంతరాజ్యము. ఉత్తరకూటము, స్వలాభము కొరకు శివతరాయ్ విదేశ వ్యాపారమును నిరోధించును. శివత రాయికి రాజ ప్రతినిధిగా వెళ్లిన ఉత్తరకూట రాజకుమారుడు అభిజిత్ చాల ఉదార స్వభావము కలవాడు. అతడు రహదారు లన్ని స్వేచ్ఛగా విడచి, ప్రజలు తమ కష్టములు తీరువరకు కొన్నాళ్లు పన్నులు కట్టనక్కరలేదని శాసించును. ఉత్తరకూట ప్రభుత్వము మాత్రము అంత ఉదారమైనది కాదు. వారు 'ముక్తధార' నీరు శివతరాయ్‌కి పోకుండ పెద్ద ఆనకట్ట కట్ట మని మేధావంతులను నియమింతురు. ఈ ఆనకట్ట ముగియ గనే, ఉత్తర కూటములో గొప్ప ఉత్సవము చేయుదురు. ప్రజలందరు ధన్యవాదములు తెల్పుటకు దేవాలయమునకు పోవు సన్నివేశముతో నాటకము ప్రారంభమగును. మొదటి దృశ్యమున, ఒక త్రోవప్రక్కన, ఇరు రాజ్యముల ప్రజలు, శివతరాయ్‌కు చెందిన యోగి ధనంజయుడు, బడిపంతులు, పిల్లలు, అందరు దేవాలయమునుండి వచ్చుచు పోవుచు నుందురు. బడిపంతులు పిల్లలకు కొన్ని భావములు చిలుకపలుకులవలె నేర్పును. చరిత్రలో ఉత్తరకూట ఔన్నత్యము గురించి ప్రతి యుద్ధములో న్యాయము ఎల్లప్పుడు తమ పక్షమే ఉన్నట్లు, ఎల్లప్పుడు తామే జయించినట్లు తెలుసుకుందురు. ఇంతేగాక,

వాల్మీకి పాత్రగా రవీంద్రుడు

పియుతరాయ్ ప్రజల ద్వేషించుట నేర్చుకొందురు. కారణము, వారి ముక్కులు ఉత్తరకూట ప్రజల ముక్కులవలె ఉండవు గనుక!

ఈ కథలో కొన్ని రాజకీయ భావములు ప్రస్ఫుట మైనవి. ఉత్తరకూటపు బడిపంతులు వంటివారు అన్ని దేశము లందును కలరు. వారు చిన్నప్పటినుండి చరిత్రను తప్పుగా వ్యాఖ్యానించి చెప్పి, పిల్లల అమాయకపు హృదయములలో ఇతర దేశములయెడ, ఇతర జాతులయెడ, ద్వేషము రేకెత్తింతురు. రంగస్థలమున ఆనకట్ట కట్టుట కుపయోగించిన గొప్ప యంత్రము, దేవాలయమును మరుగుపరచుచుండును. పియుత రాయ్ ప్రజలను నాశనము చేసిన ఈ యంత్రము రవీంద్రుడు జపానులో ఉపన్యసించుచు పేర్కొనిన యంత్ర ప్రభుత్వమును సూచించును. ఆ ఆనకట్టను కట్టిస మేధావంతులకు భగవంతుని యెడ, ప్రజల సుఖమునెడ లక్ష్యములేదు. పీడితులై, నిరాశ చెందిన పియుతరాయ్ ప్రజలు ప్రభుత్వముపై దౌర్జన్య మైన తిరుగుబాటు చేయ తలపెట్టుదురు. కాని, యోగియైన ధనంజయుడు వారిని నివారించును. అహింసాత్మకమైన ఓర్పు, సాహసమే వారికి నిజముగ సహాయపడునని చెప్పును. రవీంద్రుడు ధనంజయుని నోట తన భావములనే వెలిబుచ్చును.

'ఒక కాలు కుంటి యగుటకంటె, అనర్థమేమి కలదు? ప్రభుత్వము ప్రజలకుకూడ చెందక, పూర్తిగా రాజుదే యైనప్పుడు కుంటియగును. ఆ ఒంటికాలి ప్రభుత్వము కుంటు చుండగా చూచి మీరు భయముతో వణికిపోవచ్చును. కాని, దేవుని కన్నులు అశ్రుపూరితములగును. రాజక్షేమ మపే క్షించియైన, జనులార! మీరు మీ అధికారమును సాధింప వలెను.'

ధనంజయుని ఇటువంటి పలుకులలో భారత బ్రిటన్ దేశ ముల సంబంధము స్పష్టమగును. ఈ ధనంజయుని పాత్ర రవీంద్రు డిదివరకు రచించిన 'ప్రాయశ్చిత్త' మను నాటకము నుండి గ్రహించెను.

నాటకము చివరివరకు భయంకరమూర్తియైన శివుని ధ్యానించు భక్తులు వచ్చుచు పోవుచుందురు. అన్యాయము నకు ప్రతిక్రియ చేయుమని ప్రార్థించుచుందురు. ఈ అదృశ్య దేవతారాధన అసలు కథకు వంతపాటగ నుండును. ధనం జయుని గీతములలో రాజనీతియే గాక, అమూల్యమైన జీవిత సత్యములుకూడ అంతరించిపోవుననెడి ప్రమాదమున్నట్లు స్పష్ట మగును. చివరకు అభిజిత్తుడు, పియుతరాయ్ ప్రజలకు ఏ విధముగనైనను స్వాతంత్ర్యము న్యాయము కలుగునట్లు చేయ వలయునను తలంపుతో ఒంటరిగ ఆనకట్టను భేదించుటకు పోవును. ఆనకట్ట తెగినవెంటనే ముంచుకు వచ్చు ప్రవాహ ములో తాను మునిగిపోవుదునని అతనికి తెలియును. ఐనను లక్ష్యపెట్టడు. కడపటి దృశ్యము అద్భుతముగ నుండును. శివతాండవము జరుగుచుండగా, ధనంజయుడు గంభీరముగ పాడుచు ఎట్టకేలకు లభించిన స్వాతంత్ర్యమునకు స్వాగత మిచ్చును. దూరముగ స్వేచ్ఛగ ప్రవహించు ముక్తధారని నాదము వినబడుచుండును.

1927లో రచించిన 'నటీర్ పూజ' అను నాటకము రవీంద్రునికి చాల ప్రియమైనది. కలకత్తాలో అది ప్రప్రథమ మున ప్రదర్శించినప్పుడు గొప్ప కలవరమును రేకెత్తించెను. ఆ నాటకములో తొలిసారిగ బెంగాల్‌లో మర్యాదస్తుల కుటుంబ ములకు చెందిన కన్యలు పాల్గొనుటయే గాక, నాట్యముకూడ

చేసిరి. ఇది ఎక్కువగ విమర్శింపబడెను. కాని, నాటకము లోని ఉదాత్త భావములవలన, నాట్యమునందలి స్వచ్ఛతవలన ఆ విమర్శనలు త్వరలోనే అణగిపోయెను. నృత్యకళకు గౌరవ నీయమైన స్థానము లభించెను.

ఈ నాటకము ఒక బౌద్ధ గాథ ఆధారముగ వ్రాసినది. నాయిక, శ్రీమతి, మగధరాజుల ఆస్థానములో నాట్యకర్తె. మగధరాజు బుద్ధుని ఉపదేశములవలన బౌద్ధ మతమును స్వీక రించును. అతని కుమారుడుకూడ బౌద్ధభిక్షు వగును. కాని, అతని రెండవ కొడుకు, అజాతశత్రువు హిందువుల నందరిని తన పక్షమున చేర్చుకొని, రాజ్యము తన కిమ్మని అడుగును. బుద్ధుని ఆదేశానుసారము రాజు రాజ్యము నిచ్చివేసి తపస్సు చేసికొనుటకు అడవులకు వెళ్లిపోవును. రాణి ఒకవైపు బుద్ధుని మీాద భక్తితోను మరియొకవైపు భర్త, కొడుకు దూరమైనా రను దుఃఖముతోను బాధపడుచుండును. అజాతశత్రువు బౌద్ధులను క్రూరముగ హింసించుచుండును.

నాటక ప్రారంభమున ఒక బౌద్ధ భిక్షువు రాచనగరుకు భిక్ష కొరకు వచ్చి శ్రీమతిని ఆశీర్వదించి 'త్వరలోనే బుద్ధుడు నిన్ను పిలచును; నీ ఉత్తమమైన కానుకను అతనికి సమర్పింపుము అని చెప్పును. శ్రీమతి అతడు ఏది కోరిన అది యిచ్చుటకు సిద్ధముగ నున్నానని చెప్పును. కాని, తాను ఇవ్వగలిగిన ఉత్తమమైన కానుక యేదో తనకు తెలియదనును.

హిందూధర్మాచారములకు, బౌద్ధమత విరక్తి సేచ్ఛా భావములకు మధ్య గలిగిన సంఘర్షణ ఈ నాటకములో ప్రస్ఫుటమగును. అశోకవృక్షము క్రింద బుద్ధుని సాయంకాల పూజను స్వయముగ నిర్వర్తించమని బౌద్ధ సంఘము శ్రీమతిని

ఆజ్ఞాపించును. అజాతశత్రువు శ్రీమతి పూజచేయుటకు వీలులేదని, చేసినచో మృత్యుదండ విధింపబడునని చెప్పును. పైగా, ఎక్కడ పూజ చేయవలెననుకొనెనో అక్కడే ఆ సాయంత్రమే నాట్యము చేయవలెనని ఆజ్ఞాపించును. ఇది చాల అవమానకరమని అందరు భావింతురు. ఏమి చేయుటకు తోచక శ్రీమతి బాధపడుచుండగా, ఆమెకు బుద్ధుని వాక్కు వినబడును. తాను అతనికియ్యగల ఉత్తమ కానుక ఈ నాట్యము, సంగీతమేనని ఆమెకు స్ఫురించును. వెంటనే చక్కగ అలంకరించుకొని, వెంటవచ్చు రక్షక భటులను లక్ష్యపెట్టక, అశోకవృక్షము వద్దకు వెళ్లును. ఆ రోజు ఆమె ఆట, పాట ఒక పూజగ మారును. నాట్యము చేయుచు, చేయుచు, ఆమె ఆభరణము లన్నింటిని ఒకటొకటిగా తీసి బుద్ధునికి కానుకగ సమర్పించును. చివరకు సన్యాసినిగా మారి, బుద్ధునిచెంత మోకరిల్లి ధ్యానము చేయును. ఆ సమయమున రాజభటు లామెను వధింతురు. కాని, ఆమె భక్తి విజయము పొందెను. ఆమెను చంపుటకు అసూయచేత కుతంత్రములు పన్నిన రాకుమార్తెలు పశ్చాత్తాపము నొంది ఆమె ఆత్మసౌందర్యము తమ రాజ్ఞీత్వము కన్న ఎంతో ఉదాత్తమైనదని వాపోవుదురు. అంతవరకు మనో నిశ్చయములేక దుఃఖముతో నున్న రాణికి, శాంతి లభించును. ఆమె బౌద్ధ మతమును స్వీకరించి, భిక్షుకిగా మారును.

ఈ రెండు నాటకములలో సంభాషణలు ముఖ్యమైనవి. 1892 లో రచించిన 'చిత్రాంగద'లో సంగీతము, నాట్యము ముఖ్యమైనవి. ఇది శాంతినికేతనములో తరుచు ప్రదర్శించు చుండెడివారు. నాటకము ఆరుబయటనే ప్రదర్శింతురు.

పుస్తకశాలలకు ముందలి వసారాను రంగస్థలముగ నుపయో గింతురు. ప్రేక్షకులు నేలమీదనే పచ్చికపైన కాని, లేక, తివాసీలు పరచుకొనిగాని వెన్నెలలో కూర్చుందురు. గాయకులు సంగీత వాద్యములతో రంగస్థలమున కొకవైపు కూర్చుందురు. మరియొకవైపున మద్దెలవాడుండును. రంగస్థలముపైన దీపములు వెలిగించి నాటకము ప్రారంభింతురు. తెర యెత్తుట గాని, దించుటగాని లేదు.

రంగస్థలముమీద దృశ్యమును సూచించునవేవియు నుండవు. కాని, అది ఒక అడవి దృశ్యమని మన మూహించుకొనవలయును. ఒక వేటగాడు ప్రవేశించి పాటకు అనుగుణముగ నాట్యము చేయును. పాటను ప్రక్కన పురుషులు కొందరు పాడుదురు. ఆ పాటలో, నాట్యములో, చెట్లు, పక్షులు, సుందర దృశ్యములు మనకు స్ఫురించును. ఇంతటితో వేటగాని పాత్ర ప్రయోజనము ముగియును. అది అడవియని మనకు తోపింపజేసిన వెంటనే అతడు రంగస్థలము విడచును. తరువాత కథానాయకుడు అర్జునుడు ప్రవేశించును. అతడు పన్నెండు సంవత్సరముల దేశయాత్ర చేయుచు ఇక్కడికి వచ్చును. దైవధ్యానము చేసి రంగస్థలమున ఒక ప్రక్క నిదురించును. తరువాత, పురుష వేషముతో రాకుమార్తె చిత్రాంగద, ఆమె చెలికత్తెలు ప్రవేశింతురు. వారి దుస్తులు రంగురంగులతో మనోహరముగ నుండును. చిత్రాంగద తండ్రి కొక్కటే కూతురు. ఆతడామెను కొడుకువలెనే చూచి అన్ని విద్యలు నేర్పి పెంచును. అడవిలో ఆడుకొనుచు చిత్రాంగద, ఆమె చెలికత్తెలు నిదురించుచున్న అర్జునుని చూతురు. ఆతనిని లేవమని ఆజ్ఞాపింతురు. ఇంత

వరకు మాటలేవియు నుండవు. కథయంతయు ప్రక్క పాట లోను నాట్యములోను విశదమగును. అక్కడనున్న వ్యక్తి అర్జునుడని తెలిసినప్పుడు చిత్రాంగద తన జీవితములో తొలి సారి స్త్రీ సౌందర్యమును, లావణ్యమును ఆకాంక్షించును. ఆమె అందకత్తె కాదు. తన చెలికత్తెల సహాయము చేయగా నామె విలువైన వస్త్రములు, నగలు ధరించి శృంగారించు కొనును. తరువాత అర్జునుడు తిరిగి ధ్యానమగ్నుడై యుండగ, ఆమె తన అలంకారముతో నాతని యెదుటకు వచ్చి యాతనిని ఆకర్షించుటకు ప్రయత్నించును. కాని, ఆతడు ఆమెను నిరాక రించును. ఆమె నిరాశచెందును.

తరువాత, చిత్రాంగద తన చెలికత్తెలతో అర్జునుని ఆక ర్షించుటకు తాను శారీరక సౌందర్యము నెంతగా కోరుచున్నది తెల్పును. ఆమె మన్మథుని స్తోత్రముచేసి, ఒక రోజుకు మాత్రము వసంతశోభను సౌందర్యము నిమ్మని కోరును. మన్మథుడు కనికరించి ఒక సంవత్సరము ఆమె సౌందర్యవతిగ నుండునని చెప్పును. పురుషవేషములో నున్న చిత్రాంగద నిష్క్రమించి సౌందర్యవతియైన మరియొక బాలిక చిత్రాంగద రంగస్థలమును ప్రవేశించును. ఈమె చెలికత్తెలతో అర్జునుని యెదుట నాట్యముచేసి యాతనిని సులభముగ ఆకర్షించును. కాని, తొలినుండి యామె ఆతనిని మోసగించుచున్నానని, తన సుందరరూపము ఒక్కనాటి పుష్పము మాత్రమేనని బాధ పడును.

అడవిలో అర్జునుడు, చిత్రాంగద కొంత కాలము సుఖ ముగ నుందురు. నదులలో స్నానము చేయుచు, వనములో విహరించుచు, చిత్రాంగదను అలంకరించుచు చెలికత్తెలు

కాలము గడుపుదురు. కాని, ఈ ఆనందములో తన అస్థిర సౌందర్యమును తలచుకొని చిత్రాంగద బాధపడుచుండును. ఒకసారి అర్జునుడు అక్కడి పల్లెప్రజలవలన వారి రాకుమార్తెను గురించి వినును. ఆమె చక్కగా యుద్ధము చేయగలదని, దొంగలనుండి, దురాక్రమణ చేయువారినుండి, తమ్ము కాపాడెదని, ఇప్పుడామె కొంతకాలముగ కనబడుటలేదని వారు చెప్పుదురు. అర్జునుని మనస్సు ఆమె పరాక్రము దెస, అద్భుత చర్యల దెస, ఆకర్షింపబడును. చిత్రాంగద తిరిగి అతనివద్దకు వచ్చినప్పుడు ఈ వింత రాకుమార్తెను గురించి ఇంకను వివరములు చెప్పమని అతడామెను కోరును. ఆమెకు శారీరక సౌందర్యము లేదని చిత్రాంగద చెప్పును. కాని అర్జునుడు లక్ష్యపెట్టడు. అప్పుడు తిరిగి మన్మథుని ప్రార్థించి యామె నిజస్వరూపమును పొందును. అలంకారములు మరుగుపరచని ఆత్మసౌందర్యము, శారీరక బంధములేని సత్యము చివరకు జయించును.

## పదునాల్గవ అధ్యాయము

# ప్రపంచ పౌరుడు రవీంద్రుడు

1920 నుండి రవీంద్రుడు స్వదేశములోను, విదేశములలో కూడ చాల పర్యటించెను. అప్పటి కాతనికి అరువది సంవత్సరములు. ఆ వయస్సులో నెవరైనా విశ్రాంతి తీసుకొనవలెనని కోరుదురు. కాని, శక్తి ఉన్నంతవరకు, పని ఉన్నంతవరకు రవీంద్రుడు విశ్రాంతి మాట తలపెట్టువాడుకాడు. ఈ ప్రయాణము లన్నింటివలన ఆతడు చాల అలసట చెందెను. ప్రతి

చోట, ఆతనికి విందులు సభలు అధికముగ నుండెను. అందరు ఆతనికి అఖండ స్వాగత మిచ్చిరి. కాని, ఇంగ్లండ్‌లోను అమెరికాలోను మాత్రము కొన్ని పత్రికలు స్పర్థ వహించి ఆతనికి వ్యతిరేకముగ వ్రాయుచుండెను. దీనివలన విసుగుచెంది రవీంద్రుడు శాంతినికేతనములోనే విశ్రాంతితో గడపిన బాగుండెడిదని అప్పుడప్పుడు అనుకొనెడివాడు.

ఐనను, విశ్వభారతి కొరకు అతడు పర్యటించక తప్పలేదు. దానిని గురించి అందరికి తెలియవలెనని అతని కోరిక. విదేశములలోని విజ్ఞానవంతులతో పరిచయము కలిగించుకొని, విశ్వభారతి నడపుటకు వారి సహాయము, సలహాలు అపేక్షించెను. అంతేకాక, విశ్వభారతికి కావలసిన ధనముకూడ ఆర్జించవలసి యుండెను. అందువలన, 1920 నుండి 1936 వరకు ఆతడు తిరుగుచునే యుండెను. 1931 లో ఒక్క సంవత్సరము మాత్రము వంగదేశముననే ఉండిపోయెను.

1920 లో పశ్చిమహిందూదేశమంతయు తిరిగి, తరువాత, యూరోప్, అమెరికాకు వెళ్లెను. 1922 లో దక్షిణ హిందూదేశమున పర్యటించి, తరువాత సిలోన్ వెళ్లెను. 1923 లో సింధు రాష్ట్రము, కథియవార్, అస్సాము పర్యటించెను. 1924 లో చీనా, జపాన్, దక్షిణ అమెరికా వెళ్లి తిరిగి వచ్చునప్పుడు త్రోవలో ఇటలీకిగూడ వెళ్లెను. 1926 లో స్విట్జర్లాండ్, నార్వే, డెన్మార్క్, జర్మనీ, జెకోస్లావేకియా, గ్రీస్, ఈజిప్ట్ తిరిగెను. 1927 లో సంయుక్త రాష్ట్రములకు, మధ్యరాష్ట్రమునకు వెళ్లి, తరువాత మలయా, థాయ్‌లాండ్ వెళ్లెను. 1928 లో మరియొకసారి దక్షిణ హిందూదేశమునకు, సింహళద్వీపమునకు వెళ్లెను. 1929 లో కెనడా,

జపాన్ ఇండోచైనా వెళ్లెను. 1930 లో బరోడా వెళ్లెను. తరువాత మరల ఫ్రాంసు, ఇంగ్లండ్, జర్మనీ, డెన్మార్క్, రష్యా, అమెరికా దేశములకు వెళ్లెను. 1932 లో పర్షియా, ఇరాక్ వెళ్లెను.

1933 నుంచి 1936 వరకు రవీంద్రుడు ఇండియాలోనే అనేకచోట్ల తిరిగెను. శాంతినికేతనమునుండి తనతోకూడ కొంతమందిని తీసికొనివెళ్లి తన నాటకములు ప్రదర్శించి విశ్వభారతి కొరకు ధనమార్జించెడివాడు. అప్పటి కాతనికి డెబ్బది యైదు సంవత్సరములు, ఆ ఏడు బొంబాయి, ఆంధ్ర రాష్ట్రము, మద్రాస్, పంజాబ్, బీహార్, సిలోన్ వెళ్లెను. 1936 లో ఢిల్లీలో మహాత్ముడు రవీంద్రుని కలుసుకొనెను. ఇంత వయస్సులో రవీంద్రుడు ఈ విధముగ తన సంస్థకై ధనముకొరకు పాటుపడుట గురించి మహాత్ముడు చాల బాధపడెను. ఒక 'అజ్ఞాత మిత్రుని' విశ్వభారతి కార్యక్రమము చక్కగ నెరవేరుటకు, రవీంద్రుడు నిశ్చింతగ నుండుటకు వీలగునట్లు, అరువది వేలు విరాళ మిమ్మని ప్రోత్సహించెను. ఆ తరువాత రవీంద్రునికి ఎక్కువ తిరుగవలసిన అవసరము లేకపోయెను. 1939 లో ఒరిస్సా వెళ్లెను. వంగదేశముననే కొంత పర్యటించెను.

1920 లో ఇంగ్లండు వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులేవీ రవీంద్రునికి నచ్చలేదు. అది అమృతసర్ కాల్పులు జరిగిన సంవత్సరము. చాలచోట్ల రవీంద్రునియెడ అసహనము, ద్వేషము కనుపడెను. పార్లమెంట్‌లో హిందూదేశ పరిస్థితిపైన, జనరల్ డయ్యర్ చర్యపైన, చర్చలు జరుగుచుండెను. రవీంద్రుడు కొన్ని సమావేశములకు వెళ్లి చర్చలు వినెను. ఇంగ్లండ్ తన వ్యాపారమును, స్వలాభమునే చూచుకొనుచున్నదిగాని

భారతీయుల కోరికలను గమనించు స్థితిలో లేదని అతడు తెలుసుకొనెను. బ్రిటిష్ వారిని మన హక్కులకొరకు యాచించి లాభములేదని అతడు మిత్రులకు వ్రాసెను. అంత కంటె, హిందూ సంఘము బాగుపడునట్లు ప్రయత్నించుట మంచిదని, సాంఘిక న్యాయమువలన జాతి బలవంతమగునని అతడు తెల్పెను. అప్పుడు ఎవరినీ యాచించవలసిన అవసరముగూడ నుండదు.

రవీంద్రుడు అమృతసర్ కాల్పులను నిరసించుటేకాక, యుద్ధమును విమర్శించుటకూడ ఆంగ్లేయులకు నచ్చలేదు. రవీంద్రుడు 1920 లో ఫ్రాంస్ వెళ్లినప్పుడు, అక్కడ యుద్ధము వలన కలిగిన అనర్థములను కళ్లారా చూచెను. నాలుగు సంవత్సరముల ఎడతెగని యుద్ధమువలన నాశనమైన పల్లెలు, పొలములు హృదయ విదారకముగ నుండెను. యుద్ధములో మరణించిన యువకుల సంఖ్యకు అనాథులైన వ్యక్తుల సంఖ్యకు మితిలేదు. యుద్ధము మానవ రక్తమును, శక్తిని, పీల్చి పిప్పి చేయు పిశాచినివలె తోచెను. యుద్ధములో గతించిన యువకుల సాహసమునకు, త్యాగమునకు, వారి జీవితములు వ్యర్థమై నందుకు రవీంద్రుడు చాల ఖేదపడెను. న్యాయము, స్వాతంత్ర్యము యుద్ధమువలన లభింపవని అతడు చెప్పెను.

ఫ్రాంస్‌నుండి అతడు జర్మనీ వెళ్లెను. జర్మనీ అప్పుడు పరాజిత దేశము. కరవు, పేదరికముతో బాధపడుచుండెను. గెలిచిన మిత్రరాజ్యములు విధించిన పన్నులు చెల్లించలేక అవస్థ పడుచుండెను. ఆ పరిస్థితులలో ఏ దేశముకూడ జర్మనీకి సహాయముగ, స్నేహముగ నుండుట కిష్టపడలేదు. జర్మనీ ప్రజల అవస్థ హృదయ విదారకముగ నుండెను. పసిబిడ్డలు

కూడ రోగగ్రస్థులుగ నుండిరి. రవీంద్రుడు జర్మనీకి మన సానుభూతి యెంతో అవసరమని చెప్పెను. దయ, క్షమ ఈ రెండే యుద్ధమువలన కలిగిన అనర్థముల తొలగింపగలవని అతడు చాటెను. కాని, యుద్ధమునకు కారణము జర్మనీయే కావున, ఆ దేశమును క్షమించుటకుగాని, వారికి సహాయ పడుటకు గాని ఫ్రాంస్, బ్రిటన్ ఇష్టపడలేదు. అప్పుడు జర్మ నీకి సహాయపడి యుండినచో నక్కడ నాజీ ప్రభుత్వము బల పడెడిది కాదు. మరియొక యుద్ధము వచ్చియుండెడిది కాదు. కాని, అప్పుడు రవీంద్రుని వాక్యములు నిష్ప్రయోజనములే యైనవి.

రవీంద్రుడు జర్మనీలో నుండగా ఇరువురు జర్మన్ బాలికలు పువ్వులు తీసికొని ఆయనను చూచుటకు వచ్చిరి. వారికి ఇంగ్లీష్ అంతగా రాదు. వారిలో ఒక పిల్ల 'నేను హిందూ దేశమును చాల ప్రేమించుచున్నాను' అనెను. రవీంద్రుడు 'ఎందుచేత?' అని అడుగగా 'మీరు భగవంతుని ప్రేమింతురు గనుక' అని ఆ పిల్ల చెప్పెను. రవీంద్రుడు ఆ మాటలకు చాల ముగ్ధుడయ్యెను. తరువాత, ఆ విషయముగురించి ప్రస్తావించుచు, రవీంద్రుడు 'ఈ ప్రశంస చాల గొప్పది. ఆ మాటలు సత్యమేయైన యెంత బాగుండును. నిజముగ ప్రపంచము, తనకంటె భగవంతునే యెక్కువ ప్రేమించు దేశముకొరకై కనిపెట్టుకొని యున్నది' అనెను.

1924 లో చీనా వెళ్లినప్పుడు అక్కడ మొదట అతనికి యెక్కువ సత్కారము లభించలేదు. చాలమంది చీనా యువకులు అమెరికాలోను, ఇంగ్లండులోను చదివి యుండిరి.

వారు ఆ పాశ్చాత్య పద్ధతులను, విజ్ఞానమును తమ దేశములో ప్రవేశపెట్టదలచిరి. వారిలో చాలమంది సామ్యవాదులు తమ ఆశయములను భావములను బలవంతముగనైన దేశమున చొప్పింపదలచిరి. వారు రవీంద్రునిగురించి, ఆతడు ప్రాచీన పద్ధతుల నాదరించువాడని పాశ్చాత్య భావములు సరిపడనివాడని, చదివి యుండిరి. అందువలన వారు రవీంద్రునియెడ వ్యతిరేక భావముతో నుండిరి. కాని, రవీంద్రుని ఉపన్యాసములు కొన్ని విన్న తరువాత వారు తాము విన్నది చదివినది సరికాదని తెలుసుకొనిరి. రవీంద్రుడు సత్యాన్వేషి యని, ఎల్లచోట్ల సత్యముకొరకు, జ్ఞానముకొరకే వెదకుచుండునని తెలిసికొనిరి. తరువాత, వారు రవీంద్రుని చాల గౌరవించిరి. చీనా పండితులు డాక్టర్ హుషి, డాక్టర్ లియాన్ చిచావొ అతనికి చాల సహాయము చేసిరి. ఆ తరువాత చాలమంది విద్యార్థులుకూడ చీనానుండి వచ్చి శాంతినికేతనము చేరిరి.

1926 లో ఇటలీ వెళ్లినప్పుడు అచ్చటి ప్రభుత్వమాతనికి ఘన స్వాగత మిచ్చెను. అచ్చటి ప్రముఖుల నందరిని అతడు కలుసుకొనెను. ఇటలీదేశపు రాజు చాల యోగ్యుడని స్నేహపాత్రుడని అతడనుకొనెను. ఆతడు ముస్సోలినీనికూడ కలుసుకొనెను. ముస్సోలినీ రవీంద్రుని రచనలన్ని ఇటలీ భాషలోకి అనువదింపబడినవి చదివి యుండెను. వాని నాతడు చాల మెచ్చుకొనెను. రవీంద్రుడు ప్రఖ్యాత ఇటలీ రచయిత బెనిడెట్టో క్రోచేనుగూడ కలుసుకొనెను. ఇటాలియన్ బడి పిల్లలతో నాతడు చాల వినోదించెను. రోములో నాతడుండగ, వారు సాంవత్సరిక ఉత్సవము జరిపిరి. వెయ్యిమంది పిల్లలు ఒక్కసారిగ కలిసి పాడిరి. అది అద్భుతముగ నుండెను.

తరువాత కొంతమంది పిల్లలు వారి బడిపుస్తకములను రవీంద్రుని కిచ్చిరి. అందు వారు రవీంద్రునిపై వ్యాసములు వ్రాసి యాతని బొమ్మలు చిత్రించి యుండిరి. రవీంద్రు డా పుస్తకములు చాల రోజులు దాచుకొనెను.

అప్పటికే ఇటలీలో ఫాసిస్టు ప్రభుత్వము అధికారములో నుండెను. కొందరు పత్రికా విలేఖరులు రవీంద్రుని ఫాసిజమ్‌పై అతనికిగల అభిప్రాయములను గురించి అడిగిరి. ఆతనికి ఇటాలియన్ భాష ఎక్కువరాదు. అందుచేత, జాగ్రత్తగానే సమాధానము చెప్పెను. 'నాకు ఇటలీ ప్రజలను గురించి, వారి ప్రభుత్వమును గురించి యెక్కువ తెలియదు. కాబట్టి, ఆ విషయమునుగూర్చి చెప్పుటకు నేను సమర్థుడనుగాను. కాని, భౌతికసంపదకంటె ఆత్మసంపదయే గొప్పది. ఆత్మశక్తి యెక్కువగల దేశమే అన్నిదేశములకన్న బలమైనది అని చెప్పగలను!' అని అతడు అనెను. ఇటలీనుండి అతడు స్విట్జర్‌లాండ్ వెళ్లి అక్కడ కొందరు స్నేహితులతో కలసియుండెను. వారికి ఇటాలియన్ బాగా వచ్చును. కొన్ని ఇటాలియన్ పత్రికలు రవీంద్రుడు ఫాసిస్టు ప్రభుత్వమును మెచ్చుకొన్నట్లుగా వ్రాసినవని అతనితో వారు చెప్పిరి. అంతేగాక, ఫాసిస్టుల దుండగములను, క్రూరచర్యలను అతనికి యేకరవు పెట్టిరి. రవీంద్రుడు చాల కృద్ధుడయ్యెను. వెంటనే 'మాంచెస్టర్ గార్డియన్' అను ప్రఖ్యాత ఆంగ్ల పత్రిక కొక ఉత్తరము వ్రాసెను. అందు, తాను నిజముగ ఇటాలియన్ పత్రికా విలేఖరులతో నేమి చెప్పినది తెల్పెను. ఫాసిస్టుల చర్యలను నిరసించెను. తాను ఎప్పుడునుగూడ అన్యాయములకు,

అత్యాచారములకు విరోధినని తెల్పెను. దీనివలన ఇటాలియన్ పత్రికలకు చాల కోపము వచ్చెను.

తరువాత నాతడు జర్మనీ, బాల్కన్‌లకు వెళ్లెను. అక్కడి అమాయిక ప్రజల ప్రేమ ఆదరణ ఆతని, ముగ్ధుని చేసెను. 1930 లో ఆతడు రష్యా వెళ్లెను. పది సంవత్సరములలో నక్కడ కలిగిన అభివృద్ధి యద్భుతముగ నుండెను. రష్యాలో తాను చూచినదంతయు ఇండియాలోని స్నేహితులకు వివరముగ వ్రాసెను. ఆ ఉత్తరములే తరువాత Letters from Russia (రష్యా నుండి లేఖలు) అను పేరుతో ప్రచురింపబడెను. రష్యాలో ఆరోగ్యము, విద్య, అన్నింటిలో చాల అభివృద్ధి కలిగెను. బాలబాలికలందరికి సమానావకాశము లుండెను. కాని, ఒక్క విషయము మాత్రము రవీంద్రునికి నచ్చలేదు. అక్కడ సామ్యవాదభావములతో ఏకీభవించనివారికి వాక్స్వాతంత్రములేదు. ఇది చాల అన్యాయమని రవీంద్రుడు భావించెను. బలవంతముగ ప్రజల భావములనణచి వేయుట అతని కిష్టములేదు. దీనినిగురించి అతడిట్లు చెప్పెను:

'సామాన్య ప్రజలను విద్యావంతులుగా చేయుటకు మీరు చేయు కృషి ప్రశంసనీయము. ప్రజలందరు విద్యావంతులైననే సంఘ దురాచారములు సమసిపోవును. కాని, మీ భావములతో నేకీభవింపని వారిపై మీరు ప్రజలలో ద్వేషము రేకెత్తించుచున్నారు. ఇది సరియైనదా? మీరొక ఉదాత్తకార్య భారమును వహించి కృషిచేయుచున్నారు. దానికి తగినట్లుగా మీ మనస్సులుగూడ, దయ, సానుభూతి, ఓర్పు కలిగి ఉదాత్తముగ నుండవలెను.'

రవీంద్రుడెప్పుడు ఆస్ట్రేలియా న్యూజిలాండ్ వెళ్లలేదు. ఈజిప్ట్ తప్ప ఆఫ్రికాలో మరెక్కడకు పోలేదు. కాని, ఇవి తప్ప అతడు ఇంచుమించు ప్రపంచమంతయు తిరిగెను. 'రవి' అనెడి పేరాతని కెక్కువ ఇష్టము. సూర్యునివలె తానుకూడ సమస్త ప్రపంచమునకు చెందినవాడని యాతని భావము. ఆతని ఎనుబదవ జన్మదినోత్సవ సందర్భమున, త్రిపురా రాజతనికి 'భారత భాస్కరు' డను బిరుదు నిచ్చెను. ఇది తగినదేకాని, యంతకన్న నాతనిని 'ప్రపంచ భాస్కరు' డనుటయే సమంజసము. ప్రపంచములోని అన్ని కోనలలో నాతనికి మిత్రులు గలరు. ఏ కోనమైన నాతనికి స్వగృహామువలెనే యుండును.

పదునైదవ అధ్యాయము

## అంతిమ దినములు

1931 లో ఠాకూర్‌నకు డెబ్బది సంవత్సరములు నిండెను. దేశమంతట ఈసారి ఉత్సవములు జరిపిరి. కలకత్తాలో గొప్పగా ఉత్సవము జరుపుట కొఱక ప్రత్యేక సంఘు మేర్పడెను. డిసెంబర్ ఆఖరువారములో ఉత్సవము జరుప సంకల్పించిరి. అతని ప్రశంసించుచు ప్రముఖులు కొందఱు రచించిన వ్యాసము లను సమకూర్చు ఠాగూర్ సువర్ణ గ్రంథము 'The Golden Book of Tagore' అను పేరట ముద్రించి ఒక మహా సభలో రవీంద్రునికి సమర్పించిరి. అతని నాటకములను కొన్నింటిని ప్రదర్శించిరి.

ఈ ఉత్సవములు జరుగుచుండగనే జనవరిలో మహాత్ముడు కారాగారబద్ధుడయ్యెనను వార్త వచ్చెను. అంతటితో ఉత్సవము

లాగిపోయెను. మహాత్ముని బంధించినందుకు రవీంద్రుడు చాల బాధపడెను. అప్పుడు కూడ, అతడు బ్రిటిష్‌వారిని నిందింప లేదు. ద్వేషభావములు రేకెత్తించుటవలన లాభములేదని అతడెరుగును. కాని, లండన్‌లోని టైమ్స్ పత్రిక కతడొక లేఖ వ్రాసెను. ఇరు దేశములవారు గతమును మరచిపోయి ఒకరినొకరర్థము చేసికొని, ఒక నూతన మార్గమును ననుసరింప వలెనని ఉద్బోధించెను. కాని, దీనివలన ప్రయోజనము లేకపోవుటయే గాక, ఇరు దేశములవారు అతనిని కొంత అపార్థము చేసికొనిరి.

ఆ తరువాత, ఎరవాడ జైలులో Communal Award (కమ్యూనల్ అవార్డ్) సందర్భమున మహాత్ముడు కులవిచక్షతను ప్రతిఘటించుటకై నిరశన దీక్ష ప్రారంభించెను. రవీంద్రుడు చాల ఆదుర్దాపడెను. కాని, జాతిద్వేషము రూపుమాపుట ఉచితకార్యమని భావించుటచే నిరశన దీక్ష మానుమని అందరి వలె నాతడు మహాత్ముని కోరలేదు. ఐనను, మహాత్ముడు దీక్ష విరమించునప్పుడు రవీంద్రుడు పూనా వెళ్లి అతని చెంతనే యుండెను.

ఆఖరు దినములలో రాజకీయ భావములలోనేగాక ఇతర విధములగూడ రవీంద్రుడు ఏకాకియయ్యెను. ఒక్క అక్క గారు తప్ప, తక్కిన అన్నగార్లు, అప్పగార్లు అందరు ఇదివరకే మరణించిరి. అతని భార్య, ముగ్గురు పిల్లలు కూడ పోయిరి. మిగిలిన ఒక్క కొడుకును, కూతురును, మనుమని, మనుమ రాలిని ఆతడు చాల ప్రేమించుచుండెను. మనుమడు జర్మనీలో చదువుచుండెను. 1932 లో ఇరవైయేండ్లయినా నిండకమును పే ఇతడును మరణించెను. కొన్ని సంవత్సరముల క్రిందటనే

వృద్ధాప్యమున రవీంద్రుడు

రవీంద్రుని ఆప్త మిత్రుడు పియర్సన్ ఇటలీలో రైలు ప్రమాదమువలన మరణించెను. 1935 లో రవీంద్రుని మేనల్లుడు దినేంద్రుడు కూడ మరణించెను. ఇక మిగిలినది ఆండ్రూస్ మాత్రమే!

వృద్ధాప్యములో రవీంద్రునికి ప్రతినిత్యము సన్మాన సభలు జరుగుచుండెను. అందరు నాతని గౌరవించుచుండిరి. ఓపిక ఉన్నంతవరకు రవీంద్రుడు సభలలో మాట్లాడుచు తన ఆదర్శములైన శాంతి, జాతీయత, సాహసము, స్వాతంత్ర్యము మున్నగు వానిని గురించి ప్రజలకు చెప్పుచుండెను. 1936 లో బ్రస్సెల్సులో World Peace Conference (ప్రపంచ శాంతి సభ) జరిగెను. అచ్చటి నాయకులు రవీంద్రుని సందేశము పంపమని కోరిరి. 'బలవంతులు దురాశను విడచిపెట్టి, బలహీనులు సాహసవంతులగువరకు శాంతి లభింపదని రవీంద్రుడు సందేశమంపెను. 1937 లో కలకత్తా విశ్వవిద్యాలయ పట్టప్రదానోత్సవమున రవీంద్రుడు మాట్లాడెను. ప్రభుత్వ అధికారికాని వ్యక్తి విశ్వవిద్యాలయములో మాటలాడుట కదియే తొలిసారి. రవీంద్రుడు ఆంగ్లమున కాక, వంగభాషలోనే మాట్లాడెను. అదికూడ అపూర్వమే.

రవీంద్రుడు చివరవరకు పాటలు, పద్యములు రచించుచునే యుండెను. 1930 నుండి చిత్రలేఖనము కూడ చేయుచుండెను. డెబ్బది సంవత్సరముల వయస్సులో క్రొత్త కళను ప్రారంభించుటతో నాతని ఉత్సాహము మానసిక నిత్య యౌవనము తెలియును. 1930 లో ఇంగ్లండ్ వెళ్లినప్పుడు కూడ తన చిత్రములు తీసికొని వెళ్లి అక్కడ ప్రదర్శనములు జరిపెను. ఆతడు చిత్రించుట ప్రారంభించిన విధము విచిత్రమైనది. కథలు

పద్యములు వ్రాసినప్పుడు మధ్యమధ్య కొన్ని పదములు, వాక్యములు కొట్టివేసెడివాడు. తరువాత విలాసముగ, ఈ కొట్టివేసిన గీతలను ఒకదానితో నొకటి కలుపుచు, చివర వంపులు దిద్దుచు, మధ్యమధ్య మరికొన్ని గీతలు గీయుచు నాడుకొనువాడు. ఈ విధముగ తాను కొట్టివేసిన గీతలతో ఒక చిత్రము రూపు చెందెడిది. తరువాత, రవీంద్రుడు వేర్వేరు దృశ్యములను చిత్రించుట ప్రారంభించెను. యూరోపియన్ చిత్రకారులు అతని చిత్రములను చాల మెచ్చుకొనిరి.

రవీంద్రుడు చివరి దినములలో ఎక్కువగ ప్రయాణములు చేయలేకపోయినను అన్ని కార్యక్రమములలో పాల్గొనుచునే యుండెను. అతని కలలు పండి 1937 లో శాంతినికేతనములో చీనాహాల్, తరువాత 1939 లో హిందీహాల్ కట్టబడెను. హిందీహాల్ ప్రారంభోత్సవమును జవహర్‌లాల్ నెహ్రూ జరిపెను. 1937 లో రవీంద్రునికి చాల జబ్బు చేసెను. కాని, అతడు తిరిగి కోలుకొనెను. విశ్వపరిచయము అను గ్రంథమును వంగభాషలోనే వ్రాసెను. ఇందు వైజ్ఞానిక విషయములను పేర్కొనెను. 1938 లో నొక హాస్య నాటిక రచించెను. 'చండాలిక' అను నాటకమునకు పాటలు వ్రాసెను. వంగభాషా పరిచయము అను గ్రంథము కూడ వ్రాసెను. వంగభాషను సరళముగ అందముగ వ్రాయుటెట్లో ఇందు చూపించెను. 1939 లో రవీంద్రుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్ శత వార్షికోత్సవమునకు మిడ్నపూర్ వెళ్లెను. విద్యాసాగర్ వంగభాషా రచనకు తండ్రి వంటివాడు. రవీంద్రుడు యువరచయితలను చాల ప్రోత్సహించి సహాయపడువాడు.

1939 లో ఆండ్రూస్ తిరిగి శాంతినికేతనమును చేరెను. రవీంద్రుడు చాల సంతోషించెను. కాని, ఒక నెలలోనే, ఆండ్రూస్‌కు జబ్బు చేసెను. వైద్యము కొరకు కలకత్తా వెళ్లెను. 1940 లో నాతడు మరణించెను. ఈ సంవత్సర మంతయును కష్టములతోనే గడచెను. యూరోప్‌లో యుద్ధము ప్రారంభమయ్యెను. డెన్‌మార్క్, నార్వే, ఫ్రాన్స్ మున్నగు దేశములపై దండయాత్రలు జరుగుచుండెను. ఈ దేశము లన్నింటిలో రవీంద్రునికి మిత్రులు గలరు. వారిని గురించి, అచ్చటి సామాన్య ప్రజల కష్టముల గురించి అతడు చాల బాధపడెను. యుద్ధములలో నెప్పుడును అమాయకులే ఎక్కువ ఆపదల పాలగుదురు. చీనాలో గూడ ప్రజలు యుద్ధమువలన బాధపడుచుండిరి. ఈ దుఃఖములన్ని మరచిపోవుటకు రవీంద్రుడు తన చిన్ననాటి దినముల స్మరించుకొనుచు కాలము గడుపుచుండెను. అప్పుడే My Boyhood (నా బాల్య దశ) అను గ్రంథమును చాల మనోరంజకముగ వ్రాసెను.

ఆగస్ట్ 1940 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమువారు రవీంద్రుని గౌరవార్థము డాక్టరు డిగ్రీ నిచ్చిరి. ఈ ఉత్సవము శాంతినికేతనములోనే జరిగెను. సర్ మారిస్ గ్వైర్, సర్వేపల్లి రాధాకృష్ణన్ పట్టప్రధాన మహోత్సవము జరిపిరి. అంతా లాటిన్ భాషలో జరిగెను. రవీంద్రుడు సంస్కృతములో జవాబిచ్చెను. ఈ విధముగ విశ్వభారతిలో ప్రాక్ పశ్చిమముల కలయిక జరిగెను.

కొన్నాళ్లకే తరువాత అతనికి జబ్బు చేసెను. చాల రోజులు కలకత్తాలో వైద్యము చేసిన తరువాత కొంచెము నయమై, శాంతినికేతనమునకు తిరిగి వచ్చెను. కాని, చాల

భాగము పడకమీాదనే యుండెను. ఐనను ఊరకుండక, యేవో పద్యములు, కథలు వ్రాయుచునే యుండెను. తాను స్వయముగ వ్రాయలేనప్పుడు లేఖకులచేత వ్రాయించు చుండెను. 1941 లో శాంతినికేతనములో నాతని ఎనుబదవ వర్థంతి జరిగెను. రవీంద్రుడు మిత్రులతో, విద్యార్థులతో కలసి, తాను వ్రాసిన సందేశము నొకడు చదువగా వినెను. ఇదియే ఆయన ఆఖరు సందేశము. ఇది 'విశ్వభారతి' పత్రికలో ప్రకటింపబడెను. హిందూదేశమంతటా ఆయన జన్మదినోత్సవము జరిపిరి. అనేకమంది శుభాకాంక్షలు పంపిరి. 'విశ్వభారతి' పత్రిక రవీంద్రుని జన్మదిన విశేషసంచిక ప్రకటించెను. ఇందు రవీంద్రుని జీవితము గురించి, రచనల గురించి అనేక విషయములు తెలుపబడెను.

క్రమముగ, రవీంద్రుని ఆరోగ్యము క్షీణించెను. తరుచు జ్వరము వచ్చుచుండెను. 1941 జూలై నెలలో వైద్యము కొరకు కలకత్తా వెళ్లెను. ఆశ్రమములోని వారందరు వాకిలి వరకు వచ్చి రవీంద్రుని దగ్గర మౌనముతో సెలవు తీసికొనిరి. రవీంద్రుడు పోవుచుండగ మెల్లగా శాంతినికేతనపాట పాడిరి. కలకత్తాలో వైద్యము ఫలించలేదు. జొరసాంకాలో, పుట్టిన ఇంటిలోనే 1941 ఆగస్టు ఏడవ తేదీన రవీంద్రుడు మరణించెను. ఆతని భౌతిక దేహమును గంగానది ఒడ్డున నిమ్‌తోలాఘాట్ దగ్గర దహనము చేసిరి.

మృత్యుద్వారమును చేరుచు రవీంద్రుడు ఒక గీతమును వ్రాసెను. దాని భావ మిది:

'ఈ వీడ్కోలు సమయమందు, మిత్రులార!
నాకు శుభాకాంక్షలిందు!!
ఆకాశము ప్రాతఃకాంతితో నిండినది;
నామార్గము సుందరము;
అక్కడికేమి తీసికొనిపోదునని అడుగకయే
రిక్త హస్తములతో, ఆశా హృదయముతో
ప్రయాణము ప్రారంభించితిని;
ఈ జీవితము నాకు ప్రియము
అట్లే, మృత్యువునుగూడ ప్రేమింతును;
అది నాకు తెలియును.'

రవీంద్రుడు 'పోస్టాఫీస్' అను నాటికలో నాటకాంతమున అమల్ అను బాలుడు ధైర్యముతో మృత్యువును చేరుచు పాడుట కొరకు పాట వ్రాసెను. కాని, ఆ నాటకము ఎన్నడు ప్రదర్శింపబడలేదు. రవీంద్రుని కోరికపై శాంతినికేతనములో నాతని అంత్య క్రియలు జరుగుచుండగా నా పాట తొలిసారిగ పాడిరి. దానిభావ మిది:

'ఎదుటనే శాంతి సముద్రము
పడవ నడుపుము, నావికా!
ఐహిక బంధములు విడిపోనిమ్ము
విశాల విశ్వమాతని ఒడిచేర్పనిమ్ము!
నిశ్చయముగ నాతడు మదిలో
తెలియని ఉదాత్తమూర్తిని
తెలిసికోనిమ్ము!...'

R.B.A.N.M'S H.S (M) LIBRARY
B lore-42
Accession No; 3193
U.D.C No: 8-3P N
Date; 16-4-82

U.D.C No: 8-3P N
Date; 16-4-82

R. B. A. N. M's
High School (Main) Library
BOOK CARD

Author. —
Title. "Jagruthi" Life History of Rabendranath Tagore.
Accession No. 3193
Class No. 8-3p N

| Name of the Borrower | Card No. | Due Date |
| --- | --- | --- |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

R.B.A.N.M.'s High School (Main)
LIBRARY